ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 15.10.2026 | సంపుటి :13 సంచిక : 86 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



హైదరాబాద్ హైటెక్స్‌లో నిర్వహించిన సమాఖ్య సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్, వి.హనుమంతరావు, పలువురు ప్రముఖులు

# పెట్టుబడులకు పూర్తి రక్షణ

**తెలంగాణ రైజింగ్‌లో భాగస్వామ్యం కండి • యువ పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక ఆహ్వానం**

- మంచి పాలసీతో ఎవరు వచ్చినా..
- ప్రోత్సహిస్తున్నాం
- ప్రభుత్వానికి పాలసీ పెరాలసిస్ లేదు
- ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తెలంగాణ
- ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి
- ప్రభుత్వం పరంగా పూర్తి సహకారం
- సమాఖ్య గ్లోబర్ బిజినెస్ మీట్‌లో
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు తెలంగాణ ఓ భరోసా అని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ రైజింగ్ పాలసీతో అనుకూలమైన విధానాలను అనుసరి స్తున్నామని తెలిపారు. హైదరాబాద్ హైటెక్స్‌లో సమాఖ్య సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. జనాభా శాతాన్ని మించి తెలంగాణ రాష్ట్రం జీడీపీకి తన వాటా అందిస్తోందిన్నారు. కాంగ్రెస్

మిగతా 2లో..

"దేశ, విదేశాల నుంచి వస్తున్న పెట్టుబడుల ద్వారా యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషిచేస్తున్నాం. సత్య నాదెళ్ల లాంటి వారు గ్లోబల్ కంపెనీలకు సీఈవోలుగా అత్యున్నత సేవలు అందిస్తున్నారు. కానీ వారు ఆ సంస్థలకు యజమానులు కారు. బహుళజాతి కంపెనీలకు సేవలందించే స్థాయి నుంచి మన యువత సంస్థలను స్థాపించి యజమానులుగా ఎదగాలి. స్టైరూట్ తరహాలో మరిన్ని స్టార్టప్ కంపెనీలు పుట్టుకు రావాలి" - సీఎం రేవంత్ రెడ్డి,

## యూకే-తెలంగాణ సంబంధాలు పటిష్టం

• వైద్యం, డిజిటల్ టెక్నాలజీ, రక్షణ, ఏరోస్పేస్, టెక్స్‌టైల్స్, పరిశోధన, తయారీ రంగాల్లో పరస్పర సహకారం • యూకే బృందంతో సీఎం భేటి



2లో..

## విద్యుత్ సరఫరాలో అంతరాయాలొద్దు

- సరఫరా సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలి
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సస్పెండ్ చేస్తాం
- ఎల్‌నినో ప్రభావంపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

## శాంతియుత నిరసన నేరం కాదు



**అలా చేసిన యువకులపై కేసులు పెట్టి జైలుకు పంపడమేంటి?**

**సీజేపీకి రాహుల్ గాంధీ మద్దతు**

- జంతర్‌మంతర్ వద్ద నిరసన చేపట్టిన సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలకు సంఘీభావం
- జంతర్‌మంతర్‌ను తిరిగి నిరసన ప్రదేశంగా సాధించుకుంటామని ధీమా
- కాంగ్రెస్ అగ్రనేతకు ధన్యవాదాలు తెలిపిన అభిజిత్ దీప్కే

న్యూఢిల్లీ(జనంసాక్షి): జంతర్‌మంతర్ వద్ద నిరసన చేపట్టిన సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంఘీభావం తెలిపారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిని అరెస్టు చేయడం దుర్మార్గపు చర్య అని కేంద్రాన్ని విమర్శించారు. "జాతీయ జెండాను ప్రదర్శిస్తూ శాంతియుతంగా నిరసన తెలపడం నేరం కాదు. అలా చేసిన యువకులపై కేసులు పెట్టి జైలుకు పంపడం ఏంటి? రాజ్యాంగ హక్కులను కాపాడుకోవడం అందరి బాధ్యత. జంతర్‌మంతర్‌ను తిరిగి నిరసన ప్రదేశంగా సాధించుకుంటాం" అని రాహుల్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. రాహుల్ గాంధీ పోస్ట్‌పై కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పందిస్తూ కాంగ్రెస్ నేతకు ధన్యవాదాలు తెలిపారు. జంతర్ మంతర్‌ను ధర్నా వేదికగా డీనోటిఫై చేస్తూ ఢిల్లీ పోలీసులు ఇటీవల ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయాన్ని సీజేపీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ క్రమంలోనే సీజేపీ ముఖ్య నేతలు జంతర్ మంతర్ వద్దకు చేరుకుని నిరసనలకు య త్నించారు. దీంతో నిబంధనలు ఉల్లంఘించినం దుకు గానూ పోలీసులు వారిని అరెస్టు చేసి జైలుకు తరలించారు.

## 'కాక్రోచ్'పై కాదు.. సమస్యలపై దృష్టిపెట్టండి

కేంద్రంపై అభిజీత్ దీప్కే విమర్శలు

జ్ఞానేష్‌పై ప్రతిపక్షాల పిటిషన్..

## రిజిష్టర్ చేసిన సుప్రీం

అక్టోబర్ 26న కేసు విచారణకు వచ్చే అవకాశం

## ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు

నిరసన తెలిపేందుకే రాజ్యాంగం హక్కు కల్పించింది.. చట్టాన్ని ఉల్లంఘించడానికి కాదు

రాహుల్‌కు భాజపా హితవు

వివరాలు 9వ పేజీలో..

# సింగరేణిపై శీతకన్ను



**కమీషన్లు పంచుకునేందుకు సంస్థను కొల్లగొడుతున్నారు**

- ఆధారాలతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి లేఖ రాశాం
- వాటాలు కుదరక నైనీ టెండర్లను రద్దు చేశారు
- 'సింగరేణి కార్మిక గర్జన' కార్యక్రమంలో కేటీఆర్

గోదావరిఖని(జనంసాక్షి): తెలంగాణకు గుండెకాయ అయిన సింగరేణి కాలరీస్ సంస్థను కాంగ్రెస్ ప్రభుత్వం నిలువునా దోచుకుంటోందని, కమిషన్ల కక్కుర్తితో సంస్థను సర్వనాశనం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని సింగరేణి జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన భారీ 'సింగరేణి కార్మిక గర్జన' బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, దాదాపు 40 నిమిషాల పాటు ఉద్వేగభరితంగా ప్రసంగించారు. కేసీఆర్ పేరు తలవగానే ఈ కోల్‌బెల్ట్ మొత్తం కదిలివస్తుందని, కార్మికుల పక్షాన బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సింగరేణి సంస్థను బలహీనపరిచే కుట్రలు జరుగుతున్నాయని కేటీఆర్ ఆరోపించారు. కార్మికుల సంక్షేమాన్ని విస్మరించి, నిధుల మళ్లింపునకు పాల్పడుతూ సంస్థను నిలువునా ముంచేస్తున్నారని మండిపడ్డారు. సంస్థలో నాణ్యమైన బొగ్గు ఉత్పత్తిని పక్కనపెట్టి, విదేశాల నుంచి అత్యధిక ధరకు బొగ్గు దిగుమతి చేసుకుంటూ కాంగ్రెస్ పెద్దలు అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. కమిషన్ల కోసం తీసుకుంటున్న ఈ తుగ్లక్ నిర్ణయాల వల్ల సింగరేణి ఆర్థిక మూలాలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సింగరేణి కార్మికులకు దక్కిన గౌరవం, బోనస్‌లు, సంక్షేమ పథకాలను నేడు కాంగ్రెస్ పాలకులు నీరుగారుస్తున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం, సింగరేణి అస్తిత్వాన్ని కాపాడేందుకు బీఆర్ఎస్ పార్టీ, టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలను మరింత ఉధృతం

మిగతా 2లో..

## పాలమూరులో మళ్లీ వలసలు

**కాంగ్రెస్ పాలనే కారణం: హరీశ్ రావు**

మహబూబ్‌నగర్(జనంసాక్షి): కేసీఆర్ ఎప్పుడో చెప్పారు.. కాంగ్రెసోళ్లు గెలిస్తే రైతు బంధుకు రాం రాం.. దళిత బంధుకు జై భీమ్.. అయిందా మరి ఇప్పుడు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. గద్వాల రైతుల సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. మూడు పంటలకు రైతు బంధు ఎగ్గొట్టిండు. రైతు బీమా బంద్ పెట్టిండు. 24 గంటల కరెంట్ 7 గంటలకు వచ్చేసింది.. కళ్యాణ లక్ష్మి పిల్లలు పుట్టినంక వస్తుంది.. కేసీఆర్ ఉన్నప్పుడు కల్యాణలక్ష్మి పెళ్లికి వచ్చింది.. రేవంత్ రెడ్డి వచ్చినంక పిల్లలు పుట్టిన తర్వాత వచ్చింది. తులం బంగారం

మిగతా 2లో..



**పేదలు నివసించే ప్రాంతాల్లోనే**

# ఇందిరమ్మ టవర్లు



- వారికి గౌరవప్రదమైన నివాసం కల్పించాలనే లక్ష్యంతోనే నిర్మిస్తున్నాం
- ప్రతిపక్ష ఎమ్మెల్యే ఉన్నా అర్హులైన పేదలకు కేటాయింపులో
- ఎలాంటి వివక్షకు తావులేదు.. మొదటి విడతలో లక్ష ఇళ్ల నిర్మాణం
- తదుపరి విడతలో కొత్త దరఖాస్తుదారులు
- పోచారంలో ఇందిరమ్మ టవర్స్‌కు మంత్రి పొంగులేటి శంకుస్థాపన

మేడ్చల్(జనంసాక్షి): పేదలు నివసించే ప్రాంతాల్లోనే వారికి గౌరవప్రదమైన నివాసం కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పోచారంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఇంచార్జీ మంత్రి దుద్దిళ్ల శ్రీధంబాబు, ఎంపీ ఈటల రాజేందర్, స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి తదితర నేతలు పాల్గొన్నారు. ప్రజా ప్రభుత్వం పార్టీల తేడా లేకుండా రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గాన్ని సమానం చూస్తుందని పొంగులేటి స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే ఉన్నా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించడంలో ఎలాంటి వివక్షకు తావులేదని మంత్రి వెల్లడించారు.

**మొదటి విడతలో లక్ష ఇళ్ల నిర్మాణం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో హైదరాబాద్‌లో భూముల విలువ ఎకరాకు వందల కోట్ల రూపాయలు ఉన్నప్పటికీ, పేదలు నివసించే ప్రాంతాల్లోనే వారికి గౌరవప్రదమైన నివాసం కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి పొంగులేటి అన్నారు. నగరంలో జీవనోపాధి పొందుతున్న పేదలను దూర ప్రాంతాలకు తరలించి వారి ఉపాధికి ఇబ్బందులు కలిగించే విధానానికి స్వస్తి పలుకుతున్నామని తెలిపారు. క్యూర్ పరిధిలో మొదటి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని, 23 నియోజకవర్గాల్లో పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేశామని వెల్లడించారు. ఇప్పటికే ఆరు చోట్ల ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి

మిగతా 2లో..




## నిన్న ఏయిరిండియా.. నేడు ఐడీబీఐ

**ఫెయిర్‌ఫాక్స్ చేతికి ఐడీబీఐ బ్యాంక్..**

**కేంద్ర క్యాబినెట్ ఆమోదం**

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఐడీబీఐ బ్యాంక్‌లోని మెజారిటీ వాటాను విక్రయించే ప్రతిపాదనకు కేంద్ర క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బ్యాంకులోని 60.72 శాతం వాటాను కెనడాకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్‌కు రూ. 52,878 కోట్లకు విక్రయించే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ఎయిరిండియా తర్వాత దేశంలోనే అతిపెద్ద వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణగా నిలవనుంది. ప్రధాని మోదీ నేతృత్వంలో జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్‌కమిటీ ఇందుకు ఆమోదం తెలిపింది. ఈ లావాదేవీ పూర్తయితే ఫైనాన్షియల్

మిగతా 2లో..

**ఆటోమేటిక్ వర్క్ పర్మిట్ పొడిగింపు**

# నిలిపివేత



**వలసదారులకు ట్రంప్ మరో షాక్..**

**ఈ మేరకు కొత్త నిబంధనలు జారీ చేసిన యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ**

వాషింగ్టన్(జనంసాక్షి): వలసదారులపై కఠిన విధానాలు అమలుచేస్తోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తాజాగా మరో నిర్ణయం తీసుకుంది. కొందరు ప్రత్యేక వలసదారులకు ఆటోమేటిక్ వర్క్ పర్మిట్ పొడిగింపును నిలిపివేసింది. ఈ మేరకు యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ కొత్త నిబంధనలు జారీ చేసింది అమెరికాలో కొందరు ప్రత్యేక వలసదారులకు ఉపాధి అనుమతి పత్రాల గడువు ముగిసిన తర్వాత వారి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే.. 540 రోజుల పాటు 'ఆటోమేటిక్ పొడిగింపు' ఉండేది. యూఎస్‌సీఐఎస్‌లో దరఖాస్తుల పరిశీలనలో ఆలస్యం వల్ల వలస ఉద్యోగులు తమ ఉపాధిని కోల్పోకుండా ఉండేలా ఇంతకాలం ఈ పొడిగింపు అమల్లో ఉంది అయితే, భద్రతా సమీక్షలు, వలసదారుల అర్హతలను సమగ్రంగా తనిఖీ చేసేందుకు ఇప్పుడు దానిని శాశ్వతంగా రద్దు చేసేలా ట్రంప్ సర్కార్ కఠిన చర్యలకు ఉపక్రమించింది. దీంతో హెచ్-1బీ వీసాదారుల జీవిత

మిగతా 2లో..

## రష్యా డీజిల్ కొనుగోలు ప్రపంచం కోసమే..

పుతిన్‌తో ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విచిత్ర వివరణ

2లో..

## ఇరాన్‌పై మళ్లీ దాడులు!

ట్రంప్- నెతన్యాహు రహస్య చర్చలు!

## హర్మూజ్‌లో సీమైన్‌ను ఢీకొని మునిగిన నౌక..

## జర్మనీలో అగ్నిప్రమాదం..

ముగ్గురు భారతీయుల మృతి



వివరాలు 2వ పేజీలో..

**పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు..**

## నార్లాపూర్ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోత షురూ..



నాగర్‌కర్నూల్ (జనంసాక్షి): నార్లాపూర్ పంప్ హౌస్‌లో రెండో పంప్ హౌస్‌ను మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. దీంతో ఇందులోని రెండు బాహుబలి మోటార్లతో నార్లాపూర్ రిజర్వాయర్లలోకి నీటి ఎత్తిపోత ప్రారంభమైంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో నార్లాపూర్ పంప్ హౌస్‌లో రెండో పంపును మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. రెండు బాహుబలి మోటార్లతో నార్లాపూర్ రిజర్వాయర్లలోకి నీటి ఎత్తిపోత ప్రారంభమైంది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలలోని కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు చేసి బాహుబలి పంప్‌లను ప్రారంభించారు.

మిగతా 2లో..

## ఆలయ సన్నిధిలో చిన్నారితో అసభ్య ప్రవర్తన

**మహారాష్ట్రలోని పుణెలో ఘటన**

ముంబై(జనంసాక్షి): మహారాష్ట్రలోని పుణెలో సభ్యసమాజం నివ్వెరపోయే ఘటన చోటుచేసుకుంది. దైవ దర్శనం కోసం గుడికి వచ్చిన ఓ బాలికపై విచక్షణ మరిచి ప్రవర్తించాడో వ్యక్తి. ఆలయ

మిగతా 2లో..



## రైల్వే ఉద్యోగులకు తీపికబురు

78 రోజుల బోనస్

2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
15.10.2026

# జర్మనీలో అగ్నిప్రమాదం.. ముగ్గురు భారతీయుల మృతి

**బెర్లిన్(జనంసాక్షి):** జర్మనీలోని బాకూమ్ నగరంలో ఓ నివాస సముదాయంలో జరిగిన అగ్నిప్రమాదంలో ముగ్గురు భారతీయులు మృతి చెందారు. మరో ఐదుగురికి గాయాలయ్యాయి. మృతుల వయసు 25 నుంచి 27 మధ్య ఉన్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. మంగళవారం ఈ ఘటన జరిగినట్లు పేర్కొంది. చనిపోయిన వారిలో ఇద్దరు మహిళలు ఉన్నట్లు సమాచారం. భారతీయులని ప్రాథమికంగా గుర్తించినప్పటికీ.. వారు ఏ రాష్ట్రాలకు చెందిన వారినే విషయం ఇంకా స్పష్టత రాలేదు.దర్యాప్తు చేపట్టిన స్థానిక పోలీసులు.. ఈ ఘటన వెనుక మానవ ప్రమేయం, కుట్ర దాగుందనే అనుమానం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో రొమేనియాకు చెందిన ఓ అనుమానితుడిని అరెస్టు చేశారు. అతడు కూడా ఇదే భవనంలో నివసిస్తున్నట్లు గుర్తించారు. హత్య అని అనుమానించేందుకు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని, ఉద్దేశపూర్వకంగానే నిప్పు పెట్టినట్లు తెలుస్తోందని పోలీసులు పేర్కొన్నారు.

# రైల్వే ఉద్యోగులకు తీపికబురు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దసరా, దీపావళి పండగల వేళ కేంద్రం రైల్వే ఉద్యోగులకు శుభవార్త చెప్పింది. వీరికి బోనస్ చెల్లించేందుకు కేంద్ర క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 78 రోజుల వేతనాన్ని 'ఉత్పాదకతతో ముడిపడిన బోనస్' రూపంలో చెల్లించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో దాదాపు 11.40లక్షల మంది నాన్–గెజిటెడ్ రైల్వే ఉద్యోగులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ బోనస్ చెల్లింపుల కోసం నిధులు కేటాయించింది.రైల్వే పనితీరును మెరుగుపరిచేలా ఉద్యోగుల్ని ప్రోత్సహించడానికి ఈ బోనస్ చెల్లింపు ఉపయోగపడుతుందని రైల్వే మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. అయితే, 78 రోజుల బోనస్ అయినా చెల్లింపులపై పరిమితి వల్ల ఒక్కో ఉద్యోగికి గరిష్ఠంగా రూ.17,951 మాత్రమే లభించనుంది. ట్రాక్ మెయింటెనర్స్, లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్స్, స్టేషన్ మాస్టర్లు, సూపర్‌వైజర్లు, టెక్నీషియన్లు, టెక్నీషియన్ హెల్పర్లు, పాయింట్‌మ్యాన్‌తో పాటు ఇతర గ్రూప్–సి సిబ్బందికి ఈ బోనస్ వర్తిస్తుంది. కాగా.. 2025–26 ఆర్థిక సంవత్సరంలో రైల్వే 1670 మిలియన్ టన్నుల కార్గో రవాణా చేపట్టగా.. దాదాపు 741 కోట్ల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చింది.

# హర్మూజ్‌లో సీమైన్‌ను ఢీకొని మునిగిన నౌక

**టెహ్రాన్(జనంసాక్షి):** అమెరికా ఇరాన్ మధ్య ఉద్రిక్తతలకు బ్రేక్ పడినా.. ఇంధన రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిలో అంతరాయాలు కొనసాగుతున్నాయి. తమ హెచ్చరికలు పట్టించుకోని నౌకలపై ఇప్పటికే అమెరికా–ఇరాన్ దాడులు చేస్తుంటే.. మందుపాతరలు మరో ముప్పుగా మారాయి. యుద్ధం ప్రారంభమైన సమయంలో ఇరాన్ వాటిని హర్మూజ్‌లో అమర్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఓ చమురు ట్యాంకర్ సీమైన్లను ఢీకొని మునిగిపోయింది ఈ విషయాన్ని ఐఆర్‌జీసీ వెల్లడించింది.హర్మూజ్‌లోని ప్రమాదకర మార్గంలో ప్రయాణించడం వల్ల ఈ ప్రమాదం చోటుచేసుకుందని ఐఆర్‌జీసీ పేర్కొంది. ఆ నౌకలో 2500 కంటైనర్ల కార్గో ఉన్నట్లు సమాచారం. అది ఏ దేశానికి చెందినది?ఎంతమంది సిబ్బంది ఉన్నారు?వారు సురక్షితంగా ఉన్నారా?లేదా అనే విషయాలు తెలియాల్సి ఉంది. ఈ క్రమంలో తమ అనుమతి లేకుండా జలసంధి గుండా ప్రయాణించడానికి ప్రయత్నించవద్దని ఇరాన్ మరోసారి ప్రపంచ దేశాలను హెచ్చరించింది.

# ఆలయ సన్నిధిలో చిన్నారితో అసభ్య ప్రవర్తన

సన్నిధిలో ఆ చిన్నారితో అసభ్యంగా ప్రవర్తించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నిగ్డి ప్రాంతంలోని గుడికి వెళ్లిన ఆ బాలిక దేవుడిని దర్శించుకున్న తర్వాత బొట్టు పెట్టుకోవడానికి తలుపు దగ్గర ఉన్న అద్దం వద్దకు వెళ్లింది. ఆ సమయంలో ఆమె ఒంటరిగా ఉన్నట్లు గమనించిన కార్మికుడు ఆలయంలోకి ప్రవేశించాడు. బాలికను అభ్యంతరకరంగా తాకడానికి యత్నించగా.. ఆమె భయంతో కేకలు వేసింది. దీంతో వెంటనే అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు సీసీ టీవీ దృశ్యాల ఆధారంగా కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి, దర్యాప్తు చేపట్టారు.

# నిన్న ఏయిరిండియా.. నేడు ఐడీబీఐ

సెక్టార్‌లో అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిగా నిలుస్తుందని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. ప్రభుత్వం, ఎల్ఐసీకి విక్రయానంతర సంస్థలో 34 శాతం వాటా ఉంటుందని మంత్రి తెలిపారు. ప్రభుత్వం, ఎల్ఐసీ కలిసి 60.72 శాతం వాటాను ఫెయిర్‌ఫాక్స్‌కు బదలాయించనున్నాయని చెప్పారు. "ఐడీబీఐ బ్యాంక్‌లోని 60.72 శాతం వాటాను (ప్రభుత్వం 30.48%+ ఎల్ఐసీ 30.24%) రూ.52,877.07 కోట్లకు విక్రయించేందుకు ఆర్థిక వ్యవహారాల కమిటీ ఆమోదించింది" అని ప్రభుత్వం ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరిలోగా ఈ లావాదేవీ పూర్తవుతుందని దీపమ్ కార్యదర్శి అరుణిష్ చావ్లా వెల్లడించారు.

# పెట్టుబడులకు పూర్తి రక్షణ



ప్రభుత్వానికి పాలసీ పెరాలసిస్ లేదని మంచి పాలసీతో ఎవరు వచ్చినా ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు. ఏ దేశ ఆర్థిక వ్యవస్థ బలపడ్డా అందులో మహిళల భాగస్వామ్యం ఉన్న దేశమే అత్యధికంగా ఆర్థికంగా ఎదిగిన దేశమని రేవంత్ రెడ్డి తెలిపారు. అందుకే రాష్ట్రంలో మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. పెట్టుబడులు పెట్టే యువ పారిశ్రామికవేత్తలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆహ్వానం పలుకుతుందని రేవంత్ రెడ్డి తెలిపారు. కొత్త పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూమి, రాయితీలు, ప్రోత్సాహకాలతో సమగ్ర విధానం రూపొందించిందన్నారు. తెలంగాణను మూడు ఎకనామిక్ జోన్లుగా అర్బన్, పెరి–అర్బన్, రూరల్ విభజించి అభివృద్ధి చేస్తామన్నారు. సర్వీస్?, తయారీ, వ్యవసాయ రంగాలకు సమప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వ ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. 2034 నాటికి ట్రిలియన్ డాలర్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దుతామని రేవంత్ రెడ్డి తెలిపారు. దేశ జనాభాలో రాష్ట్ర వాటా 2.5 శాతమే అయినా జీడీపీలో 5 శాతం తెలంగాణ నుంచే అందిస్తున్నామని చెప్పారు. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పెట్టుబడులు, కచ్చితమైన ప్రణాళికలు, పారిశ్రామికవేత్తల భాగస్వామ్యంతోనే ఈ లక్ష్యాల సాధన సాధ్యమని సీఎం పేర్కొన్నారు. వ్యక్తులుగా కంటే అందరూ ఒక కమ్యూనిటీగా ఏకమైతేనే యువతకు మరింత బలమని అభిప్రాయపడ్డారు.మహిళల భాగస్వామ్యం ఉన్నప్పుడే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని రేవంత్ రెడ్డి తెలిపారు. మహిళా సాధికారత, ఉపాధి కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం మాత్రమే కాకుండా ఆ సంస్థకు 1,000 బస్సులను అద్దెకు ఇచ్చే యజమానులుగా మహిళా సంఘాలు ఎదిగాయన్నారు. కార్పొరేట్ దిగ్గజాలకు ధీటుగా మహిళా సంఘాల ద్వారా 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి, జెన్‌కోకు సరఫరా చేస్తున్నారన్నారు. ప్రతి జిల్లాలోనూ మహిళా సంఘాలకు భూములు కేటాయించి, పెట్రోల్ బంకుల నిర్వహణ బాధ్యతలు అప్పగించామన్నారు. శిల్పారామం వద్ద 3.5 ఎకరాల్లో ఇందిరా మహిళా శక్తి బజార్ల ఏర్పాటు అంతర్జాతీయ స్థాయి మార్కెటింగ్‌కు వేదిక అని రేవంత్ రెడ్డి తెలిపారు. యువతతో పాటు మహిళా పారిశ్రామికవేత్తలను కూడా సమాఖ్య ప్రోత్సహించాలని కోరారు. ప్రభుత్వం పరంగా పూర్తి మద్దతిస్తామని ఆయన పేర్కొన్నారు. పారిశ్రామిక అభివృద్ధిలో రాజకీయాలకు తావులేదన్నారు. గత 30 ఏళ్లుగా ఉన్న మంచి విధానాలను తమ ప్రభుత్వం మార్చలేదని గుర్తుచేశారు. 'తెలంగాణలో మీ పెట్టుబడులకు పూర్తి భద్రత, లాభం, సత్వర అనుమతులు ఉంటాయి రండి మాతో కలిసి ఎదగండి' అని పారిశ్రామిక వేత్తలకు రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# పాలమూరులో మళ్లీ వలసలు

ఇష్టమన్నరు.. ఉత్తదైపోయిందా.. లేదా..? అని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి పాలమూరు ద్రోహి అన్నారు హరీశ్ రావు. ఇయ్యాళ్ల పాలమూరు బిడ్డ అని చెప్పుకునే అర్హత రేవంత్ రెడ్డికి లేదు. ఎందుకంటే నువ్వు పాలమూరు ఎత్తిపోతలను పండబెట్టినవ్.. నీళ్లు ఇయ్యలేదు. మళ్లీ పాలమూరు జిల్లాలో వలసలు మొదలైనయి. ముఖ్యంగా బీఆర్ఎస్ కార్యకర్తలకు వచ్చే మాట ఒక్కటే. నిరంజనన్న మీకు అండగా ఉన్నరు.. హనుమంతు అద్భుతంగా పనిచేస్తున్నడు. కేశవ్ ఉండనే ఉన్నారు.. అలంపూర్ ఎమ్మెల్యే మీ పక్కనే ఉన్నారు. ఏ ఆపద వచ్చినా మీకు ఎమ్మెల్యే తయారుగా ఉండనే ఉన్నడు. ఒక్క ఏదాది ఏడాదిన్నర కష్టపడండి. మీ అందరినీ కాపాడుకునే బాధ్యత మాది. ఏ కార్యకర్తకు ఇబ్బంది వచ్చినా మేమంతా మీకు అండగా ఉంటాం. మిమ్మల్నందరినీ కాపాడుకునే బాధ్యత మాది.. కచ్చితంగా గద్వాల్‌లో మీ అందరు కోరుకున్న నాయకుడినే ఎమ్మెల్యేగా ఎన్నుకుందాం.. దగ్గరుండి గెలిపించుకుందాం. తప్పకుండా మీ అందరి కష్టాలు తీర్చే బాధ్యత మన బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ నాయకత్వంలో తీసుకుందామన్నారు.

# సింగరేణిపై శీతకన్ను

చేస్తామని హెచ్చరించారు. టీబీజీకేస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ బహిరంగ సభలో కోల్ బెల్ట్ టిఆర్ఎస్ మాజీ ప్రజా ప్రతినిధులు, టీబీజీకేస్ నాయకులు, వివిధ ఏరియా నుంచి వచ్చిన సింగరేణి కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యూకే- తెలంగాణ సంబంధాలు పటిష్టం

**హైదరాబాద్(జనంసాక్షి):** ముఖ్యమంత్రితో యూకే మేయర్ల బృందం భేటీ అయ్యింది. ఈ సందర్భంగా తెలంగాణలో యూకే పెట్టుబడులకు అవకాశాలపై చర్చించారు. యూకే– తెలంగాణ వాణిజ్య సంబంధాలను పటిష్ఠం చేసేలా.. వైద్యం, డిజిటల్ టెక్నాలజీ, రక్షణ, ఏరోస్పేస్, టెక్స్‌టైల్స్, పరిశోధన, తయారీ రంగాల్లో పరస్పర సహకారంపై చర్చించారు. ఈ సందర్భంగా యూకే ఇండియా బిజినెస్ కౌన్సిల్ "యూకే– ఇండియా సీఈటీఏ అండ్ రీజినల్ సినర్జీస్" నివేదికను సీఎం ఆవిష్కరించారు.రాష్ట్ర ఉత్పాదక రంగ సామర్థ్యాన్ని, వృద్ధి అవకాశాలను సీఎం వివరించారు. తెలంగాణలో నైపుణ్యం కలిగిన ప్రతిభావంతుల లభ్యత, వ్యాపార అనుకూల వాతావరణం ఉందని చెప్పారు. 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ, మూసీ నది పునరుజ్జీవనం కోసం రూపొందించిన ప్రణాళికలను వివరించారు. డిసెంబర్ 7–9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026'లో పాల్గొనాల్సిందిగా ఆహ్వానించారు.

# విద్యుత్ సరఫరాలో అంతరాయాలొద్దు

**హైదరాబాద్:** విద్యుత్ అంతరాయాలపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు చెప్పినా పరిస్థితుల్లో మార్పు రావడం లేదని.. విద్యుత్ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో విద్యుత్ కొరత ప్రమాదం ఉన్నప్పటికీ.. ఉత్పత్తి పెంచడం లేదని మండిపడ్డారు. నైనీ, మహానది నుంచి బొగ్గు లింకేజీలున్నా.. ఆశించిన స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఏ ఒక్కరినీ ఉపేక్షించేది లేదని.. స్పెషల్ సీఎస్, జెన్‌కో సీఎండీని సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. విద్యుత్ అంతరాయాలకు వెంటనే కారణాలు తెలపాలని ఆదేశించారు. సరఫరా సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, కరవు పరిస్థితులపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించారు. జిల్లాలవారీగా వర్షాభావ పరిస్థితులను సీఎంకు అధికారులు వివరించారువిద్యుత్ అంతరాయాలపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం



చేశారు. విద్యుత్ సరఫరా సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నిసార్లు చెప్పినా పరిస్థితుల్లో మార్పు రావడం లేదన్న సీఎం ప్రమాదం ఉన్నా ఉత్పత్తి పెంచడం లేదని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, కరవు పరిస్థితులపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించారు. ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎస్ సంజయ్ జాజు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. జిల్లాలవారీగా వర్షాభావ పరిస్థితులను సీఎంకు అధికారులు వివరించారు.

**నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సస్పెండ్ చేస్తాం**

నైనీ, మహానది నుంచి బొగ్గు లింకేజీలు ఏర్పాటు చేశామని రేవంత్ రెడ్డి తెలిపారు. బొగ్గు లింకేజీలు ఉన్నా విద్యుత్ ఉత్పత్తి ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఏ ఒక్కరినీ ఉపేక్షించేది లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే స్పెషల్ సీఎస్, జెన్‌కో సీఎండీని సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. విద్యుత్ అంతరాయాలకు వెంటనే కారణాలు తెలపాలని అధికారులను సీఎం ఆదేశించారు. విద్యుత్, తాగునీటి సమస్యలు తీవ్రం కాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్న రేవంత్ రెడ్డి తాగునీటి సరఫరా సజావుగా సాగేలా ప్రణాళికలు రూపొందించాలని అదికారులను ఆదేశాలు జారీ చేశారు.క్యూర్ పరిధిలో నిర్మాణ రంగానికి ఎస్టీపీలు శుద్ధి చేసిన నీరు వాడాలని అధికారులను సీఎం ఆదేశించారు. పశుగ్రాసానికి ఇబ్బందులు రాకుండా చూడాలని, ఎల్‌నినో విపత్తుపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.

# రష్యా డీజిల్ కొనుగోలు ప్రపంచం కోసమే..

వాషింగ్టన్(జనంసాక్షి): డీజిల్ కొనుగోళ్ల కోసం రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కుదుర్చుకున్న ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు సొంత పార్టీ నుంచి కూడా తీవ్ర విమర్శల సెగ ఎదురవుతోంది ఈ నేపథ్యంలో ఆయన కాస్త వెనక్కి తగ్గారు. ఈ డీల్ అమెరికా కోసం కాదని.. ప్రపంచ మార్కెట్ల కోసమని చిత్రమైన వివరణ ఇచ్చారు. "అదొక డీజిల్ ఒప్పందం. అది మనకోసం కాదు.. ప్రపంచం కోసం" అని ట్రంప్ మీడియాతో మాట్లాడారు. అధిక ధరల కారణంగా దెబ్బతిన్న ప్రపంచ మార్కెట్‌ను స్థిరీకరించడానికే రష్యాలోని రిఫైనరీల నుంచి వచ్చిన ఇంధనాన్ని ఉపయోగించనున్నట్లు చెప్పారు. నవంబరులో మధ్యంతర ఎన్నికల వేళ ఇంధన ధరల పెరుగుదల అమెరికాలో తీవ్ర చర్చనీయాంశంగా మారడంతో కొన్నిరోజుల క్రితం ట్రంప్ కీలక ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. రష్యా డీజిల్‌పై ఆంక్షలను 2027 ఏప్రిల్ వరకు ఎత్తివేస్తున్నట్లు ప్రకటించడంతో ప్రపంచం షాక్‌కు గురైంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ఇటీవల ఫోన్‌లో చర్చలు జరిపిన అనంతరం ఆ ప్రకటన చేశారు. తొలుత మూడు లక్షల టన్నులకుపైగా డీజిల్‌ను అమెరికాకు, అంతర్జాతీయ విపణికి రష్యా తక్షణమే సరఫరా చేసేలా తమ చర్చల్లో ఒప్పందం కుదిరిందన్నారు. నవంబరులో మరో 5 లక్షల టన్నులు.. ఆ తర్వాత వెంటనే ఇంకో 10 లక్షల టన్నులను మాస్కో సరఫరా చేస్తుందన్నారు. ఆపై ఆ దేశ డీజిల్ రిఫైనరీల పరిస్థితులను బట్టి స్వల్ప కాలంలోనే మరో 30 లక్షల టన్నుల వరకూ అందిస్తుందని తెలిపారు.

# పేదలు నివసించే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ టవర్లు

శంకుస్థాపనలు చేశామని వివరించారు. మేడ్చల్ నియోజకవర్గంలో తొలి విడతగా 480 మంది లబ్ధిదారులను పారదర్శకమైన బహిరంగ డ్రా ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, ఇప్పటికే సొంత ఇల్లు ఉన్నవారిని గుర్తించి, అర్హతలను ధ్రువీకరించిన అనంతరం పారదర్శకంగా డ్రా నిర్వహించామని చెప్పారు. ఎంపికైన వారిలో స్థానికంగా నివసించే అర్హులనే నిర్ధారించి ఇళ్లు కేటాయిస్తున్నట్లు మంత్రి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు 2.20 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయిందని రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేశామని వెల్లడించారు. త్వరలో రెండో విడత ఇందిరమ్మ టవర్స్ కోసం మరోసారి దరఖాస్తులు తీసుకుంటామన్నారు. ఇందిరమ్మ టవర్స్‌లో ఎంపికైన లబ్ధిదారులకు కేవలం కేటాయింపు పత్రాలు ఇచ్చి సరిపెట్టబోమని ఎలాంటి రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా పూర్తి హక్కులతో ఇళ్లను రిజిస్ట్రేషన్ చేసి అందిస్తామని మంత్రి ప్రకటించారు.

**తదుపరి విడతలో కొత్త దరఖాస్తుదారులు**

ప్రతి అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన భూమిలో వాటాను కూడా రిజిస్ట్రేషన్‌లో పొందుపరుస్తామని తెలిపారు. వచ్చే బతుకమ్మ పండుగ నాటికి తొలి విడత లబ్ధిదారులకు ఇళ్లను పూర్తి పండుగ నాటికి తొలి విడత లబ్ధిదారులకు ఇళ్లను పూర్తి చేసి, వారికి తాళాలు అందించాలన్నదే తమ లక్ష్యమని మంత్రి వెల్లడించారు. తొలి విడతలో అవకాశం దక్కని అర్హులు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని, తదుపరి విడతల్లో కొత్త దరఖాస్తుదారులతో సహా అర్హులందరినీ పరిశీలిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కూడా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడంతో పాటు, ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని చెప్పారు.

# జేఎన్‌టీయూహెచ్‌లో 27 మంది విద్యార్థులపై క్రమశిక్షణ చర్యలు



**కూకట్‌పల్లి:** హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలో గత నెలలో జరిగిన ఘర్షణకు సంబంధించి 27 మంది విద్యార్థులపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జి.వి.నరసింహారెడ్డి తెలిపారు. ఈ ఘటనపై ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక ఆధారంగా.. వసతిగృహం, కళాశాల నిబంధనలను ఉల్లంఘించినందుకు వీరిపై చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఐదుగురు బీటెక్ మూడో ఏడాది విద్యార్థులను తదుపరి విద్యా సంవత్సరం మొత్తం వసతిగృహం నుంచి, ఆరు నెలలు కళాశాల నుంచి సస్పెండ్ చేశారు. మూడో ఏడాది విద్యార్థులు ముగ్గురిని (నాన్ బోర్డర్లు) ఎనిమిది నెలలు కళాశాల నుంచి, ఒక విద్యార్థిని నాలుగు వారాలు వసతిగృహం, కళాశాల, మరో 12 మందిని రెండు వారాలు కళాశాల, వసతిగృహం నుంచి సస్పెండ్ చేశారు. మరో ఇద్దరు మూడు, నాలుగో ఏడాది విద్యార్థులను (నాన్ బోర్డర్స్) కళాశాల నుంచి 4 వారాలు, ఎంటెక్ విద్యార్థి (నాన్ బోర్డర్) ఎనిమిది నెలలు కళాశాల నుంచి సస్పెండ్ చేశారు. ఈ సమయంలో పరీక్షలు, ప్రాజెక్టులకు కూడా అనుమతి నిరాకరించారు .బీబీఏ మూడో ఏడాది విద్యార్థులు ఇద్దరిలో ఒకరిని వసతిగృహం నుంచి మిగతా విద్యాసంవత్సరం మొత్తం తొలగిస్తూ, వీరిద్దరిపై చర్యలు తీసుకోవాలని మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపల్‌కు లేఖ రాశారు. మరో పీహెచ్‌డీ స్కాలర్‌పై చర్యలు తీసుకోవాలని వర్సిటీ ఆర్అండ్‌డీ డైరెక్టర్‌కు లేఖ రాశారు.

# యూఏఈ లాటరీ.. భారతీయుడికి రూ.13 కోట్ల జాక్‌పాట్

**జనంసాక్షి:**

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ఉంటున్న భారతీయుడికి జాక్‌పాట్ తగిలింది. షార్జా నగరంలో నివసిస్తున్న కిశోర్ 5 మిలియన్ దిర్హామ్‌లు (సుమారు రూ.13 కోట్లు) గెలుచుకున్నట్లు 'యూఏఈ లాటరీ' వెల్లడించింది. వార్తల్లో తన పేరు చూసి నమ్మలేకపోయానని, తర్వాత నంబరు చూసుకొని నిర్ధరించుకున్నట్లు కిశోర్ చెప్పారు.అక్టోబర్ 3న తీసిన యూఏఈ లాటరీలో తొలి బహుమతి (30 మిలియన్ల దిర్హామ్‌లు) ఎవర్నీ వరించలేదు. రెండో బహుమతి 5 మిలియన్ దిర్హామ్‌లను కిశోర్ గెలుచుకున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఆయన అధికారిక సైట్ నుంచి 50 దిర్హామ్‌లతో టికెట్ కొనుగోలు చేసినట్లు తెలిపారు.

# ఆటోమేటిక్ వర్క్ పర్మిట్ పొడిగింపు నిలిపివేత

భాగస్వాములు, శరణా ర్థులపై తీవ్ర ప్రభావం పడనుంది. గతేడాది అక్టోబర్ 30, ఆ తర్వాత రెన్యువల్ దరఖా స్తులు సమర్పించిన వారికి ఈ కొత్త నిబం ధనలు వర్తిస్తాయి. విదేశీ ఉద్యోగులు తమ ప్రస్తుత వర్క్ పర్మిట్ గడువు ముగియడానికి 180 రోజులకు ముందు మాత్రమే రెన్యూవల్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి వీలవు తుంది. ఈ కొత్త నిబంధనలతో విదేశీ వర్కర్లు ఉపాధి కోల్పోవడంతో పాటు కంపెనీల ఉత్పాదకత దెబ్బతింటుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇదిలా ఉంటే.. వర్క్ పర్మిట్ గడువు ముగిసేలోపు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఉండాలంటే సాధ్యమైనంత త్వరగా రెన్యువల్ దరఖాస్తులు సమర్పించాలని, ప్రాసెసింగ్ ప్రక్రియను ఎప్పటికప్పుడు గమనించుకోవాలని నిపుణులు చెబుతున్నప్పటికీ.. ఈ '180 రోజులు' నిబంధన తీవ్ర అడ్డంకిగా మారింది.యూఎస్‌సీఐఎస్ వద్ద ఆరు నెలలుగా వర్క్ పర్మిట్ పునరుద్ధరణ కోసం లక్షల్లో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. జూన్ 30,2026 నాటికి ఆ సంఖ్య 4.32 లక్షలు దాటింది. ఇక, ఆటోమేటిక్ పొడిగింపు రద్దు చేయాలని ఎప్పటినుంచో ప్రతిపాదనలు ఉండగా.. వాటి పట్ల తొలినుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. హెచ్–4 వీసాదారులు కొందరు జనవరిలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీపై కోర్టులో దావా వేశారు. దాంతో కాలిఫోర్నియా కోర్టులో వారికి స్వల్ప ఊరట లభించింది. డీహెచ్ఎస్ విధానపరమైన నిబంధనలు పాటించలేదని పేర్కొంది.

# ఇరాన్‌పై మళ్లీ దాడులు!

**వాషింగ్టన్(జనంసాక్షి):**

ఇరాన్‌పై భారీ దాడులను పునఃప్రారంభించాలా.. వద్దా? అనే విషయంపై అమెరికా–ఇజ్రాయెల్ రహస్య చర్చలు జరుపుతున్నట్లుగా అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. అగ్రరాజ్యంలో ఎన్నికలు ముగిసేలోపు (నవంబర్ చివరి నాటికి) టెహ్రాన్‌పై భారీ సైనిక చర్య చేపట్టే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నాయి. గత వారం ట్రంప్‌తో సంభాషణలో భాగంగా నెతన్యాహు ఇరాన్ మళ్లీ అణ్వాయుధాల కోసం ప్రయత్నిస్తోందని ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆ అణ్వాయుధ శక్తిని నిర్వీర్యం చేయడానికి దాడులను పునఃప్రారంభించేలా ట్రంప్‌ను ఒప్పించేందుకు బీబీ ప్రయత్నిస్తున్నట్లు సదరు వార్తా కథనాలు పేర్కొన్నాయి. ముఖ్యంగా, ఇరాన్‌లోని పికాక్స్ పర్వతంలోని చమురు శుద్ధి కేంద్రాలను లక్ష్యంగా చేసుకోవడానికి ప్రణాళికల్లో భాగంగా నెతన్యాహు సలహాను ట్రంప్ అంగీకరించినట్లు సమాచారం. అయితే, దాడులు ఎప్పుడు ప్రారంభిస్తారనే విషయంపై స్పష్టతనివ్వలేదు. అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, యూఎస్ సెంట్రల్ కమాండ్ అధికారులు సైతం ఇజ్రాయెల్ ఆలోచనకు మద్దతు తెలిపారు. నవంబర్‌లో అమెరికాలో ఎన్నికలు ఉండడంతో ఈ దాడుల ప్రభావం వాటిపై పడే అవకాశం ఉందని ట్రంప్ సలహాదారులు ఆయనకు సూచించడంతో అమెరికా అధ్యక్షుడు వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. ఇరాన్‌పై దాడుల విషయంలో ట్రంప్ మనసు మార్చుకుంటే వెంటనే దాడులు చేసేలా అమెరికా–ఇజ్రాయెల్ సైన్యాలు అప్రమత్తమయ్యాయి. ఇందులో భాగంగానే అమెరికా విమాన వాహక నౌకలు సైతం పశ్చిమాసియా వైపు కదులుతున్నట్లు సమాచారం. అయితే, దీనిపై అగ్రరాజ్యం నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# నార్లాపూర్ రిజర్వాయర్లలోకి ఎత్తిపోత షురూ..

దక్షిణ తెలంగాణకు సాగునీరందించే లక్ష్యంతో చేపట్టిన కీలకమైన పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులో కీలక ఘట్టం ఆవిష్కృతం అయింది. ప్రాజెక్టులోని తొలి పంప్ హౌస్‌లోని 2 బాహుబలి మోటార్లను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారికంగా ప్రారంభించారు. శ్రీశైలంలో నీటి మట్టం రోజురోజుకు పడిపోతుండటంతో నార్లాపూర్‌లో నీటిని ఎత్తిపోసి నిల్వ చేసేందుకు పాలమూరు రంగారెడ్డిలోని రెండు పంపులను మంత్రి ప్రారంభించారు.

**డిసెంబర్ కల్లా పనులు పూర్తి చేసేలా చర్యలు**

దశాబ్దాలుగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా వాసులు నీటికోసం ఎన్నో కష్టాలు పడ్డారు. అనేక ఉద్యమాలు, నిరసనల ఫలితంగా తొలుత జూరాలకు అనుబంధంగా పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల కట్టాలని ఉమ్మడి రాష్ట్రంలోని ప్రభుత్వాలు భావించాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్?ఎస్ ఇక్కడ సరిపడా నీటి లభ్యత లేదనే ఉద్దేశంతో ప్రాజెక్టును శ్రీశైలం వెనక జలాలకు తరలించింది. సుమారు 50కు పైగా టీఎంసీల నీళ్లను వినియోగించుకునేలా వివిధ దశల్లో ఎత్తిపోతలు, రిజర్వాయర్లతో పనులు చేపట్టారు.బీఆర్ఎస్ హయాంలో సింహభాగం పనులు పూర్తైనా కొన్ని పెండింగ్‌లో ఉన్నాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ దీన్ని పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తోంది. జూన్‌లో ప్రాజెక్టుల సందర్శన చేపట్టిన ముఖ్యమంత్రి డిసెంబర్ కల్లా పనులు పూర్తిచేసి కరివెన వరకు నీటిని తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పనులు వేగం పుంజుకున్నాయి.

**రెండు బాహుబలి మోటార్లను ఆన్ చేసిన జూపల్లి**

2023 సెప్టెంబర్‌లో నాటి సీఎం కేసీఆర్ నార్లాపూర్ పంప్ హౌస్‌లోని మొదటి పంప్ వెట్ రన్ నిర్వహించారు. ప్రస్తుతం 4 పంపులను సిద్ధం చేసిన పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు అధికారులు 2 పంపులకు వెట్ రన్ సైతం నిర్వహించారు. తాజాగా ఎల్ నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనగా తాగునీటి ఇబ్బందులేర్పడే సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటికైతే కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలోని రెండు మోటార్ల ద్వారా మిషన్ భగీరథకు నీటి సరఫరా జరుగుతోంది. అయితే శ్రీశైలంలో రోజురోజుకూ నీటి మట్టాలు వేగంగా పడిపోతుండటంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. పాలమూరు–రంగారెడ్డిలోని నార్లాపూర్ రిజర్వాయర్?లో నీటి నిల్వ చేసుకుని అవసరమైనప్పుడు తాగునీటి కోసం వాడుకోవాలని భావిస్తోంది. నేడు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు రెండు మోటార్లను ఆన్ చేసి నార్లాపూర్‌లో నీటిని ఎత్తిపోశారు.

**రోజుకు అర టీఎంసీ నీళ్లు ఎత్తిపోత**

పాలమూరు–రంగారెడ్డిలో ప్రాజెక్టులో నీటిని ఎత్తిపోసేందుకు బాహుబలి మోటార్లను వినియోగిస్తున్నారు. 145 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు మోటార్లను అమర్చారు. రెండు వెట్ రన్ పూర్తి కాగా మరో రెండింటికి చేయాల్సి ఉంది. ఒక్కో మోటారు రోజుకు 3 వేల క్యూసెక్కుల చొప్పున పావు టీఎంసీ నీళ్లను ఎత్తిపోస్తుంది. ప్రస్తుతం ఆన్ చేసిన రెండు మోటార్లు కలిసి రోజుకు అర టీఎంసీ నీళ్లను నార్లాపూర్‌లో ఎత్తిపోస్తాయి. వాటిని అవసరం మేరకు కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలోని ఎల్లూరు రిజర్వాయర్‌కు తరలించి మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరాకు వినియోగించనున్నారు.

# 10మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలి

- మహిళా సంఘాలకు రూ.75 వేల కోట్ల బ్యాంకు రుణాలు..
- రాష్ట్ర మంత్రి సీతక్క
- బ్యాంకర్లకు సన్మానం.. ఘనంగా బతుకమ్మ సంబరాలు



**హైదరాబాద్, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** గ్రామీణ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది, ఎవరిపైనా ఆధారపడకుండా ఆత్మగౌరవంతో జీవించాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. మహిళలు చేయి చాచి అడిగే స్థాయి నుంచి, ఆశించే స్థాయి నుంచి పదిమందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మహిళా స్వయం సహాయక సంఘాలపై నమ్మకంతో పెద్ద ఎత్తున రుణాలు అందిస్తున్న బ్యాంకర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కష్టపడి సంపాదించిన సొమ్ములో ఉండే తృప్తి, యాచించి పొందే సొమ్ములో ఉండదని, మహిళలు సంపాదించే ప్రతి రూపాయి వారి శ్రమకు, కష్టానికి ప్రతిఫలమని పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని హెచ్‌ఎండీఏ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న సరస్ ఫెయిర్-2026లో మహిళా స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందించడంలో కీలక పాత్ర పోషించిన బ్యాంకర్ల సన్మాన కార్యక్రమంలో మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బ్యాంకర్లను సన్మానించారు. అనంతరం సరస్ మేళా ప్రాంగణంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మహిళలతో కలిసి పాల్గొన్నారు. మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించి, తమ అవసరాలను తామే తీర్చుకునేలా చేయడమే ప్రభుత్వ ఉద్దేశమని మంత్రి తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇప్పటివరకు రూ.75 వేల కోట్ల రుణాలు అందించామని వెల్లడించారు. గతంలో రూ.5 లక్షలుగా ఉన్న రుణ పరిమితిని రూ.10 లక్షలకు పెంచినట్లు పేర్కొన్నారు. మహిళల పొదుపును ఆర్థిక బలంగా మార్చి, ప్రతి మహిళను విజయవంతమైన వ్యాపారవేత్తగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. గ్రామీణ మహిళల ఆర్థిక అభివృద్ధికి సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ చేస్తున్న కృషిని మంత్రి అభినందించారు. మహిళా సంఘాల ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పిస్తున్న సరస్ మేళా వంటి కార్యక్రమాలు మహిళా పారిశ్రామికవేత్తలకు ఎంతో ఉపయోగకరమని చెప్పారు. హైదరాబాద్ ప్రజలు సరస్ మేళాను సందర్శించి, మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా వారి వ్యాపారాలను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.

బ్యాంకర్ల సన్మాన కార్యక్రమం అనంతరం హెచ్‌ఎండీఏ గ్రౌండ్‌లోని సరస్ మేళా ప్రాంగణంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మంత్రి సీతక్క పాల్గొన్నారు. సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్‌తో పాటు మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

# పాలమూరు పంపులు నార్లాపూర్ రిజర్వాయర్ నిండే వరకు నడపాలి

- మూడేళ్లుగా ప్రాజెక్టు పనులు నిలిపివేసి ఇప్పుడు గొప్పలు చెప్పుకోవడం సరికాదు
- మంత్రి జూపల్లి వ్యాఖ్యలను ఖండించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**వనపర్తి రూరల్, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పంపులను నార్లాపూర్ రిజర్వాయర్ పూర్తిగా నిండే వరకు నిరంతరాయంగా నడపాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. మూడేళ్లుగా ప్రాజెక్టు పనులను నిలిపివేసి, ఇప్పుడు పంపుల ప్రారంభం సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు చేస్తున్న వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయని ఒక ప్రకటనలో ఖండించారు. బీఆర్ఎస్ పాలనలోనే నార్లాపూర్‌లో పంపును కేసీఆర్ ప్రారంభించిన విషయం తెలంగాణ ప్రజలందరికీ తెలుసన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడేళ్లుగా ప్రాజెక్టు పనులను ఎందుకు ముందుకు తీసుకెళ్లలేదని ప్రశ్నించారు. పూర్తయిన కాలువల టెండర్లను రద్దు చేయడం, కాలువల నిర్మాణాన్ని అడ్డుకోవడం, ప్రాజెక్టు పనులపై కోర్టుల్లో కేసులు వేయడం వెనుక కాంగ్రెస్ పార్టీ పాత్ర లేదా అని నిలదీశారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉన్నప్పటికీ, శ్రీశైలంలో నీటి లభ్యత ఉన్నా గత రెండు నెలలుగా నార్లాపూర్ పంపులను ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. నార్లాపూర్-ఏదుల మధ్య పెండింగ్ పనులను పూర్తి చేయాలని బీఆర్ఎస్ గత మూడేళ్లుగా డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం పది పంపులను పూర్తి స్థాయిలో నడపడానికి పెండింగ్ పనులు అడ్డంకిగా ఉన్నప్పటికీ, నార్లాపూర్, ఏదుల వద్ద రెండు పంపులను నడిపి వట్టెం, కరివెన వరకు సాగునీటిని అందించే అవకాశం ఉందని పేర్కొన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పంపులను కూడా పూర్తి స్థాయిలో ఎందుకు నడపడం లేదని ప్రశ్నించారు. ఏపీ ప్రభుత్వం శ్రీశైలం నీటిని సుమారు 700 కిలోమీటర్ల దూరంలోని కుప్పం వరకు తరలిస్తుంటే, తెలంగాణలో మాత్రం రైతులకు సాగునీరు అందించడంలో నిర్లక్ష్యం ఎందుకని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ హెచ్చరికల నేపథ్యంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం మోటార్లను ప్రారంభించిందని నిరంజన్ రెడ్డి అన్నారు. ఇప్పటికైనా నార్లాపూర్ రిజర్వాయర్ పూర్తిగా నిండే వరకు పంపులను నడపాలని, నిలిచిపోయిన ప్రాజెక్టు పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మూడేళ్లుగా పనులు నిలిపివేసినందుకు పాలమూరు రైతాంగానికి

# విద్యుత్ ఉచ్చులే అశోక్ మృతికి కారణం!

- ఇద్దరు నిందితుల అరెస్ట్..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం యామన్‌పల్లి అటవీ ప్రాంతంలో జడల అశోక్ మృతి కేసును కాటారం సర్కిల్ పోలీసులు ఛేదించారు. అటవీ జంతువులను వేటాడేందుకు అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్ తీగల ఉచ్చులే అశోక్ మృతికి కారణమని పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయగా, మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. విద్యుత్ ఉచ్చులకు తగిలి అశోక్ మృతి చెందడంతో విషయం బయటపడుతుందనే భయంతో నిందితులు మృతదేహాన్ని సంఘటనా స్థలం నుంచి తరలించి పొదల్లో పడేసినట్లు విచారణలో తేలింది. కాటారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగార్జునరావు తెలిపిన వివరాల ప్రకారం.. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో నిందితులు అటవీ జంతువులను వేటాడేందుకు అక్రమంగా విద్యుత్ ఉచ్చులు ఏర్పాటు చేసేవారు. యామన్‌పల్లి--నిమ్మగూడెం ప్రధాన రహదారి సమీపంలోని 11 కేవీ విద్యుత్ లైన్ నుంచి ఇనుప బైండింగ్ వైర్లకు విద్యుత్ సరఫరా కలిపి అటవీ ప్రాంతంలో ఉచ్చులు అమర్చేవారు. ఈ క్రమంలో గత శుక్రవారం రాత్రి యామన్‌పల్లి శివారులోని అటవీ ప్రాంతంలో విద్యుత్ ఉచ్చులు ఏర్పాటు చేశారు. అదే సమయంలో పోడు భూమి పనుల నిమిత్తం అటువైపు వెళ్లిన అజమ్‌నగర్‌కు చెందిన జడల అశోక్ (32) ప్రమాదవశాత్తు విద్యుత్ ఉచ్చులకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మరుసటి రోజు తెల్లవారుజామున విద్యుత్ ఉచ్చులను పరిశీలించేందుకు వెళ్లిన నిందితులు అశోక్ మృతదేహాన్ని గుర్తించారు. తమ అక్రమ కార్యకలాపాల కారణంగానే అశోక్ మృతి చెందిన విషయం బయటపడితే పోలీసులకు చిక్కుతామనే భయంతో మృతదేహాన్ని అక్కడి నుంచి తొలగించాలని నిర్ణయించుకున్నారు. మృతదేహాన్ని కర్రకు కట్టి మోసుకెళ్లి సుమారు కిలోమీటరు దూరంలోని వాగు ఒడ్డున ఉన్న పొదల్లో పడేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అనంతరం పోలీసులకు చిక్కకుండా అటవీ ప్రాంతంలో దాక్కున్న నిందితులు మహారాష్ట్రకు పారిపోయేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. యామన్‌పల్లి శివారులోని చెరువు సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న రత్నం వంశీకృష్ణ, రత్నం రాజు అలియాస్ రాజేందర్, తలారి రాజేందర్‌లను పోలీసులు గుర్తించారు. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా రత్నం వంశీకృష్ణ, రత్నం రాజు అలియాస్ రాజేందర్‌లను అదుపులోకి తీసుకున్నారు. తలారి రాజేందర్ పరారీలో ఉన్నట్లు సీఐ నాగార్జునరావు వెల్లడించారు.

# పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని బాహుబలి

- మోటార్లు ప్రారంభించిన మంత్రి జూపల్లి
- ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి తీరుతాం
- చివరి ఆయకట్టుకు సాగునీరందిస్తాం
- గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలమూరు ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసింది
- రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసి ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదు?



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 14(జనంసాక్షి) :** ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్ట్ లను పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. రాజకీయ లబ్ధి కోసం బీఆర్ఎస్ నేతలు అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నార్లాపూర్ రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన రెండు భారీ బాహుబలి మోటార్లను మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. ఈ మోటార్ల ద్వారా నార్లాపూర్ రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోయనున్నారు. ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను పూర్తి చేయకుండానే.. దీన్ని జాతికి అంకితం చేశారని, కానీ కాలువలు, డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్, ఇతర పనులను గత ప్రభుత్వం చేపట్టలేదని విమర్శించారు. ప్రాజెక్టును గత పాలకులు పూర్తిచేసి ఉంటే ప్రస్తుతం ఈ పరిస్థితి తలెత్తేది కాదన్నారు. వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల ద్వారా లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉన్నా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం చేసిందని ధ్వజమెత్తారు. మహాత్మాగాంధీ-కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద 4.60 లక్షల ఎకరాలు, నెట్టెంపాడు ప్రాజెక్టు ద్వారా 2 లక్షల ఎకరాలు, భీమా ప్రాజెక్టు ద్వారా 2 లక్షల ఎకరాలు, కోయిలాసాగర్ ప్రాజెక్టు కింద 50 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉందని తెలిపారు.ఇన్ని లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టులను గత ప్రభుత్వం ఎందుకు పూర్తి చేయలేకపోయిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పాలమూరు రైతాంగం ప్రయోజనాల కంటే రాజకీయ ప్రచారానికే బీఆర్ఎస్ నేతలు ప్రాధాన్యమిస్తున్నారని అన్నారు.రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చిన గత పాలకులు, ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను ఎందుకు పూర్తిచేయలేదో ప్రజలకు వివరించాలని నిలదీశారు. రైతాంగానికి సాగునీరు అందించడంలో గత ప్రభుత్వం విఫలమైందని, ప్రస్తుతం ప్రాజెక్టుల పురోగతిపై అవగాహన లేకుండా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశానిర్దేశం మేరకు సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ప్రాజెక్టుల వారీగా సమస్యలను గుర్తించి, పనుల పురోగతిని సమీక్షిస్తూ ముందుకు సాగుతున్నామని చెప్పారు.సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు ప్రయోజనం చేకూర్చడం, వ్యవసాయానికి అవసరమైన నీటిని అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ ప్రాధాన్యమని జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# కాప్రా చెరువు అభివృద్ధిలో హైడ్రా

- వలస పక్షులకు ఆవాసంగా మార్చేందుకు చర్యలు
- స్వచ్ఛందంగా చెరువు అభివృద్ధికి భూములిచ్చిన రైతులు
- రూ.35 కోట్లతో కాప్రా చెరువు పునరుద్ధరణ పనులు



**హైదరాబాద్, అక్టోబరు 14 (జనంసాక్షి) :** కాప్రా చెరువు మళ్లీ కళకళలాడేలా.. పునరుద్ధరణ పనులను హైడ్రా శరవేగంగా చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం గుర్తించిన వెట్‌ల్యాండ్స్‌లో ఒకటిగా విరాజిల్లి.. వలస పక్షులకు ఆవాసంగా ఉండే ఈ చెరువుకు పూర్వ వైభవం తెచ్చేలా హైడ్రా ప్రయత్నాలు ముమ్మరం చేసింది. సకల జీవకోటికీ ప్రాణాధారంగా.. జీవ వైవిధ్యం పెంపొందించేలా హైడ్రా పనులు సాగుతున్నాయి. 112 ఎకరాల మేర విస్తరించిన చెరువులో రైతులకు చెందిన భూములున్నాయి. హైడ్రా చెరువుల అభివృద్ధిని చూసిన స్థానిక రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. కాప్రా చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని 70 ఎకరాలను చెరువు అభివృద్ధికి అప్పగించారు. నేరుగా హైడ్రా కమిషనర్‌ను కలిసి ఈ మేరకు ఆమోద పత్రాన్ని అందజేశారు. అంతే నిబద్ధతతో కాప్రా చెరువును హైడ్రా అభివృద్ధి చేస్తోంది. దాదాపు 60 శాతం చెరువు అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. ఈ చెరువు అభివృద్ధి పనులను చూడడానికి స్థానికులు వస్తున్నారు. ఒకప్పుడు చుట్టుపక్కల ప్రజల జీవనంతో.. పక్షుల కిలకిలరావాలతో మమేకమైన కాప్రా చెరువు హైడ్రా రెండో దశలో అభివృద్ధి చేస్తున్న 14 చెరువుల్లో ఒకటి. 112.80 ఎకరాల ఎఫ్‌టీఎల్ విస్తీర్ణం కలిగిన కాప్రా చెరువు అభివృద్ధికి దాదాపు రూ.35 కోట్లను వెచ్చిస్తున్నారు. జీవ వైవిధ్యానికి ప్రతీకగా చరిత్రకెక్కిన కాప్రా చెరువు.. సాధారణ నీటి వనరు మాత్రమే కాదు.. నగర పర్యావరణ సమతుల్యతకు కీలకమైన వెట్‌ల్యాండ్ అని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం గుర్తించిన ఈ వెట్‌ల్యాండ్‌కు ఆస్ట్రేలియా, యూరప్‌తో పాటు ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే 470కుపైగా వలస పక్షులకు ఆవాసంగా కాప్రా చెరువు నిలుస్తోంది. భారీ వర్షాల సమయంలో వరదల నివారణ, భూగర్భ జలాల పెంపు, చేపలు, పక్షులు, ఉభయచరాలు, ఇతర జలచరాలకు ఆవాసంగా... జీవవైవిధ్య పరిరక్షణ, నీటిలోని కాలుష్య పదార్థాలు, మలినాలను సహజసిద్ధంగా వడపోతకు అనువుగా పూడిక తొలగింపు, వాతావరణ సమతుల్యత, పర్యావరణ పరిరక్షణ ఇలా వెట్ ల్యాండ్(చిత్తడి నేలల) ప్రాధాన్యతలన్నీ కలగలిపేలా చెరువును హైడ్రా అభివృద్ధి చేస్తోంది. అంతే కాకుండా..ప్రజలందరికీ అన్ని విధాలా ఉపయోగపడేలా.. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, పటిష్టమైన ఫెన్సింగ్, ఇన్‌లెట్, ఔట్‌లెట్ వ్యవస్థల అభివృద్ధి చేస్తోంది. చెరువు పరిధి పరిరక్షణతో పాటు భవిష్యత్తులో ఆక్రమణలకు అవకాశం లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. ఒకవైపు చెరువు పరిరక్షణ.. మరోవైపు వర్షపు నీటిని చెరువులోకి చేర్చేలా మెరుగైన నీటి ప్రవాహ వ్యవస్థ.. ఇంకోవైపు ప్రజలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణం.. ఈ మూడు లక్ష్యాలతో కాప్రా చెరువు రూపుదిద్దుకుంటోంది.



# నీటి కుంటలో పడి బాలుడు మృతి!

**మరిపెడ, అక్టోబర్ 14 ( జనం సాక్షి ):** మరిపెడ మున్సిపల్ కేంద్రంలో ఐదవ వార్డులో 9 ఏళ్ల బాలుడు నీటి కుంటలో పడి మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఐదవ వార్డు లో నివాసి ఎలక్ట్రీషియన్ హరీష్ కుమారుడు అక్షిత్ (9) ఆడుకుంటూ నీటి కుంటలో పడి మృతి చెందాడు. ఈ విషాద ఘటనతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్రదుఃఖంలో మునిగిపోయారు. ఈవిషయం తెలుసుకున్న మరిపెడ పట్టణ అధ్యక్షుడు పానుగోతు. రాంలాల్ ఫోన్ ద్వారా బాలుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాలుడి మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, వారికి మనోధైర్యాన్ని కల్పించారు.

# చిన్నారి మెడలో బంగారు లాకెట్ చోరీ
# కేసును ఛేదించిన పోలీసులు

- భార్యాభర్తల అరెస్ట్
- జనంసాక్షి కథనానికి స్పందన..


కాసం షాపింగ్ మాల్‌లో చిన్నారి బంగారం చోరీ!



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి పట్టణంలో చిన్నారి మెడలోని బంగారు హనుమాన్ లాకెట్ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. 'కాసం షాపింగ్ మాల్ లో చిన్నారి బంగారం చోరీ' పేరుతో 'జనంసాక్షి'లో గురువారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. కాగా స్పందించిన పోలీసులు వెంటనే చర్యలు చేపట్టి కేసును చేధించారు. షాపింగ్ కోసం వెళ్లిన సమయంలో చిన్నారి మెడలో ఉన్న బంగారు లాకెట్‌ను అపహరించిన ఘటనపై ఫిర్యాదు అందడంతో పోలీసులు సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టి నిందితురాలిని గుర్తించారు. భూపాలపల్లి పట్టణంలోని మైసమ్మ కాలనీకి చెందిన జరుపుల బాలాజీ ఈ నెల 11వ తేదీ సాయంత్రం తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి పట్టణంలోని కాసం ఫ్యాషన్ మాల్‌కు షాపింగ్ నిమిత్తం వెళ్లారు. షాపింగ్ ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చిన అనంతరం మరుసటి రోజు ఉదయం చిన్నారి మెడలో ఉండాల్సిన బంగారు హనుమాన్ లాకెట్ కనిపించలేదు. అంతేకాకుండా చిన్నారి మెడపై గోళ్లతో గీరినట్లు గా గుర్తులు కనిపించడంతో అనుమానం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన పోలీసులు కాసం ఫ్యాషన్ మాల్‌తో పాటు సంబంధిత ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఆధారంగా నాచారానికి చెందిన మంజు కవిత, ఆమె భర్త శ్రీధర్‌ను గుర్తించారు. విచారణలో చిన్నారి మెడలోని బంగారు హనుమాన్ లాకెట్‌ను దొంగిలించినట్లు నిందితులు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో తదుపరి చట్టప రమైన చర్యలు కొనసాగు తున్నాయని వెల్లడించారు. షాపింగ్ మాల్స్, మార్కెట్లు, ఇతర రద్దీ ప్రాంతాలకు వెళ్లినప్పుడు తల్లిదండ్రులు చిన్నారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని భూపాలపల్లి పట్టణ సీఐ సీహెచ్ శ్రీనివాస్ సూచించారు. చిన్నపిల్లలకు బంగారు ఆభరణాలు ధరింపజేసే విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా, దొంగతనం జరిగినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.

# అశోక్‌నగర్‌లో దారుణం

- వ్యక్తి అనుమానాస్పద మృతి



**ముషీరాబాద్ అక్టోబర్ 14 (జనం సాక్షి):** హైదరాబాద్‌లోని చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధి అశోక్‌నగర్‌లో సుభాష్ (40) అనే వ్యక్తి తీవ్ర గాయాలతో మృతి చెందాడు. సంతోష్ కిరాణా షాపు సమీపంలో రక్తస్రావ గాయాలతో పడి ఉన్న ఆయనను గుర్తించిన పోలీసులు, ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి నుదురు, కుడి కంటి వద్ద గాయాలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై చిక్కడపల్లి పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 103(1) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సుభాష్ మృతికి గల కారణాలను తెలుసుకునేందుకు వివిధ కోణాల్లో విచారణ జరుపుతున్నారు. ఘటనకు పాల్పడిన వారిని గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.

# పోరస్ కెమికల్ ఫ్యాక్టరీలో రియాక్టర్ పేలుడు

- ఇద్దరికి గాయాలు
- భద్రతా ప్రమాణాలు పాటించడం లేదంటూ కార్మికుల ఆరోపణలు



**కోదాడ (జనం సాక్షి):** తెలంగాణ ముఖద్వారమైన కోదాడ నియోజకవర్గ పరిధిలోని నల్లబండ గూడెం వద్ద ఉన్న పోరస్ కెమికల్ ఫ్యాక్టరీలో బుధవారం రియాక్టర్ విభాగంలో పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను కోదాడ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదంలో కోదాడ పట్టణానికి చెందిన రియాక్టర్ ఆపరేటర్ తమ్మి రెడ్డి నాగ వెంకట సత్యనారాయణ,(50) జగ్గయ్యపేట మండలం అన్నారం గ్రామానికి చెందిన మాదుగుల సైదులు (48) గాయపడినట్లు సమాచారం. రియాక్టర్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే పేలుడుకు గల ఖచ్చితమైన కారణాలు తెలియాల్సి ఉంది. ఫ్యాక్టరీలో రియాక్టర్ విభాగాన్ని అరకొర వసతులతో నిర్వహిస్తున్నారని సహచర కార్మికులు ఆరోపిస్తున్నారు. పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు సక్రమంగా అమలు చేస్తున్నారా లేదా అన్న అంశంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదం జరిగిన నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి ఫ్యాక్టరీలో భద్రతా ఏర్పాట్లు, రియాక్టర్ నిర్వహణ తీరు, కార్మికులకు కల్పిస్తున్న రక్షణ సదుపాయాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా పరిశ్రమలో భద్రతా నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, ప్రమాదానికి గల కారణాలను గుర్తించి బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**పేరు మార్పు ప్రకటన**

నా ఆధార్ కార్డు ప్రకారం నా పేరు మహమ్మద్ ఉస్మాన్ (Mohammed Osman), తండ్రి పేరు మహమ్మద్ గఫార్ (Mohammed Gafar), నివాసం: ఇంటి నం. 4-3-247/1, ఇస్లాంపురా, జగిత్యాల పట్టణం మరియు జిల్లా. అయితే, నా పాస్‌పోర్టులో నా పేరు మహమ్మద్ ఉస్మాన్ (Mohammed Usman) అని నమోదై ఉంది. కాబట్టి, పాస్‌పోర్టులో పేరు సవరణ చేయించుకునే ఉద్దేశంతో, నా పేరును మహమ్మద్ ఉస్మాన్ (Mohammed Usman) గా మార్చుకుంటున్నాను.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
15 అక్టోబర్ 2026

సంపాదకీయం

# ఆలయ ప్రాంగణంలోనూ బాలికకు భద్రత కరువేనా?

దేవుడి సన్నిధి అంటే ప్రశాంతతకు, భరోసాకు ప్రతీక. అలాంటి ఆలయంలోనే దర్శనానికి వచ్చిన బాలికపై ఓ కార్మికుడు అనుచితంగా ప్రవర్తించేందుకు ప్రయత్నించిన ఘటన ఆందోళన కలిగిస్తోంది. బాలిక కేకలు వేయడంతో నిందితుడు పారిపోగా, సీసీటీవీ దృశ్యాల ఆధారంగా పోలీసులు అతడిని అరెస్టు చేశారు. నిందితుడు పట్టుబడటం ఊరటనిచ్చినా, ఇలాంటి ఘటనలు జరగకుండా నివారించాల్సిన బాధ్యత ఎవరిదన్నది కీలకమైన ప్రశ్న.

దేవుడిపై నమ్మకం వ్యక్తిగత విశ్వాసం. అయితే పవిత్రమైన ప్రదేశంలో ఉన్నంత మాత్రాన ప్రమాదం ఉండదని భావించడం వాస్తవికత కాదు. భక్తి మనసుకు ప్రశాంతతను ఇవ్వవచ్చు కానీ భద్రతకు ప్రత్యామ్నాయం కాలేదు. ప్రమాదాలను దైవ సంకల్పంగా భావించి వదిలేయకుండా, వాటి వెనుక ఉన్న కారణాలను విశ్లేషించి పరిష్కారాలు వెతకాలి. ప్రశ్నించడం, ఆధారాలను పరిశీలించడం, హేతుబద్ధంగా ఆలోచించడం శాస్త్రీయ దృక్పథానికి పునాదులు. రాజ్యాంగంలోని 51ఎ(హెచ్) అధికరణం కూడా శాస్త్రీయ దృక్పథం, మానవతావాదం, విచారణాస్ఫూర్తిని పెంపొందించు కోవాలని పౌరులకు సూచిస్తోంది.

పిల్లలు తమను తాము రక్షించుకోవడం నేర్చుకోవాలి. అయితే భద్రతా బాధ్యతను వారిపైనే మోపడం సరికాదు. ఆలయాల్లో సిబ్బంది నియామకానికి పోలీసు ధ్రువీకరణ, కీలక ప్రాంతాల్లో సీసీటీవీ నిఘా, తగిన భద్రతా సిబ్బంది, ఫిర్యాదులపై తక్షణ స్పందన తప్పనిసరి కావాలి. కెమెరాలు నేరం జరిగిన తర్వాత ఆధారాలు అందించడమే కాకుండా, సమర్థవంతమైన పర్యవేక్షణతో నేరాలను అడ్డుకునే సాధనాలుగా మారాలి.

కుటుంబాలు, పాఠశాలలు పిల్లలకు శరీర స్వాతంత్ర్యం, సరైన స్పర్శ, అనుచిత ప్రవర్తనను గుర్తించడం, అవసరమైనప్పుడు సహాయం కోరడం వంటి విషయాలపై అవగాహన కల్పించాలి. తమకు జరిగిన అన్యాయాన్ని పిల్లలు నిర్భయంగా చెప్పగల వాతావరణాన్ని నిర్మించాలి. తప్పు నేరస్థుడిదే తప్ప బాధితురాలిది కాదనే విషయాన్ని సమాజం గుర్తించాలి.

బాలలపై లైంగిక నేరాల నిరోధానికి పోక్సో చట్టం ఉన్నప్పటికీ, దాని అమలులో వేగం, నిష్పాక్షికత అవసరం. ఫిర్యాదులపై సత్వర దర్యాప్తు, బాధితులకు రక్షణ, న్యా య ప్రక్రియలో జాప్యం తగ్గించడం ద్వారా మాత్రమే చట్టంపై విశ్వాసం పెరుగుతుంది. మనల్ని మనం రక్షించుకోవాలంటే భయంతో కాకుండా అవగాహనతో జీవించాలి. మూఢనమ్మకాలతో సమస్యలను కప్పిపుచ్చకుండా, హేతుబద్ధంగా పరిష్కారాలను అన్వేషించాలి. భక్తి వ్యక్తిగతమైనదైతే, భద్రత సామాజిక బాధ్యత. గుడిలో గంటలు మోగుతున్నాయా, దీపాలు వెలుగుతున్నాయా అన్నదానికంటే, అక్కడికి వచ్చిన బాలిక భయం లేకుండా తిరిగి ఇంటికి చేరిందా అన్నదే ముఖ్యం. ప్రతి ఆలయం భక్తికి నిలయంగా ఉండటంతోపాటు, పిల్లల భద్రతకు భరోసాగా నిలవాలి. అదే నిజమైన మానవత్వం, అదే బాధ్యతాయుతమైన సమాజానికి గుర్తు.

# ''కలలు కనండి... జగత్తును మార్చండి''

**(అబ్దుల్ కలాం జయంతి అక్టోబర్15-ప్రపంచ విద్యార్థుల దినోత్సవం సందర్భంగా)**



చీకటిని చీల్చుకుంటూ ఉదయించే తొలి కిరణంలా... సమాజంలో పేరుకుపోయిన అజ్ఞానాన్ని తొలగించడానికి విజ్ఞాన దీపాన్ని వెలిగించిన ఒక మహోన్నత శక్తి జన్మదినం ఈ అక్టోబర్ 15. ఆయన న కేవలం ఒక వ్యక్తి కాదు.. భారతదేశ యువత గుండెల్లో సగర్వం గా ఎగిరే ఆశల పతాకం. మన దేశ మాజీ రాష్ట్రపతి, 'మిసైల్ మ్యాన్', 'పీపుల్స్ ప్రెసిడెంట్' అయిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం గారి జయంతిని మనం 'ప్రపంచ విద్యార్థుల దినోత్సవం'గా అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుపుకుంటున్నాము.

**నేపథ్యం**

భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని (అక్టోబర్ 15) 2010 సంవత్సరం నుండి ప్రపంచ విద్యార్థుల దినోత్సవం (ఔశీతీశ్రీస ూ్‌బఒఎవత్‌ం' ఋబఎ) గా జరుపుకుంటున్నాము. కలాం గారికి విద్యార్థులన్నా, వారికి బోధించాలన్నా అమితమైన ఇష్టం. విద్యార్థుల పట్ల ఆయనకున్న ప్రేమకు, విద్యా రంగానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఆయన 79వ జయంతి (2010) సందర్భంగా ఈ దినోత్సవాన్ని ప్రారంభించారు. భారతదేశంలో విద్యా రంగానికి మరియు విద్యార్థుల భవిష్యత్తుకు డాక్టర్ కలాం అందించిన స్ఫూర్తిని స్మరించుకుంటూ ప్రతి ఏటా ఈ రోజున దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తారు.

**జ్ఞాన సముద్రానికి నూరేళ్ల నివాళి.** "కలలు కనండి... ఆ కలలను సాకారం చేసుకోండి. అయితే, "నిద్రలో వచ్చేవి కలలు కావు, మిమ్మల్ని నిద్రపోనివ్వకుండా చేసేవే నిజమైన కలలు" ఈ అక్షర రూపం కేవలం మాటల గారడీ కాదు.. కోట్లాది మంది విద్యార్థుల నరనరాల్లో ఉత్సాహాన్ని నింపిన జీవన వేదం. అబ్దుల్ కలాం అంటేనే ఒక నడిచే గ్రంథాలయం, ఒక నిస్వార్థ అంకితభావం. చిరిగిపోయిన బట్టలతో రామేశ్వరం ఇసుక తిన్నెలపై నడిచిన ఆ చిన్నారి పాదాలు, భవిష్యత్తులో దేశ రక్షణ రంగాన్ని శాసించే అసాధారణ శిఖరాలను అధిరోహిస్తాయని ఆనాడు ఎవరూ ఊహించి ఉండరు. కానీ ఆయన సంకల్ప బలం, జ్ఞాన పిపాస ఆ సామాన్యుడిని జాతి గర్వించదగ్గ మహా శిఖరంగా మార్చాయి.

**ఆలోచనాత్మక ప్రయాణం**

నేడు సమాజం వేగంగా మారుతున్న ఈ తరుణంలో, కేవలం చదువు అంటే డిగ్రీలు సంపాదించడం కాదని, తోటి మనిషిని ప్రేమించే గుణం, దేశాన్ని ముందుకు నడిపించే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవడమే అసలైన విద్య అని చాటిచెప్పిన మహానుభావుడు కలాం గారు. విద్యార్థి దశ అనేది కేవలం ఒక వయసు కాదు... అదొక సృజనాత్మక దశ. ఆ దశ లో ప్రతి విద్యార్థి తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడానికి కలాం గారి జీవితమే అత్యుత్తమ దిశానిర్దేశం.

**నాయకత్వ లక్షణాలు:** సమస్య వచ్చినప్పుడు భయపడి పారిపోవడం కాదు, దాన్ని పరిష్కరించే నాయకుడిగా ఎదగడమే అసలైన విద్య. కలాం గారు ఎప్పుడూ విద్యార్థులతో మమేకమయ్యేవారు. వారి నవ్వుల్లో భవిష్యత్ భారతాన్ని చూసేవారు. అందుకే ఆయన తన చివరి శ్వాస విడిచింది కూడా ఒక లెక్చర్ హాల్‌లోనే, విద్యార్థులతో మాట్లాడుతున్న తరుణంలోనే కావడం యాదృచ్ఛికం కాదు. అది ఆయన విద్యపై పెట్టుకున్న అమర ప్రేమ. నేడు ప్రపంచ విద్యార్థి దినోత్సవం జరుపుకుంటున్న ఈ శుభ తరుణంలో... మనం కేవలం కలాం గారిని స్మరించుకుంటే సరిపోదు. ఆయన చూపిన బాటలో నడవడానికి కొన్ని నిశ్చయాలు చేసుకోవాలి:

**కలలు కనడం ఆపకూడదు:** ఎంత పెద్ద లక్ష్యమైనా సరే, దాన్ని సాధించే వరకు విశ్రమించకూడదు.

**ప్రశ్నించే తత్వాన్ని పెంచుకోవాలి:** గుడ్డిగా అనుసరించకుండా, ప్రతీ విషయాన్ని శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించాలి.

**సమాజానికి తిరిగివ్వాలి:** మనం ఎదిగిన తర్వాత, మన చుట్టూ ఉన్న సమాజపు అభ్యున్నతికి తోడ్పడాలి.

అబ్దుల్ కలాం భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన వెలిగించిన జ్ఞానజ్యోతి ప్రతి విద్యార్థి హృదయంలో కొంటె ఆశగా, ఉజ్వల భవిష్యత్తుగా సదా వెలుగుతూనే ఉంటుంది. రండి, ఆయన ఆశయాలను నిజం చేద్దాం. మన దేశాన్ని మరో శిఖరానికి చేరవేద్దాం. ఈ అక్టోబర్ 15న, ఆ మహనీయుని ఆశయాలను స్మరిస్తూ... మనలోని కలను తట్టిలేపుదాం. దేశ భవిష్యత్తును మన చేతుల్లోకి తీసుకునే ప్రతిన పూనుదాం.



వ్యాసకర్త:పోగు అశోక్
సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్
9391117100

# 'రామప్ప' నేలపై బొగ్గు నీడలు..!

అభివృద్ధి పేరుతో ప్రకృతిని ఎంతకాలం బలిచేస్తాం..? తక్షణ ఆర్థిక ప్రయోజనాల కోసం తరతరాల జీవనాధారాలను ప్రమాదంలోకి నెట్టడం పురోగతి ఎలా అవుతుంది..? ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప ప్రాంతంలో ఓపెన్‌కాస్ట్ బొగ్గు మైనింగ్ ప్రతిపాదనలపై వ్యక్తమవుతున్న ఆందోళనలు ఈ ప్రశ్నలను ముందుకు తెస్తున్నాయి. ఇది కేవలం బొగ్గు తవ్వకాల అంశం కాదు.. చరిత్రను, ప్రకృతిని, రైతుల భవిష్యత్తును కాపాడుకోవాలనే సమాజ బాధ్యతకు సంబంధించిన ప్రశ్న. రామప్ప దేవాలయం మన చారిత్రక వైభవానికి ప్రతీక. దాని పరిసరాల్లోని చెరువులు, పంట పొలాలు, జీవవైవిధ్యం స్థానిక ప్రజల జీవనానికి ఆధారం. ముఖ్యంగా రామప్ప చెరువు సాగునీటి ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుంటే, మైనింగ్ వల్ల భూగర్భ జలాలు, నీటి ప్రవాహాలు, వ్యవసాయ భూములపై పడే ప్రభావాలను నిర్లక్ష్యం చేయలేం. పర్యావరణ ప్రభావాలపై సమగ్ర శాస్త్రీయ అధ్యయనం జరగాలి. దాని ఫలితాలను ప్రజలకు వెల్లడించాలి. నష్టాలు సంభవించే అవకాశాలను ముందుగానే అంచనా వేసి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

బొగ్గు ద్వారా ఆదాయం రావచ్చు. ఉపాధి అవకాశాలు ఏర్పడవచ్చు. కానీ ఆ ప్రయోజనాల కోసం రైతుల జీవనాధారాలు, నీటి వనరులు, ప్రకృతి సంపద ప్రమాదంలో పడితే ఆ నష్టానికి బాధ్యత ఎవరిది..? అభివృద్ధి ప్రయోజనాలు కొందరికి దక్కి, పర్యావరణ భారం స్థానిక ప్రజలపై పడే పరిస్థితి ఏర్పడకూడదు. ప్రకృతి విలువను కేవలం ఆర్థిక లెక్కల్లో కొలవలేం. ప్రపంచ వారసత్వ గుర్తింపు పొందిన రామప్పను కాపాడటం కూడా ప్రభుత్వ బాధ్యత. అందుకోసమే మైనింగ్ ప్రతిపాదనలపై స్థానిక ప్రజలు, రైతులు, పర్యావరణ నిపుణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. వర్తించే పర్యావరణ, వారసత్వ పరిరక్షణ నిబంధనలను కచ్చితంగా పాటించాలి. తీవ్రమైన, నివారించలేని నష్టానికి ప్రమాదం ఉందని అధ్యయనాల్లో తేలితే, ప్రాజెక్టును నిలిపివేయడం లేదా ప్రత్యామ్నాయాలను పరిశీలించడం వంటి నిర్ణయాలకు ప్రభుత్వం వెనుకాడకూడదు. బొగ్గు వెలికితీతకంటే జీవనాధారాల పరిరక్షణ ముఖ్యం. రామప్పను కాపాడటం అంటే ఒక చారిత్రక కట్టడాన్ని మాత్రమే కాదు.. నీటిని, నేలను, రైతుల భవిష్యత్తును కాపాడటం. ప్రకృతిని బలిపీఠంపై ఎక్కించే అభివృద్ధి నిజమైన అభివృద్ధి కాదు. రామప్ప విషయంలో ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఖనిజ సంపదకు ఎంత విలువ ఇస్తుందో మాత్రమే కాదు.. ప్రజల జీవనానికి, ప్రకృతికి ఎంత ప్రాధాన్యం ఇస్తుందో కూడా నిరూపించాలి..!





దారా
rajenderdamera@gmail.com




## దైవాంశ సంభూతులం!

ఆ గొప్పరోజులు తెస్తాం !
విదేశాలు పోనివ్వం!
వెళితే రానివ్వం!
మ్లేచ్ఛ సమాజంనుండి
హైందవాన్ని కాపాడతాం
బావిలో కప్పల్ని చేస్తాం!
ప్రపంచంతో కలవకుండా
హిందూదేశాన్నిమీముందే
ఒక'సూపర్'పవర్ చేస్తాం!
గుళ్ళలోబూతుబొమ్మలు
భజనలతో తాదాత్మ్యం!
కైంకర్యాలు గ్రహించి
దేవదాశీలను పెడతాం!
వేశ్యావృత్తినికొనసాగిస్తూ
ఎవరివృత్తులువారుచేస్తూ
ప్రశాంత జీవనాన్నిస్తాం!
మేమంతా రాజగురువులం!
రాజ్యం మాకనుసన్నల్లో!
పార్వతీ పరమేశ్వరులు
భూసంచారానికొచ్చి
మా పాలనను దీవిస్తారు!
ప్రజాస్వామ్యంపనికి రాదు
ఈదేశాన్నిఅలా'ఫ్రేం'చేసాం
జెన్-జీ లెంత వగర్చినా
ఈ ప్రజలు మీతో రారు!
మామీదే భక్తి శ్రద్దలు!
మాకార్యక్రమం దైవదత్తం!
మాఆచరణ భక్తిపారవశ్యం !
మీనినాదాలు మీకోసం
ప్రజలకేమీ అర్థంకాదు!
ఇదంతామా ప్రజాతంత్రం!
మా మంత్రతంత్రశక్తులతో
వాళ్ళను 'పైలోకం'ఎక్కించాం
స్వర్గనరకాలుదేవుళ్ళుదెయ్యాలు
గతజన్మలు మరుజన్మలు
వాళ్ళరక్తంలో నిక్షిప్తంచేసాం!
మీరు తలక్రిందులుగా
తపస్సుచేసినాఈజనాన్ని
మీరు మార్చలేరు! మా
పునాదులు అలాంటివి!
మేందైవాంశసంభూతులం

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# ఫ్రాన్స్ విద్యార్థుల ఉద్యమం

## ప్రపంచ ప్రజాస్వామ్యానికి విసురుతున్న ప్రశ్నలు!



స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే ఆదర్శాలను ప్రపంచానికి చాటిచె ప్పిన ఫ్రాన్స్‌లో ప్రభుత్వ విద్యా వ్యవస్థ ఎదుర్కొంటున్న సంక్షోభం నేడు రాజకీయ, సామాజిక చర్చకు కేంద్రబిందువుగా మారింది. ప్రజాస్వామ్యం, మానవ హక్కులు, పౌర స్వేచ్ఛలకు చారిత్రక ప్రాధాన్యతనిచ్చిన ఫ్రెంచ్ సమాజంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, తరగతి గదుల్లో విద్యార్థుల రద్దీ, పాఠశాల భవనాల దుస్థితి, విద్యార్థులపై పెరుగుతున్న చదువుల ఒత్తిడి, ఉన్నత విద్యలో ప్రవేశానికి సంబంధించిన అనిశ్చితి వంటి సమస్యలు యువతను నిరసన బాట పట్టించాయి. 2026 సెప్టెంబర్ చివరి వారంలో ప్రారంభమైనట్లు నివేదికలు పేర్కొంటున్న ఈ ఉద్యమం అక్టోబర్ మొదటి వారానికి విస్తృత చర్చకు దారితీసింది. అక్టోబర్ 6న జరిగిన భారీ నిరసనలు, అక్టోబర్ 8న నమోదైన ఆందోళనలు, ప్రభుత్వం ప్రకటించిన ఉపాధ్యాయ నియామక చర్యలు ఈ సమస్య తీవ్రతను ముందుకు తెచ్చాయి. ఈ పరిణామాన్ని కేవలం విద్యార్థుల సమస్యగా చూడటం సరైంది కాదు. ప్రభుత్వాలు విద్యను పౌరుల ప్రాథమిక హక్కుగా పరిగణిస్తున్నాయా? లేక బడ్జెట్‌లో తగ్గించగలిగే సాధారణ వ్యయంగా చూస్తున్నాయా? అనే మౌలిక ప్రశ్నను ఈ ఉద్యమం ప్రపంచ ప్రజాస్వామ్యాల ముందుంచుతోంది.

ఫ్రాన్స్‌లో విద్యార్థుల నిరసనలకు ప్రధాన కారణం ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న ఉపాధ్యాయుల కొరత. ఒక పాఠశాలలో విద్యార్థులు ఉన్నప్పటికీ, వారికి బోధించడానికి అవసరమైన ఉపాధ్యాయులు అందుబాటులో లేకపోతే విద్యా హక్కు కాగితాలకే పరిమితమవుతుంది. ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండటం, దీర్ఘకాలిక సెలవుల్లో ఉన్నవారి స్థానంలో ప్రత్యామ్నాయ నియామకాలు జరగకపోవడం, కొన్ని సబ్జెక్టులకు తగినంత మంది ఉపాధ్యాయులు లేకపోవడం వల్ల విద్యార్థుల చదువుకు అంతరాయం ఏర్పడుతోంది. ముఖ్యంగా హైస్కూల్ స్థాయిలో చదివే విద్యార్థులకు బోధనలో ఏర్పడే అంతరాయాలు వారి పరీక్షల ఫలితాలు, ఉన్నత విద్యలో ప్రవేశ అవకాశాలు, భవిష్యత్తు ఉపాధిపై ప్రభావం చూపే ప్రమాదం ఉంది. విద్యార్థులు తరగతులకు హాజరవుతున్నప్పటికీ అవసరమైన పాఠాలు పూర్తిస్థాయిలో బోధించబడకపోతే, విద్యా వ్యవస్థ తన ప్రాథమిక బాధ్యతను నిర్వర్తించలేదనే చెప్పాలి.

సెప్టెంబర్ చివరి వారంలో పారిస్ పరిసర ప్రాంతాల్లో ప్రారంభమైన నిరసనలు క్రమంగా ఇతర ప్రాంతాలకు విస్తరించాయి. విద్యార్థులు తరగతులను బహిష్కరించడం, పాఠశాలల ప్రవేశ ద్వారాల వద్ద నిరసనలు నిర్వహించడం, వీధుల్లో ప్రదర్శనలు చేపట్టడం వంటి రూపాల్లో తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయ సంఘాలు, తల్లిదండ్రులు, కార్మిక సంఘాల ప్రతినిధులు కూడా వారికి మద్దతుగా నిలిచారు. అక్టోబర్ 6న జరిగిన నిరసనలు ఉద్యమానికి మరింత ప్రాధాన్యతను తీసుకొచ్చాయి. అక్టోబర్ 8న ఫ్రాన్స్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా సుమారు 71,500 మంది నిరసనల్లో పాల్గొన్నట్లు వార్తా నివేదికలు పేర్కొన్నాయి. అయితే నిరసన నిర్వాహకులు, ప్రభుత్వ సంస్థలు ప్రకటించిన సంఖ్యల్లో వ్యత్యాసాలు ఉండవచ్చు. అయినప్పటికీ విద్యా వ్యవస్థలోని సమస్యలు జాతీయ స్థాయిలో చర్చకు వచ్చాయన్నది స్పష్టంగా కనిపిస్తోంది.

తరగతి గదుల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు ఉండటం కూడా విద్యా నాణ్యతకు ప్రధాన అవరోధంగా మారింది. రాయిటర్స్ నివేదికలో మార్సెయ్‌లోని ఒక ఉపాధ్యాయురాలు తన తరగతిలో 37 మంది విద్యార్థులు ఉన్నారని, అందరికీ కూర్చునే సదుపాయం కల్పించడానికి పక్క తరగతి గదుల నుంచి కుర్చీలు, బల్లలు తెచ్చుకోవాల్సి వస్తోందని పేర్కొన్నట్లు వెల్లడైంది. ఒక తరగతిలో విద్యార్థుల సంఖ్య పెరిగినప్పుడు ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని అంచనా వేయడం, సందేహాలను నివృత్తి చేయడం, చదువులో వెనుకబడిన వారికి ప్రత్యేక శ్రద్ధ చూపడం ఉపాధ్యాయులకు కష్టమవుతుంది. బోధన పూర్తయిందని నమోదు చేయడం మాత్రమే విద్యా నాణ్యతకు ప్రమాణం కాదు. విద్యార్థులు నేర్చుకున్న విషయాన్ని ఎంత వరకు అర్థం చేసుకున్నారు, దాన్ని ఆచరణలో ఉపయోగించగలుగుతున్నారా అనే అంశాల ఆధారంగా విద్యా ఫలితాలను అంచనా వేయాలి.

ఈ సమస్య సామాజిక అసమానతలతోనూ ముడిపడి ఉంది. ఆర్థికంగా బలమైన కుటుంబాలు తమ పిల్లలకు ప్రైవేటు ట్యూషన్లు, అదనపు శిక్షణ, ప్రత్యేక అభ్యసన వనరులు అందించగలవు. కానీ ప్రభుత్వ పాఠశాలలపైనే ఆధారపడే పేద కుటుంబాలకు అలాంటి ప్రత్యామ్నాయాలు పరిమితంగా ఉంటాయి. ప్రభుత్వ పాఠశాలల్లో బోధనా నాణ్యత తగ్గినప్పుడు దాని ప్రభావం పేద కుటుంబాల పిల్లలపై అధికంగా పడుతుంది. అందువల్ల తరగతి గదుల్లో రద్దీ అనేది కేవలం స్థలాభావ సమస్య కాదు. అది విద్యలో సమాన అవకాశాలను ప్రభావితం చేసే సామాజిక సమస్యగా గుర్తించాలి.

పాఠశాలల భవనాలు, మౌలిక సదుపాయాల దుస్థితి కూడా విద్యార్థుల ఆందోళనల్లో ముఖ్యమైన అంశంగా ముందుకొచ్చింది. కొన్ని పాఠశాలల్లో నీటి లీకేజీలు, పాడైన మరుగుదొడ్లు, పరిశుభ్రత లోపాలు, పాత భవనాలు, ఉష్ణోగ్రత నియంత్రణకు తగిన సదుపాయాలు లేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు రోజులో ఎక్కువ సమయం గడిపే పాఠశాలల్లో సురక్షితమైన భవనాలు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, తాగునీరు, తగినంత వెలుతురు, గాలి, సరిపడా బల్లలు ఉండటం విలాసం కాదు. అవి ప్రాథమిక అవసరాలు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించడం ఎంత ముఖ్యమో, వారు గౌరవప్రదమైన, ఆరోగ్యకరమైన వాతావరణంలో చదువుకునే పరిస్థితులను కల్పించడం కూడా అంతే ముఖ్యం. వాతావరణ మార్పుల నేపథ్యంలో అధిక ఉష్ణోగ్రతలను తట్టుకునే తరగతి గదులు, మెరుగైన గాలి ప్రసరణ, నీటి నిర్వహణ వంటి అంశాలను కూడా పాఠశాలల అభివృద్ధి ప్రణాళికల్లో భాగం చేయాలి.

విద్యార్థులపై పెరుగుతున్న చదువుల ఒత్తిడి మరో ముఖ్యమైన సమస్య. ఫ్రాన్స్‌లో అనేక హైస్కూల్ విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతులకు హాజరవుతూ, ఇంటి పనులు, పరీక్షల సన్నద్ధతతో అదనపు ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని వార్తా నివేదికలు పేర్కొన్నాయి. అయితే అన్ని పాఠశాలల్లో పరిస్థితులు ఒకేలా ఉన్నాయని భావించకూడదు. అయినప్పటికీ సుదీర్ఘమైన పాఠశాల దినచర్య, అధిక పనిభారం, తగిన విశ్రాంతి లేకపోవడం విద్యార్థుల అసంతృప్తికి కారణమవుతున్నాయి. విద్యను కేవలం పరీక్షల్లో మార్కులు సాధించే ప్రక్రియగా చూడటం సరైంది కాదు. శారీరక వ్యాయామం, క్రీడలు, కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు, కుటుంబంతో గడిపే సమయం, సామాజిక సంబంధాలు కూడా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరం. నిరంతర ఒత్తిడి విద్యార్థుల ఏకాగ్రత, నిద్ర, అభ్యసన ఆసక్తి, సృజనాత్మకతపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు. అందువల్ల విద్యా విధానాలు పరీక్షల ఫలితాలకే పరిమితం కాకుండా విద్యార్థుల శారీరక, మానసిక, సామాజిక వికాసానికి ప్రాధాన్యత ఇవ్వాలి.

ఫ్రాన్స్‌లో ఉన్నత విద్యా ప్రవేశానికి ఉపయోగించే పార్కుర్‌సప్ ఆన్‌లైన్ విధానంపై కూడా విద్యార్థుల్లో అసంతృప్తి ఉంది.

మిగితా తరువాయి సంచికలో..



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం



# మన ఆర్థిక వ్యవస్థ- బలాలు, బలహీనతలు

అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్ - ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్) తాజాగా భారత ఆర్థిక వృద్ధి అంచనాలను 2026-27 సంవత్సరానికి 7 శాతానికి పెంచడం భారత్ యొక్క స్థూల ఆర్థిక స్థిరత్వానికి నిదర్శనం. గత జూలైలో అంచనా వేసిన 6.7 శాతం కంటే ఇది గణనీయంగా ఎక్కువ. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 2028-31 మధ్య కాలంలో కేవలం 3.2 శాతం సగటు వృద్ధిని సాధించగలదని అంచనా వేస్తున్న సమయంలో, భారత్ 7 శాతం వృద్ధిని నమోదు చేయనున్నట్లు ఐఎంఎఫ్ చెప్పడం అభినందనీయం. దేశీయ డిమాండ్, సేవల రంగం నుండి వస్తున్న బలమైన స్పందన, అనుకూలమైన జనాభా నిర్మాణం, పెరుగుతున్న దేశీయ మార్కెట్ ఈ వృద్ధికి ప్రధాన కారణాలు. అయితే, ఈ సానుకూల గణాంకాల మధ్య నిజమైన సవాలు ఏమిటంటే, ఈ వృద్ధి లాభాలు సామాన్యుల జీవన ప్రమాణాలను ఎంతవరకు మెరుగుపరుస్తాయి అనేది.

ఈ నేపథ్యంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేసిన వ్యాఖ్యలు చాలా ఆసక్తికరంగా ఉన్నాయి. "ఆర్థిక స్థితిస్థాపకత (ఎకనామిక్ రెసిలియన్స్) దేశ జాతీయ భద్రతలో అంతర్భాగం" అని ఆమె అన్నారు. దీన్ని విస్తృత కోణంలో చూస్తే, కేవలం సైనిక శక్తి లేదా క్షిపణులతోనే జాతీయ భద్రత సమకూరదు; ఆర్థిక స్వావలంబన, సాంకేతిక ఆవిష్కరణలు, బాహ్య ప్రమాదాలను తట్టుకునే సామర్థ్యమే నిజమైన భద్రత. రాష్ట్రపతి ప్రస్తావించిన "ఇన్నోవేషన్, టెక్నాలజీ, సన్నద్ధత" అనే అంశాలు ప్రస్తుత భౌగోళిక-రాజకీయ పరిస్థితుల్లో భారత్ కు అత్యవసరం. గాజా, ఉక్రెయిన్ యుద్ధాల నేపథ్యంలో సరఫరా గొలుసుల అంతరాయం, చమురు ధరల ఒడిదుడుకులు ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీస్తున్నాయి. ఇలాంటి సమయంలో భారత్ తన వృద్ధిని కాపాడుకోవడం అంటే అది కేవలం ఆర్థిక విజయం మాత్రమే కాదు, ఒక వ్యూహాత్మక విజయం కూడా.

కానీ, ఈ సానుకూలతకు భిన్నంగా మరో వైపు కొన్ని ఆందోళనకర పరిణామాలు కనిపిస్తున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రూపాయి పతనం (డెప్రిసియేషన్) పై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ అనిశ్చితుల కారణంగా రూపాయి విలువ భారీగా పడిపోతోందని, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ - రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) దానిని అదుపు చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆమె తెలిపారు. ఇది ఒకవైపు ఎగుమతులకు కొంత ఊతమిచ్చినప్పటికీ, దిగుమతి ఖర్చులు, ద్రవ్యోల్బణాన్ని పెంచుతుంది. ముఖ్యంగా చమురు, ఎరువులు, ఎలక్ట్రానిక్ వస్తువుల దిగుమతులపై ఒత్తిడి పెరుగుతుంది. అలాగే, మూలధన లాభాల పన్ను (క్యాపిటల్ గెయిన్స్ టాక్స్) సమీక్ష, సెక్యూరిటీల లావాదేవీల పన్ను (ఎస్టీటీ - సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ టాక్స్) వంటి అంశాలపై కేంద్రం ఆలోచన చేస్తోందని మంత్రి వెల్లడించారు. పన్ను విధానంలో మార్పులు రాబోతున్నాయనే సంకేతాలు మార్కెట్ లో అనిశ్చితిని సృష్టిస్తాయి.

మరోవైపు, కృత్రిమ మేధ (ఏఐ - ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) పెట్టుబడులపై ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార్ మంగళం బిర్లా చేసిన వ్యాఖ్యలు కీలకమైనవి. "ఫోమో (ఎఫ్ఓఎంఓ - ఫియర్ ఆఫ్ మిస్సింగ్ అవుట్) భావనతో కాకుండా, వాస్తవ రాబడి ఆధారంగా ఏఐ పెట్టుబడులు ఉండాలి" అని ఆయన హెచ్చరించారు. ఇది ప్రస్తుత భారత ఐటీ పరిశ్రమ ముందున్న పెద్ద సవాలును ప్రతిబింబిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ టెక్నాలజీలో పోటీ పెరుగుతున్నప్పుడు, భారత్ కేవలం ఔత్సాహిక పెట్టుబడులపై ఆధారపడకుండా, స్వదేశీ పరిశోధన, అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి. లేని పక్షంలో, భవిష్యత్తులో టెక్నాలజీ రంగంలో భారత్ వెనుకబడే ప్రమాదం ఉంది.

మొత్తం మీద చూస్తే, భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఒక కీలక మలుపులో ఉంది. ఒకవైపు ఐఎంఎఫ్ అంచనాలు, బలమైన దేశీయ డిమాండ్, సేవల రంగ వృద్ధి సానుకూల సంకేతాలను ఇస్తున్నాయి. మరోవైపు రూపాయి పతనం, పన్ను సంస్కరణల అనిశ్చితి, ఏఐ పెట్టుబడులపై జాగ్రత్త అవసరం వంటివి ప్రమాద సూచికలు. ప్రభుత్వం తీసుకుంటున్న "ఆత్మనిర్భర్ భారత్" వంటి చర్యలు, రక్షణ రంగంలో స్వదేశీ ఉత్పత్తి, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ విస్తరణ దేశానికి దీర్ఘకాలిక ప్రయోజనాలను అందిస్తాయి. కానీ, ప్రస్తుత సవాళ్లను ఎదుర్కోవడానికి ఆర్బీఐ, ప్రభుత్వం, పరిశ్రమలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆర్థిక వృద్ధి గణాంకాలు పెరగడం ఒక ఎత్తు అయితే, ఆ వృద్ధి ఫలితాలు ప్రతి పౌరుడికి, ముఖ్యంగా యువతకు ఉపాధి కల్పించడంలో, జీవన వ్యయాన్ని అదుపు చేయడంలో ప్రతిఫలించాలి. అప్పుడే భారత్ నిజమైన "ఆర్థిక స్థితిస్థాపకత"ను సాధిస్తుంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

## కుటుంబ కలహాలతో యువ కార్మికుడు ఆత్మహత్య

**రంగారెడ్డి, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువ కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని శేరిగూడలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన బీరేంద్ర కుమార్ ధృవ్(24) ఉపాధి నిమిత్తం శేరిగూడలో నివాసముంటూ కార్మికుడిగా పని చేస్తున్నాడు. గత కొంత కాలంగా కుటుంబ సమస్యల నేపథ్యంలో భార్యతో గొడవలు జరిగినట్లు సమాచారం. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో అతను గదిలోకి వెళ్లి తలుపు వేసుకున్నాడు. అనంతరం అతను మృతి చెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## భార్యపై సుత్తితో దాడి..

- భర్త అరెస్ట్
- పర్వతాపూర్‌లో ఘటన
- గాంధీ ఆస్పత్రిలో బాధితురాలికి చికిత్స



**బోడుప్పల్, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పర్వతాపూర్ గాంధీనగర్ కాలనీలో భార్యను సుత్తితో పలుమార్లు దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన భర్త ఘౌస్ పాషా ఖురేషీ (42)ని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. నిందితుడు 2021లో జైబున్ బేగం (28)ను రెండో వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి మద్యం సేవించి తరచూ భార్యతో గొడవపడుతూ మానసికంగా,శారీరకంగా వేధించేవాడని తెలిపారు.ఈ క్రమంలో అక్టోబర్ 10వ తేదీ రాత్రి భార్యతో గొడవపడగా కుమారులు జోక్యం చేసుకుని వివాదాన్ని సద్దుమణిగించారు.అయితే అక్టోబర్ 11వ తేదీ తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో వేరే గదిలో నిద్రిస్తున్న భార్యపై నిందితుడు సుత్తితో పలుమార్లు దాడి చేశాడు.ఈ ఘటనలో ఆమె తలకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లింది.వెంటనే కుమారులు ఆమెను గాంధీ ఆస్పత్రికి తరలించగా ప్రస్తుతం చికిత్స పొందుతోంది. బాధితురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మేడిపల్లి పోలీసులు వేధింపులు,హత్యాయత్నానికి సంబంధించిన కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ క్రమంలో అక్టోబర్ 14న నిందితుడిని అరెస్ట్ చేసి,దాడికి ఉపయోగించినట్లు ఆరోపణ ఉన్న సుత్తిని స్వాధీనం చేసుకున్నారు.కేసును పూర్తిగా దర్యాప్తు చేస్తున్నట్లు మేడిపల్లి సీఐ జలందర్ రెడ్డి తెలిపారు.

# జుంటుపల్లి ప్రాజెక్టు కాలువల ఆధునీకరణకు రూ.5.71 కోట్లు

- జనంసాక్షి కథనానికి స్పందన త్వరితగతిన అభివృద్ధికి చర్యలు
- పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి
- చివరి ఆయకట్టు వరకు సాగునీరు.. ఆలయ అభివృద్ధికి రూ.20 కోట్ల ప్రతిపాదన
- నీటి పొదుపుపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలి
- డీసీసీ అధ్యక్షుడు దారా సింగ్

**యాలాల, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** యాలాల మండలంలోని జుంటుపల్లి ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు సాగునీటి ఇబ్బందులు తొలగించడంతోపాటు, జంటపల్లి తో పాటు పరిసర గ్రామాల వరకు నీరు చేరేలా కాలువల వ్యవస్థను ఆధునీకరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి చొరవతో మంజూరైన రూ.5.71 కోట్లతో ప్రాజెక్టు ఎడమ, కుడి కాలువల ఆధునీకరణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. జుంటుపల్లి ప్రాజెక్టు పరిధిలోని రైతులకు సాగునీటి సౌకర్యం మెరుగుపరచడం, గ్రామాల అభివృద్ధి, జుంటుపల్లి శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానాన్ని అభివృద్ధి చేయడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.జుంటుపల్లి ప్రాజెక్టు కింద సాగు చేసే రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రాజెక్టు కాలువలు, తూములు దెబ్బతినడంతో నీరు చివరి ఆయకట్టు గ్రామాలకు చేరడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో రూ.5.71 కోట్ల నిధులతో ఆధునీకరణ పనులు చేపట్టినట్లు వివరించారు. అగ్గనూరు, మల్రెడ్డిపల్లి, అక్కంపల్లి, పేర్కంపల్లి తదితర గ్రామాల రైతులకు ప్రయోజనం కలిగేలా పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని, సాగునీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ప్రాజెక్టు నీరు చివరి ఆయకట్టు రైతులకు చేరినప్పుడే ఈ పనుల అసలు లక్ష్యం నెరవేరుతుందని పేర్కొన్నారు.మండలంలో ఇతర అభివృద్ధి పనులను కూడా వేగవంతం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రూ.23 కోట్లతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని, టెండర్ల ప్రక్రియను వేగవంతం చేసి పనులను పట్టాలెక్కిస్తామని తెలిపారు. సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవడంతోపాటు, గ్రామీణ రహదారుల అభివృద్ధి, జాతర సమయంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారిస్తామని చెప్పారు. విద్యారంగానికి ప్రాధాన్యతనిస్తూ మండలంలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, మధ్యతరగతి విద్యార్థులకు మెరుగైన విద్యా ప్రమాణాలు, అవసరమైన వసతులు కల్పించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చని పేర్కొన్నారు. జుంటుపల్లి శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేసి ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సుమారు రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టే ప్రతిపాదనను ప్రస్తావించారు. ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ఆలయ పరిసరాలను అభివృద్ధి చేయడం ద్వారా ఈ ప్రాంతానికి మరింత గుర్తింపు తీసుకురావచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు దారా సింగ్ మాట్లాడుతూ నీటి వినియోగంలో పొదుపు పాటించడం, అందుబాటులో ఉన్న నీటిని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవడం అత్యంత అవసరమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దారా సింగ్ పేర్కొన్నారు. నీటి సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు గ్రామస్థాయిలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. నీటి పొదుపు అంశాన్ని ముఖ్యమంత్రి స్థాయిలో సమీక్షించే విధంగా గ్రామ సర్పంచులతో సమావేశాలు నిర్వహించి, ప్రతి గ్రామంలో నీటి సంరక్షణకు సంబంధించిన కార్యాచరణ రూపొందించాల్సిన




అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. వర్షపు నీటిని వృథా కాకుండా వినియోగించుకోవడం, సాగునీటిని అవసరానికి అనుగుణంగా సద్వినియోగం చేసుకోవడం, తాగునీటి వృథాను అరికట్టడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రాజెక్టుల ద్వారా నీరు అందుబాటులోకి తీసుకురావడంతోపాటు, ఆ నీటిని పొదుపుగా వినియోగించుకోవడం కూడా అంతే ముఖ్యమని దారా సింగ్ పేర్కొన్నారు. రైతులు, గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే నీటి సంరక్షణ కార్యక్రమాలను సమర్థంగా అమలు చేయవచ్చని తెలిపారు. భవిష్యత్తులో నీటి కొరత సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జుంటుపల్లి సర్పంచ్ శ్రీవాణి, పీఏసీఎస్ చైర్మన్ అనిల్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ వడ్డే శ్రీనివాస్, పిఏసిఎస్ మాజీ చైర్మన్ సురేందర్ రెడ్డి, నాయకులు పురుషోత్తం, జనార్దన్‌రెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధ్యక్షుడు శ్రీధర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుర్వ మహిపాల్ వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీడీవో శ్రీనిజ, ఇరిగేషన్ ఈఈ అశోక్, ఏఈ చందనరెడ్డి, రైతులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యం వద్దు

- క్షేత్రస్థాయిలోనే సమస్యలు పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

**వికారాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 14 (జనం సాక్షి) :** జిల్లా లో ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యం వహించకుండా, నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా సాధించాలని, అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ లతో కలిసి జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులకు సూచించారు.బుధవారము వీడియో కాన్ఫరెన్సు హాలు నుండి ఏం పి డి ఓ లు, ఎం పి ఓ లు, ఎ పి ఎం లతో జూమ్ సమావేశము నిర్వహించారు . ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలు, వి బి జి రామ్ జి పనులు మండలాలలో వంద శాతం పూర్తి చేయాలనీ అధికారులకు ఆదేశించారు. ఆయా అంశాలపై మండలాల వారీగా సాధించిన పురోగతిని సమీక్షించారు. సంబంధిత అధికారులు తమ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి, వాటిని వేగవంతంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను



పరిష్కరించి ఫార్మ్ పాండ్స్, సోప్ కిట్స్, అటవీ భూములకు సంబంధించిన అంశాల్లో ఆశించిన స్థాయిలో పురోగతి లేకపోవడంతో ప్రతి అంశంపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టి, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు.ప్రతి మండలంలో ఆయా అంశాల అమలు తీరు, సాధించిన పురోగతి, పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను సమీక్షించారు. పనుల అమలులో వెనుకబడిన మండలాల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, పురోగతిని మెరుగుపరిచేందుకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. మండలం వారిగా వి ఓ బిల్డింగ్ పనులు, కమ్యూనిటి కాంప్లెక్స్ పనులపై ప్రత్యేకంగా దృష్టి సారించి పూర్తి చేయాలనీ అధికారులకు ఆదేశించారు. ఫార్మ్ పాండ్స్ పనులు, సోప్ కిట్స్ పంపిణీ, అటవీ భూములకు సంబంధించిన అంశాలను నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.మంజూరైన ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిదారుల అర్హతల పరిశీలనా పై సుస్చనలు చేశారు. క్షేత్ర స్థాయి తనిఖీ, పత్రాల పరిశీలనా డేటా నమోదు పారదర్శకంగా పూర్తి చేయాలనీ అధికారులకు సూచించారు. సమావేశంలో డిఆర్‌డిఎ శ్రీనివాస్, జిల్లా పంచాయతి అధికారి జయసుధ,మిషన్ భగీరథ రవి కుమార్, హౌసింగ్ పి డి మాత్రు నాయక్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జనగణన-2027పై జీహెచ్‌ఎంసీ అధికారులకు శిక్షణ

**హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 14 (జనం సాక్షి) :** భారత జనగణన-2027 రెండో దశ జనాభా గణన కోసం జీహెచ్‌ఎంసీ పరిధిలోని 1 నుంచి 30 సర్కిళ్లతో పాటు కంటోన్మెంట్ బోర్డు ఛార్జ్ క్లర్కులు, సాంకేతిక సహాయకులకు అక్టోబర్ 13 నుంచి శిక్షణ ప్రారంభమైంది.బుధవారం తెలంగాణ జన గణన కార్యకలాపాల డైరెక్టర్ భారతి హోల్లికేరి( ఐఏఎస్) జీహెచ్‌ఎంసీ కమిషనర్, ప్రధాన జనగణన అధికారి కర్ణన్(ఐఏఎస్), అదనపు కమిషనర్, అదనపు ప్రధాన జనగణన అధికారి బి.సంతోష్ కుమార్(ఐఏఎస్), జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్(ఎన్నికలు) శిక్షణను సమీక్షించారు. గణన బ్లాకుల ఏర్పాటు, సీఎంఎంఎస్ పోర్టల్, మొబైల్ యాప్ ద్వారా 1 నుంచి 40 ప్రశ్నల నమోదు, స్వీయ గణన, క్షేత్రస్థాయి సిబ్బంది శిక్షణపై అవగాహన కల్పించారు. జనగణన కార్యకలాపాల జాయింట్ డైరెక్టర్, జాతీయ శిక్షకుడు వి.శ్రీకాంత్, గణాంక అధికారి శివ రాజు శిక్షణ నిర్వహించారు. జనగణనను కచ్చితత్వంతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులు సూచించారు.




## ఉద్యోగులకు ఓల్డ్ పెన్షన్ స్కీం అమలుపరచాలి

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 14 (జనం సాక్షి) :** ఎల్ఐసి ఉద్యోగులకు ఓల్డ్ పెన్షన్ స్కీం అమలు పరచాలనీ ఎల్ ఐ సి ఎంప్లాయిస్ బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి బంగి రంగారావు అన్నారు. హైదరాబాద్ డివిజన్ నాయకత్వం పిలుపు ఇవ్వడంతో బుధ వారం గద్వాల బ్రాంచ్ లో లంచ్ టైం లో గేట్ మీటింగ్ జరిగింది. ప్రధాన కార్యదర్శి బంగి రంగారావు మాట్లాడుతూ ఎల్ఐసి సంస్థలో 1996 రిక్రూట్మెంట్ అయిన బ్యాచ్ ఉద్యోగులకు ఓల్డ్ పెన్షన్ స్కీం అమలు పరచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామనీ,భారత ప్రభుత్వం ఏప్రిల్ ఒకటి 2010 నుండి ఎల్ఐసిలో కొత్త పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టింది అయితే 1996 రిక్రూట్మెంట్



నోటిఫికేషన్ ఎంపికైన ఉద్యోగులను కూడా ఈ కొత్త పెన్షన్ పరిధిలోకి తీసుకురావడంతో వివాదం మొదలైంది అనీ, ఈ వివాదం ఆగిపోవాలంటే ఓల్డ్ పెన్షన్స్ స్కీమ్ అమల్లోకి తీసుకురావాలి అని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుచున్నామనీ, అందులో భాగంగా గద్వాల ఎల్ఐసి బ్రాంచ్ లో కూడా ఐసీఈయు కామ్రేడ్స్ అందరూ ఈ లంచ్ అవర్ లో పాల్గొని విజయవంతం చేశారని బంగి రంగారావు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ ఐ సి ఎంప్లాయిస్ పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు దీర్ఘకాలిక ఆదాయం

- రైతులకు అవగాహన కల్పించిన ఉద్యానశాఖ అధికారులు

**కొడంగల్, అక్టోబర్ 14 (జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో కొడంగల్ మండలం సంగాయిపల్లి గ్రామంలో బుధవారం ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయిల్ పామ్ సాగు ప్రాముఖ్యత, సాగు విధానాలు, పంట నిర్వహణ, దీర్ఘకాలిక ఆదాయ అవకాశాలపై రైతులకు అధికారులు వివరించారు.జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారి ఎం.ఏ. సత్తార్, ఏడీహెచ్ చంద్రశేఖర్, ఉద్యానవన విస్తరణ అధికారి బాబ్య నాయక్, గ్రామ సర్పంచ్ హనుమయ్య, ఎకోపామ్ కంపెనీ ప్రతినిధులు రైతులకు ఆయిల్ పామ్ సాగు ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఆయిల్ పామ్ సాగు చేపట్టే రైతులు ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటిని పొదుపుగా వినియోగించుకోవచ్చని, నీటి కుంటల నిర్మాణంతో వర్షపు నీటిని నిల్వ చేసుకొని అవసరమైన సమయంలో పంటలకు ఉపయోగించుకోవచ్చని తెలిపారు. అలాగే తీగజాతి కూరగాయల పందిరి సాగుతోపాటు ఉద్యానశాఖ అమలు చేస్తున్న వివిధ పథకాలపై అవగాహన కల్పించారు. ఆధునిక సాగు పద్ధతులను అనుసరించి,




అందుబాటులో ఉన్న ప్రభుత్వ రాయితీలను వినియోగించుకోవడం ద్వారా పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకొని వ్యవసాయ ఆదాయాన్ని పెంచుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు. రైతులు ఉద్యానశాఖ పథకాలపై అవగాహన పెంపొందించుకొని, తమకు అర్హత ఉన్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, ఎకోపామ్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# నాణ్యమైన దర్యాప్తుతో బాధితులకు సత్వర న్యాయం

- పెండింగ్, అదృశ్య కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ
- రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాల నివారణపై దృష్టి
- ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి రివార్డులు, ప్రశంసాపత్రాలు
- జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 14 (జనం సాక్షి) :** ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం సంగారెడ్డి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో పెండింగ్ కేసులు, అదృశ్యమైన వ్యక్తుల కేసులు, న్యాయస్థాన ఆదేశాల అమలు, రోడ్డు ప్రమాదాల నివారణ, మహిళల భద్రత, సైబర్ నేరాల నియంత్రణపై సమీక్షించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులు, అదృశ్యమైన వ్యక్తుల కేసులను ఛేదించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. తీవ్రమైన నేరాల్లో శాస్త్రీయ ఆధారాలను సేకరించి, నిందితులకు న్యాయస్థానంలో శిక్ష పడేలా సమర్థవంతమైన దర్యాప్తు చేపట్టాలని



అన్నారు. దర్యాప్తులో సాంకేతిక, న్యాయపరమైన సందేహాలు తలెత్తితే దర్యాప్తు సహాయక కేంద్రం సేవలను వినియోగించుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట వేగ నిరోధకాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాతీయ రహదారుల పరిసర గ్రామాల్లో ప్రజలకు రహదారి భద్రతపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. మహిళల భద్రతకు ప్రాధాన్యమిస్తూ షీ టీమ్స్ అప్రమత్తంగా పనిచేయాలని, మహిళలపై వేధింపులను అరికట్టడంతోపాటు మహిళా చట్టాలపై అవగాహన పెంచాలని సూచించారు. గ్రామాల్లో రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, అనుమానితుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. నేరాల ఛేదనలో కీలకమైన సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలను ప్రోత్సహించాలని, గ్రామాల ప్రవేశ, నిష్క్రమణ మార్గాలతోపాటు ప్రార్థనా స్థలాలు, పరిశ్రమలు, వసతి గృహాలు, పెట్రోలు బంకుల వద్ద నిఘా కెమెరాలు ఏర్పాటు చేసేలా కృషి చేయాలన్నారు. ఆర్థిక, అంతర్జాల నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలను అప్రమత్తం చేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం పోలీసు వాహనాల నిర్వహణను పరిశీలించిన ఎస్పీ, వాహనాలకు క్రమం తప్పకుండా మరమ్మతులు, నిర్వహణ పనులు చేపట్టి అత్యవసర సమయాల్లో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వాహనాల్లో అత్యవసర సామగ్రి అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించి నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. పోలీసు వాహనాలను పరిశుభ్రంగా ఉంచిన డ్రైవర్లను ప్రత్యేకంగా అభినందించి బహుమతులు ప్రకటించారు. ఈ సమావేశంలో డీఎస్పీలు సత్యయ్య గౌడ్, వెంకట్ రెడ్డి, సైదా నాయక్, శ్రీనివాస్, సురేందర్ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరేందర్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సదా నాగరాజు, జిల్లా ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు సురేష్ నాయక్, రాజశేఖర్ రెడ్డి, డానియెల్, సబ్‌ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లాలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు స్థల పరిశీలన



**మెదక్ బ్యూరో అక్టోబర్ 14 (జనం సాక్షి) :** మెదక్ జిల్లాలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేసేందుకు అవసరమైన భవనాలు, స్థలాలను గుర్తించే ప్రక్రియలో భాగంగా అదనపు కలెక్టర్ నగేష్ జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. రాజు విద్యాశాఖ కోఆర్డినేటర్ రాజు బుధవారం మెదక్ పట్టణంలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ..మెదక్ పట్టణంలోని ధ్యాన్‌చంద్ సర్కిల్ సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలను అధికారులు సందర్శించి, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు సంబంధించి అందుబాటులో ఉన్న భవనాలు, స్థలాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, జిల్లాలో విద్యా అవకాశాలను మరింత విస్తరించేందుకు కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు కీలకంగా నిలుస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. మెదక్ జిల్లాకు కేంద్రీయ విద్యాలయం మంజూరు చేసే నేపథ్యంలో, పాఠశాల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను గుర్తించడం, అందుబాటులో ఉన్న మౌలిక వసతులపై దృష్టి సారించారు. గుర్తించిన అంశాలు, స్థలాలకు సంబంధించిన వివరాలతో కూడిన నివేదికను జిల్లా కలెక్టర్ కు సమర్పిస్తమన్నారు.కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు అవసరమైన స్థల గుర్తింపు, సంబంధిత వివరాల సేకరణలో భాగంగా ఈ పరిశీలన చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

# వనపర్తిలో క్రీడా సంబరాలకు సర్వం సిద్ధం చేయాలి

- ఛాంపియన్స్ కప్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి
- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్
- 15 మండలాల నుంచి క్రీడాకారుల రాక..
- క్రికెట్, కబడ్డీ, బ్యాడ్మింటన్, చెస్ పోటీలు



**వనపర్తి, అక్టోబర్ 14 (జనం సాక్షి) :** జిల్లాలో అక్టోబర్ 16, 17 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న వనపర్తి ఛాంపియన్స్ కప్--2026 క్రీడా పోటీలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్. ఖీమ్యా నాయక్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన క్రీడా పోటీలు నిర్వహించనున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానం, ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానాలను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలకు దసరా సెలవులు ప్రకటించిన నేపథ్యంలో ప్రజలకు, యువతకు పండుగ వాతావరణాన్ని కల్పించాలనే ఉద్దేశంతో తొలిసారిగా ఈ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. క్రీడా ప్రాంగణాలను పోటీలకు అనువుగా తీర్చిదిద్దడంతో పాటు క్రీడాకారులకు తాగునీరు, మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలను సమకూర్చాలని ఆదేశించారు. జిల్లాలోని 15 మండలాల నుంచి క్రికెట్, కబడ్డీ, బ్యాడ్మింటన్, చెస్ తదితర క్రీడల్లో పాల్గొనేందుకు క్రీడాకారులు రానున్నందున, పోటీలను వీక్షించేందుకు వచ్చే క్రీడాభిమానులకు సైతం తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రేక్షకుల కోసం కుర్చీలు, నీడ, తాగునీరు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. శుక్రవారం ఉదయం జరిగే ప్రారంభోత్సవం, శనివారం సాయంత్రం నిర్వహించే ముగింపు కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారిని ఆదేశించారు. క్రీడా ప్రాంగణాల్లో పరిశుభ్రత, తాగునీటి సౌకర్యాల బాధ్యతలను మున్సిపల్ కమిషనర్‌కు అప్పగించారు. అలాగే శనివారం సాయంత్రం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ పర్యటనలో జిల్లా యువజన, క్రీడల అధికారి సుధీర్ కుమార్ రెడ్డి, జిల్లా పౌర సంబంధాల అధికారి పి. సీతారాం, మున్సిపల్ కమిషనర్ నిరంజన్, స్థానిక తహసీల్దార్ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ జీతాల కోసం ఆసుపత్రి కాంట్రాక్టు కార్మికుల సమ్మె



**జడ్చర్ల, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** మూడు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కాంట్రాక్టు కార్మికులు బుధవారం ఏఐటీయూసీ నేతృత్వంలో విధులు బహిష్కరించి ఆసుపత్రి ఎదుట మెరుపు సమ్మె చేపట్టారు. ఆగస్టు వరకు బడ్జెట్ విడుదలైనా అధికారుల, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల దసరా పండుగ వేళ వేతనాలు అందక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి. సురేష్ అన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పందించి న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అర్షదుల్లా కార్మికులతో చర్చలు జరిపి, నేడు పెండింగ్ వేతనాలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు సమ్మె విరమించారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ రెడ్డి, భాగీ కృష్ణ యాదవ్, కార్మికులు పాల్గొన్నారు.

## గడువులోగా ఎస్ఐఆర్-2026 ప్రక్రియ పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ హరిప్రియ



**జడ్చర్ల, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** ఎస్ఐఆర్-2026లో భాగంగా ఓటర్ల నోటీసుల పంపిణీ, విచారణలను గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ అధికారులను ఆదేశించారు. బుధవారం జడ్చర్ల తహసిల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అక్టోబర్ 14 నాటికి 98.57 శాతం నోటీసుల పంపిణీ, 91.23 శాతం విచారణలు పూర్తయ్యాయని, మిగిలినవి త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులు, కొత్త ఓటర్ల కోసం అక్టోబర్ 15, 16 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులు ప్రపత్రం--6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ శిబిరాల్లో బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ప్రతినిధులు అందుబాటులో ఉండాలన్నారు. ఒకే ఇంట్లో 15 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న చోట వివరాలను పరిశీలించాలని, పెండింగ్‌లో ఉన్న పత్రం-6, 7, 8 దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో పలు మండలాల తహసీల్దార్లు, జడ్చర్ల పురపాలక సంఘ అధికారి, ఎన్నికల సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## భూ రీసర్వే పనులను వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ హరిప్రియ



**జడ్చర్ల, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** జిల్లాలో చేపడుతున్న భూ రీసర్వే పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ అధికారులను ఆదేశించారు. జడ్చర్ల మండలం ఖానాపూర్ గ్రామంలో ప్రత్యేక బృందాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను బుధవారం ఆమె పరిశీలించి, పురోగతిని సమీక్షించారు. నూతనంగా శిక్షణ పొందిన రెండు రీసర్వే బృందాల సేవలను వినియోగించుకొని పనులను వేగవంతం చేయాలని తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్, మండల సర్వేయర్‌లకు సూచించారు. రీసర్వే పనుల పురోగతిని జిల్లా యంత్రాంగం ప్రతిరోజూ పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రైతులతో మాట్లాడిన అదనపు కలెక్టర్, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో భూ రీసర్వే నిర్వహిస్తున్నట్లు వివరించారు. భూముల కొలతలను కచ్చితత్వంతో చేపట్టి, సరిహద్దులను గుర్తించేందుకు ఆధునిక రోవర్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. రీసర్వే పూర్తయిన తర్వాత భూయజమానులకు ల్యాండ్ పార్సెల్ మ్యాప్స్ (ఎల్‌పీఎం) అందజేస్తామని, దీనివల్ల భవిష్యత్తులో భూ వివాదాలు తలెత్తవని స్పష్టం చేశారు. భూ రీసర్వే ప్రక్రియ వేగవంతంగా పూర్తయ్యేలా గ్రామస్థులు, రైతులు అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# భూ రీ-సర్వేలో పారదర్శకతే ప్రామాణికం

- రైతుల సమక్షంలోనే హద్దుల నిర్ధారణ
- ఆధునిక రోవర్ సాంకేతికతతో ఖచ్చితమైన సర్వే
- నిర్దేశిత గడువులోగా రీ సర్వే పూర్తి చేయాలి
- అదనపు కలెక్టర్ టి. వినోద్‌కుమార్



**గోపాల్‌పేట్, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** భూ రీ సర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా, పారదర్శకంగా, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారి సమక్షంలోనే భూముల హద్దులను ఖచ్చితంగా నిర్ధారించాలని స్పష్టం చేశారు.

బుధవారం గోపాల్‌పేట మండలం చెన్నూరు, ఏదుల మండలం రేకులపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను అదనపు కలెక్టర్ ఆకస్మికంగా క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. సర్వే రికార్డులను పరిశీలించిన ఆయన, సర్వే బృందాలు వినియోగిస్తున్న ఆధునిక రోవర్ యంత్రాల పనితీరు, భూముల హద్దుల గుర్తింపు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపడుతున్న భూ రీ-సర్వే ద్వారా భూముల హద్దులపై స్పష్టత ఏర్పడటంతో పాటు, భవిష్యత్‌లో భూ వివాదాలకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉంటుందన్నారు. సర్వేకు ముందుగానే సంబంధిత భూ యజమానులకు, సరిహద్దు రైతులకు సమాచారం అందించాలని సూచించారు. హద్దుల నిర్ధారణ సమయంలో సంబంధిత రైతుల సమక్షాన్ని తప్పనిసరిగా నిర్ధారించాలని అధికారులను ఆదేశించారు. సర్వే వివరాలను రికార్డుల్లో నమోదు చేసే సమయంలో సిబ్బంది అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన అనంతరం మాత్రమే హద్దులను ఖరారు చేసి సరిహద్దు రాళ్ల ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులకు రీ--సర్వేపై ఏవైనా సందేహాలు, అభ్యంతరాలు ఉంటే క్షేత్రస్థాయిలోనే పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు.

రైతులకు ప్రయోజనం చేకూరేలా సమన్వయంతో పనిచేస్తూ రీ--సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. రైతులు కూడా సర్వే బృందాలకు సహకరించి తమ భూముల హద్దుల నిర్ధారణలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ తనిఖీల్లో సంబంధిత తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, గ్రామ పాలన అధికారులు, సర్వే సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## మల్లన్న పరిసర ప్రాంతాల్లో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను అరికట్టాలి



**కొమురవెల్లి, అక్టోబర్ 14 (జనం సాక్షి) :** కొమురవెల్లి దేవస్థానం పరిసర ప్రాంతమైన ఎల్లమ్మ గుడికి పోయే దారిలో రోడ్డుపైన అక్రమంగా నిర్మిస్తున్న బిల్డింగ్ పర్మిషన్ను రద్దుచేసి బిల్డింగ్ నిర్మాణాన్ని వెంటనే ఆపాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి తాడూరు రవీందర్ డిమాండ్ చేశారు. ఈరోజు రోడ్డుపై అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాన్ని మండల కమిటీ ఆధ్వర్యంలో పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లమ్మ గుడికి పోయే దారిలో రోడ్డుపైన నిర్మాణాలు చేపడుతున్న దేవాలయ అధికారులు కానీ గ్రామపంచాయతీ అధికారులు కానీ స్పందించకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు దేవస్థానం రోజురోజుకు అభివృద్ధి చెందుతూ వేలాదిమంది వస్తుపోతుంటారు ఎల్లమ్మ గుడికి వాహనాల్లో పోయే సందర్భంలో రోడ్డుపైన ఇల్లు నిర్మించడం వలన రోడ్డు ఇరుకుగా మారి ప్రమాదాలకు నిలయంగా మారుతుందని ఇప్పటికే ఇరుకైన రోడ్లతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లు పర్మిషన్ ఇవ్వడంలో ఎవరైనా చేతివాటం ప్రదర్శించారా అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా దేవాలయ అధికారులు మరియు గ్రామపంచాయతీ అధికారులు స్పందించి రోడ్డుకు దగ్గరగా నిర్మిస్తున్న నిర్మాణాలను ఆపివేయాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా మండల కమిటి సభ్యులు నాయకులు బద్దిపడగ కృష్ణారెడ్డి తేలు ఇస్తారి ఉల్లంపల్లి సాయిలు సార్ల యాదయ్య మ్యకల కృపాకర్ గాంధారి శ్రావణ చారి ఆరుట్ల దయనదు మల్లం అంజయ్య తేలు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## నవాబ్‌పేటలో ఘనంగా పండుగ సాయన్న విగ్రహావిష్కరణ



**నవాబ్ పేట్, అక్టోబర్ 14 (జనం సాక్షి) :** నవాబ్‌పేట మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన పండుగ సాయన్న విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర మత్స్య, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల లిశాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా, మహబూబ్నగర్ కార్పొరేషన్ మేయర్ గుమ్మల మమత , జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పండుగ సాయన్న విగ్రహానికి నివాళులర్పించి, ఆయన సేవలను స్మరించుకున్నారు. ప్రజల కోసం పోరాడిన మహనీయుల చరిత్రను భావితరాలకు అందించడంతో పాటు, వారి ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు, అభిమానులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతిరూపం

- కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ సంబురాలు
- కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 14 (జనం సాక్షి) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంగారెడ్డి కలెక్టరేట్ ప్రాంగణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ సంగీత పాల్గొని బతుకమ్మకు పూజలు నిర్వహించి, మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. ప్రపంచంలో పూలతో జరుపుకునే అరుదైన పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. బతుకమ్మను తెలంగాణ ఇంటి మహాలక్ష్మిగా భావిస్తారని తెలిపారు. కలెక్టరేట్ ప్రాంగణంలో అక్టోబర్ 17వ తేదీ వరకు ప్రతిరోజూ సాయంత్రం 4 గంటల నుంచి బతుకమ్మ సంబురాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. మహిళా సంఘాలు, యువత, మహిళా ఉద్యోగులు, పరిసర కాలనీల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. వివిధ శాఖల భాగస్వామ్యంతో రోజువారీ ప్రణాళిక ప్రకారం సంబురాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు.

## పెండింగ్ జీతాల కోసం ఆసుపత్రి కాంట్రాక్టు కార్మికుల సమ్మె



**జడ్చర్ల, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** మూడు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కాంట్రాక్టు కార్మికులు బుధవారం ఏఐటీయూసీ నేతృత్వంలో విధులు బహిష్కరించి ఆసుపత్రి ఎదుట మెరుపు సమ్మె చేపట్టారు. ఆగస్టు వరకు బడ్జెట్ విడుదలైనా అధికారుల, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల దసరా పండుగ వేళ వేతనాలు అందక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి. సురేష్ అన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పందించి న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అర్షదుల్లా కార్మికులతో చర్చలు జరిపి, నేడు పెండింగ్ వేతనాలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు సమ్మె విరమించారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ రెడ్డి, భాగీ కృష్ణ యాదవ్, కార్మికులు పాల్గొన్నారు.

# రైతులకు మెరుగైన సేవలందించాలి

- రుణాల వసూళ్లపై దృష్టి సారించాలి
- తక్కువ రికవరీ ఉన్న ఐదు బ్యాంకు శాఖలకు నోటీసులు జారీ చేయాలి
- పీఐసీ కమిటీ సమావేశంలో 54 అంశాలకు ఆమోదం
- కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 14 (జనం సాక్షి) :** సహకార బ్యాంకుల ద్వారా రైతులకు, ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలని జిల్లా కలెక్టర్, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి కమిటీ చైర్మన్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. అర్హులైన రైతులకు రుణాలను సకాలంలో మంజూరు చేయడంతోపాటు, రుణాల వసూళ్లు, డిపాజిట్ల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బుధవారం సంగారెడ్డిలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన పర్సన్ ఇన్‌చార్జి కమిటీ (పీఐసీ) సమావేశంలో 54 ఎజెండా అంశాలకు ఆమోదం తెలిపారు. అనంతరం జిల్లా స్థాయి పర్యవేక్షణ, సమీక్ష కమిటీ సమావేశంలో బ్యాంకు కార్యకలాపాలు, రుణాల మంజూరు, వసూళ్లు, డిపాజిట్ల సేకరణ, రైతులకు అందుతున్న సేవలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... బ్యాంకు నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రుణాల వసూళ్లను వేగవంతం చేసి, నిరర్థక ఆస్తులు పెరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. డిపాజిట్ల పెంపునకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించడంతోపాటు, బ్యాంకింగ్ సేవలను పారదర్శకంగా, సులభతరంగా అందించాలని తెలిపారు. బ్యాంకు ఆర్థిక పరిస్థితి, వ్యాపార లావాదేవీలు, లక్ష్యాల సాధనలో పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, బ్యాంకు నిబంధనలను పాటిస్తూ జవాబుదారీతనంతో వ్యవహరించాలని సూచించారు. రుణాల వసూళ్ల శాతం తక్కువగా ఉన్న రామాయంపేట, సంగారెడ్డి స్థానిక శాఖ, ఝరాసంగం, శంకరంపేట-ఆర్, సిద్దిపేట-2 శాఖల అధికారులకు వివరణ కోరుతూ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సహకార బ్యాంకుల అభివృద్ధితోపాటు రైతుల ఆర్థిక ప్రయోజనాలకు ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీసీసీబీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎం. సురేష్, నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారి ఎం.వి. కృష్ణ తేజ, జనరల్ మేనేజర్లు కె. జనార్ధన్, జి. శ్రీనివాస్, ఉప ప్రధాన మేనేజర్లు కె. చంద్రశేఖర్ రెడ్డి, ఎం. రమేష్, సహాయ జనరల్ మేనేజర్లు జి. యాదగిరి, జి. శ్రీనివాస్, కె. వెంకటేశం, ఎల్. సంగమేశ్వర్, ఎ. కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ డిమాండ్‌లో భారీ పెరుగుదల

- వ్యవసాయ అవసరాలు, ఏసీలు, కూలర్ల వినియోగంతో పెరుగుతున్న విద్యుత్ వినియోగం
- నిరంతర విద్యుత్ సరఫరాకు టీజీఎన్‌పీడీసీఎల్ ప్రత్యేక చర్యలు
- ముందస్తు ప్రణాళికతో విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయాలి
- ములుగు సర్కిల్ పరిధిలో పలు విద్యుత్ సబ్‌స్టేషన్లు తనిఖీ చేసిన సీఎండీ



**ములుగు ప్రతినిధి, అక్టోబర్ 14(జనంసాక్షి) :** ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరగడం, వ్యవసాయ విద్యుత్ వినియోగంతో పాటు ఏసీలు, కూలర్ల వాడకం పెరగడం వల్ల విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరుగుతోందని టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, ఐఏఎస్ పేర్కొన్నారు. పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా ముందస్తు ప్రణాళికతో విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయాలని ఆయన అధికారులకు సూచించారు. బుధవారం ములుగు సర్కిల్ పరిధిలో పర్యటించిన సీఎండీ కమలాపూర్‌లోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌తో పాటు మంగపేట, మల్లూరు, అబ్బాపూర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. అనంతరం ములుగులోని ఎస్‌పీఎం షెడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్ల నిర్వహణ, విద్యుత్ పరికరాల పనితీరు, ప్రస్తుత విద్యుత్ సరఫరా పరిస్థితులను సమీక్షించారు. రాబోయే సీజన్‌లో విద్యుత్ డిమాండ్ మరింత పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులు, గృహ, వాణిజ్య విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యుత్‌కు గరిష్ఠ డిమాండ్ ఉండే సమయాల్లో అంతరాయాలను తగ్గించేందుకు, సాధ్యమైన చోట్ల విద్యుత్ లైన్ క్లియరెన్స్‌లను (ఎల్‌సీ) సాయంత్రం వేళల్లోనే ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. 11 కేవీ ఫీడర్లపై విద్యుత్ అంతరాయాలు ఏర్పడినప్పుడు సంబంధిత సిబ్బంది వెంటనే స్పందించి లోపాలను గుర్తించి, యుద్ధప్రాతిపదికన మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనవసరంగా లైన్ క్లియరెన్స్ లు తీసుకోకూడదని సూచించారు. క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను (డీటీఆర్) తక్షణమే మార్చి, విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా పంటలకు నష్టం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో సీఎండీ వెంట ములుగు సర్కిల్ ఎస్ఈ బిక్షపతి, ములుగు డీఈ రాజు, ఏటూరునాగారం ఏడీఈతో పాటు ఇతర విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## బావిలో చిక్కుకున్న మూగ ప్రాణాలకు పునర్జన్మ

- మానవత్వం చాటిన బాసర యువకులు



**బాసర, అక్టోబర్ 14(జనం సాక్షి) :** బాసర గ్రామంలోని ఊప్పుకుంట కాలనీలో బుధవారం హృదయాన్ని హత్తుకునే ఘటన చోటుచేసుకుంది. ఓ పాడుబడిన బావిలో ప్రమాదవశాత్తు పడిపోయిన రెండు చిన్న కుక్క పిల్లలను స్థానిక యువకులు ప్రాణాలకు తెగించి కాపాడి మానవత్వాన్ని చాటారు. స్థానికుల కథనం ప్రకారం, ఊప్పుకుంట కాలనీలోని పాడుబడిన బావి నుండి కుక్క పిల్లల ఏడుపులు వినిపించడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకున్నారు. బావిలోకి తొంగి చూడగా రెండు లేత కుక్క పిల్లలు బురద, చెత్త మధ్య చిక్కుకుని బయటకు రాలేక విలవిల లాడుతున్నాయి. ఈ విషయాన్ని గమనించిన వెంటనే యువకులు ప్యాట్ల నాగేష్, కారేగాం లింగారావు, సాకలి అజయ్ మూగ జీవులను కాపాడాలని నిర్ణయించారు. ఒక యువకుడు తాడు సాయంతో ప్రమాదకరమైన బావిలోకి దిగి, రెండు పిల్లలను ఒక ప్లాస్టిక్ బేసిన్ లోకి చేర్చి, పైనున్న స్నేహితుల సాయంతో తాడుతో పైకి లాగి సురక్షితంగా బయటకు తీశారు. నీరసించిపోయిన ఆ పిల్లలను బయటకు తీసి, శుభ్రం చేసి వదిలిపెట్టారు. మూగజీవాల పట్ల యువకులు చూపిన కరుణ, ధైర్యసాహసాలను స్థానికులు, జంతు ప్రేమికులు అభినంది స్తున్నారు. మనుషులకే కాదు, మూగజీవాలకూ ప్రాణం విలువైనదే అని వారు నిరూపించారని ప్రశంసిస్తున్నారు.

## కళ్లకు గంతలు కట్టుకుని బతుకమ్మ ఆడుతూ నిరసన

- రెండో రోజూ కొనసాగిన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ఆందోళన




**నిర్మల్ బ్యూరో, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులు చేపట్టిన నిరసన రెండో రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా ఉద్యోగులు కళ్లకు గంతలు కట్టుకుని బతుకమ్మ ఆడుతూ వినూత్నంగా నిరసన తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని, ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, వేతనాల పెంపుతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా ఎదురుచూ స్తున్న తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. కళ్లకు గంతలు కట్టుకుని బతుకమ్మ ఆడుతూ నిరసన తెలపడం ద్వారా తమ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఉద్యోగులు విజ్ఞప్తి చేశారు. డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసంఘం జిల్లా అధ్యక్షులు గంగాధర్, సమన్వయకర్త రమణ, శోభ, కేసు భోజన్న, లిజాత, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## నర్సింగ్ విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధన అందించాలి



- కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ బ్యూరో, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో నాణ్యమైన విద్యాబోధన అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల పరిసరాలను పరిశీలించి, పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు చేపడుతూ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత ప్రణాళిక ప్రకారం విద్యా సంవత్సర పాఠ్యాంశాలను పూర్తి చేయాలని ఆదేశించారు. నర్సింగ్ వృత్తి ప్రజలకు సేవ చేసే పవిత్రమైన బాధ్యత అని, విద్యార్థుల్లో సేవాభావాన్ని పెంపొందించాలని పేర్కొన్నారు. చదువు పూర్తయిన తర్వాత విద్యార్థులు నర్సింగ్ వృత్తిలో స్థిరపడేలా నాణ్యమైన శిక్షణ అందించాలని సూచించారు. ముఖ్యంగా ఆచరణాత్మక విద్యాబోధనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కళాశాలలో అవసరమైన మౌలిక సదుపాయాల గురించి అధికారులు కలెక్టర్‌కు వివరించారు. స్పందించిన ఆయన, అవసరమైన సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ తనిఖీలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ మంజుల, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విబిజి రామ్ జీ పథకం కింద అర్హులందరికీ ఉపాధి కల్పించాలి

**నిర్మల్ బ్యూరో, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** గ్రామీణ ప్రాంతాల్లో విబిజి రామ్ జీ పథకం అమలు, అర్హులకు ఉపాధి కల్పన, నీటి సంరక్షణ పనులు చేపట్టే అంశాలపై జిల్లా కలెక్టర్ బుధవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో విబిజి రామ్ జీ జాబ్ కార్డులు కలిగిఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకుగానూ ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, క్షేత్ర సహాయకులు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావం చేత వ్యవసాయం, తదితర అంశాల్లో ఉపాధి అవకాశాలు తగ్గే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరికీ విబిజి రామ్ జీ కింద 125 రోజుల పని కల్పించాలన్నారు. ఉపాధి కల్పన ద్వారా పేదలకు ఆర్థికంగా తోడ్పాటు అందించినట్లవుతుందన్నారు. ఈ పథకం కింద 375 రకాల పనులు చేసుకోవచ్చని, జిల్లాలో అవకాశం ఉన్న పనులు చేపట్టాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పనికి వెళ్లేలా ప్రజల్ని ప్రోత్సహించాలని తెలిపారు. నీటి సంరక్షణ పనులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. దీనిద్వారా పేదలకు ఉపాధి కల్పించడమే కాకుండా, భూగర్భ జలాల సంరక్షణకు తోడ్పడినవారమవుతామని తెలిపారు. ఈ సమావేశంలో ఇన్ ఛార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేశ్, డిఆర్డిఓ విజయలక్ష్మి, డిపిఓ శ్రీనివాస్, ఎంపీడీవోలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భూ సమస్యలను త్వరగా పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ కె.హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 14( జనంసాక్షి ):** జిల్లాలో నెలకొన్న భూ సమస్యలను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లాలోని కౌటాల మండల తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి ఉద్యోగులు, సిబ్బంది హాజరు పట్టిక, రికార్డు గది, భూభారతి ఫైళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలపై వచ్చే దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, రికార్డులను పరిశీలించి సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యాలయంలో అధిక సంఖ్యలో సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నందున భూ సమస్యలపై వచ్చే దరఖాస్తుల పరిశీలన, విచారణ, పరిష్కార ప్రక్రియను వేగంగా నిర్వహించాలని తెలిపారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా 100 శాతం పూర్తి చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండాలని తెలిపారు. మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలో ఓటర్లకు 100 శాతం నోటీసులు జారీ చేసి, వారి నుండి నిబంధనల ప్రకారం ధృవపత్రాలను స్వీకరించాలని తెలిపారు. ఈనెల 15, 16 తేదీలలో జిల్లాలోని పోలింగ్ కేంద్రాలలో శిబిరాలు నిర్వహించి ఫారం 6 దరఖాస్తులను స్వీకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసిల్దార్ హరిలాల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## వెట్టిచాకిరీ నిర్మూలనకు అవగాహన పెంచాలి

- కలెక్టర్ రాహుల్ శర్మ..




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** వెట్టిచాకిరీ, బానిస కార్మిక వ్యవస్థ నిర్మూలనకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. బుధవారం ఐడీఓసీలో కార్మిక శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ సంయుక్తంగా రూపొందించిన స్వేచ్ఛా గమనం ప్రచార రథాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముందస్తు రుణాలు, అప్పుల పేరుతో కార్మికులతో వెట్టిచాకిరీ చేయించే అమానవీయ విధానాలను నిర్మూలించాల న్నారు. ప్రతి కార్మికుడికి స్వేచ్ఛగా పని చేసే హక్కు, సకాలంలో వేతనం పొందే హక్కు ఉందన్నారు. మీ పని.. మీ జీతం.. మీ స్వేచ్ఛ నినాదంతో జిల్లాలోని మండలాలు, గ్రామాలు, పారిశ్రామిక ప్రాంతాలు, నిర్మాణ రంగాల్లో అవగాహన కల్పిస్తామన్నారు. యజమానుల బెదిరింపులు, వేతనాలు చెల్లించకుండా వేధింపులు, గుర్తింపు పత్రాల స్వాధీనం వంటి అంశాలపై ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధితులు హెల్ప్ లైన్ నంబర్ 080-69434343 కు ఫోన్ చేయాలని కోరారు. వెట్టిచాకిరీ రహిత జిల్లాగా భూపాలపల్లిని తీర్చిదిద్దేందుకు అధికారులు, ఎన్జీవోలు సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వెట్టిచాకిరీ నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కార్మిక శాఖ అధికారి వినోద్, మహిళా శిశు సంక్షేమ అధికారి మల్లీశ్వరి, వ్యవసాయ అధికారి బాబురావు, ఎఫ్ఎం ఎస్సెస్ ఎన్జీవో కో ఆర్డినేటర్ ఇక్బాల్ పాషా, క్లస్టర్ కో ఆర్డినేటర్లు ప్రసాద్, ప్రదీప్, రాకేష్, పునరావాస కో ఆర్డినేటర్ నరసింహస్వామి తదితరులు పాల్గొన్నారు.

## బిపిఎం ఆత్మహత్య



**భీమిని, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** భీమిని మండలం కర్జీబింపూర్ బ్రాంచ్ పోస్ట్మాస్టర్ గా విధులు నిర్వహిస్తున్న గజానంద్ (23) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం వెలుగు చూసింది. భీమిని ఎస్ఐ కోటేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం బీపీఎంగా విధులు నిర్వహి స్తూ పోస్ట్ ఆఫీస్ డబ్బులను జల్సాల కోసం వాడుకొని అవి కట్టలేని పరిస్థితిలో ఆత్మహ త్యకు పాల్పడ్డాడని అమృత తండ్రి సాహేబ్రావ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవ పంచనామా నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృదనికి ఈ మధ్య కాలంలో వివాహం అయిందని భార్య సంజీవని ఉందని ఎస్సై కోటేష్ తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో బతుకమ్మ సంబురాలు..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** విధి నిర్వహణలో నిత్యం రోగులకు సేవలందించే వైద్యులు, వైద్య సిబ్బంది బతుకమ్మ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణ బుధవారం బతుకమ్మ పాటలు, కోలాటాలతో సందడిగా మారింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ చేరిన వైద్యులు, సిబ్బంది పాటలు పాడుతూ, కోలాటాలతో లయబద్ధంగా నృత్యాలు చేస్తూ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రోజువారీ విధుల ఒత్తిడిని పక్కనపెట్టి సంప్రదాయబద్ధంగా సంబరాల్లో పాల్గొంటూ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరత్నం, డా.కవిత, డా.రజిత, డా.సౌజన్య, ఉమేశ్వరి, స్వర్ణలత, జయలక్ష్మి, నర్సింగ్ ఆఫీసర్లు, వైద్యులు, ఫార్మసీ ఆఫీసర్ స్వప్న కుమారి, పారామెడికల్ స్టాఫ్, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం శానిటేషన్ సిబ్బందికి బహుమతులు ప్రధానం చేశారు.

## పత్తి రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలి..

- అదనపు కలెక్టర్ అశోక్ కుమార్..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** 2026-27 పత్తి మార్కెటింగ్ సీజన్ లో అక్టోబర్ మూడో వారం నుంచి కొనుగోళ్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ ఆదేశించారు. బుధవారం ఐడీఓసీలోని తన చాంబర్ లో పత్తి కొనుగోళ్లపై జిల్లా స్థాయి సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొను గోలు ప్రక్రియ సజావుగా, పారదర్శ కంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కేంద్రాలను సిద్ధం చేయడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, రవాణా సౌకర్యాలు, నాణ్యత పరీక్షలు, తూకాల్లో పారదర్శకత, అగ్నిమాపక భద్రత తదితర అంశాలపై సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. సీసీఐ, వ్యవసాయ, మార్కెటింగ్, పోలీస్, రవాణా, ఫైర్, లీగల్ మెట్రాలజీ శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. రైతులు ఇబ్బందులు పడకుండా నిబంధనల ప్రకారం కొనుగోళ్లు జరగాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఏఎస్పీ నరేష్ కుమార్, సీసీఐ వరంగల్ జీఎం, జిల్లా వ్యవసాయ అధికారి, ఫైర్ ఆఫీసర్, రవాణా అధికారి, లీగల్ మెట్రాలజీ అధికారులు, పత్తి మిల్లర్లు, వ్యాపారులు, మార్కెట్ కమిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయంలో కూలిన పైకప్పు

- తహసీల్దార్‌కు తృటిలో తప్పిన ముప్పు



**కాటారం అక్టోబర్ 13 (జనం సాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల తాసిల్దార్ కార్యాలయంలో ఘోర ప్రమాదం జరిగింది. తాసిల్దార్ నాగరాజు తో పాటు కంప్యూటర్ ఆపరేటర్లకు తృటిలో ప్రమాదం తప్పింది. బుధవారం ఉదయం యధావిధిగా విధులకు హాజరైన తాసిల్దార్ నాగరాజు తో పాటు కంప్యూటర్ ఆపరేటర్లు కూర్చున్న గది పైకప్పు సీలింగ్ రూఫ్ ఒక్కసారిగా కుప్పకూలింది. పెచ్చులు ఊడిపడి కంప్యూటర్లపై, కుర్చీలపై, ఇతర సామాగ్రిపై ఒక్కసారిగా పైకప్పు పెచ్చులు ఊడిపడ్డాయి. దాంతో అక్కడే ఉన్న తాసిల్దార్ తో పాటు కంప్యూటర్ ఆపరేటర్లు, సిబ్బంది, అధికారిక కార్యక్రమాల పని మీద వచ్చిన ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పైకప్పు పెచ్చులు ఊడి మీద పడడంతో చిన్న చిన్న గాయాలయ్యాయి. ప్రాణాపాయం నుంచి బయటపడగలిగామని తాసిల్దార్ కార్యాలయం సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు. చాలా పురాతన కాలం నాటి నిర్మాణం కావడం వల్ల పైకప్పు పెచ్చులు ఊడి కింద పడిపోయి ప్రాణాపాయ స్థితిలో పలు కార్యాలయ సిబ్బంది భయాందోళన మధ్య విధులు నిర్వహించాల్సి వస్తుంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, వసతి గృహాలలో పైకప్పు స్థితిగతులను పరిశీలించేందుకు ప్రత్యేక బృందాన్ని పంపించి తనిఖీలు చేయించాలని పలువురు కోరుతున్నారు. కాటారం మండలంలోని తాసిల్దార్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ కార్యాలయ సముదాయంలోకి మార్చాలని మరికొందరు కోరుతున్నారు.

## బాలికలు హక్కులు, రక్షణపై అవగాహన కలిగి ఉండాలి

- సోషల్ మీడియాలో అపరిచితులతో స్నేహం చేయవద్దు.
- అవసరమైనప్పుడు షీ టీమ్స్ సేవలను వినియోగించుకోవాలి
- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత




**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 14 (జనవరి సాక్షి) :** వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా షీ టీమ్స్ ఆధ్వర్యంలో బాలికల భద్రత, మహిళా రక్షణ, వ్యక్తిగత అభివృద్ధి, సైబర్ నేరాలు, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు హనుమకొండలోని బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో షీ టీమ్స్ ఎసిపి సదయ్య నేతృత్వంలో బాలికా సంఘాలకు బుధవారం నాడు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ, కౌమార దశలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా అధిగమిస్తూ జీవితంలో లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలని బాలికలకు సూచించారు. ఆరోగ్యకరమైన పోషకాహారం తీసుకోవడంతో పాటు మానసిక, భావోద్వేగ సమతుల్యతను కాపాడుకోవాలని, అవసరమైనప్పుడు షీ టీమ్స్ సహాయం పొందాలని తెలిపారు. సైకాలజిస్ట్ డాక్టర్ బారుపాటి గోపి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరిలో ప్రత్యేకమైన సామర్థ్యాలు ఉంటాయని, వాటిని గుర్తించి అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. మానసిక అడ్డంకులను అధిగమిస్తూ జీవిత లక్ష్యాలపై దృష్టి సారించాలని, సోషల్ మీడియాను విచక్షణతో వినియోగిస్తూ సైబర్ మోసాలు, వేధింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఎల్.రాధిక మాట్లాడుతూ, కౌమార దశలో కలిగే శారీరక, మానసిక మార్పులపై బాలికలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సమస్యలు ఎదురైనప్పుడు భయపడకుండా, సంకోచించకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా వైద్యుల సలహాలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, అడిషనల్ డీసీపీలు బాలస్వామి, ఏసీపీలు సదయ్య, వెంకటరమణ, షీ టీమ్స్ ఇన్‌స్పెక్టర్ సువర్ణ, ఏ హెచ్ టి యు ఇన్‌స్పెక్టర్ ఓ.రమేష్, భరోసా సెంటర్ ఎస్ఐ కిరణ్మయి, షీ టీమ్స్ ఆర్.ఎస్ఐ స్వాతి, ఎస్ఐ రామారావు తదితర పోలీస్ అధికారులు, వరంగల్ జిల్లాలోని తొమ్మిది మండలాలకు చెందిన బాలికలు, మెప్మా, స్వయం సహాయక సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
15 అక్టోబర్ 2026

# ఆరోగ్య నిలయంలో... రోగాల ఊట..!

- పాములపాడు పీహెచ్‌సీ ఆవరణలోనే లీకవుతున్న మిషన్ భగీరథ ట్యాంక్
- నీళ్లు కారి పాకురు పట్టిన వైనం.. ప్రాంగణమంతా మురుగు మడుగు
- దోమల కాటుతో అల్లాడుతున్న రోగులు, గర్భిణులు
- పదేపదే మొరపెట్టుకున్నా పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

**మాడుగులపల్లి, అక్టోబర్ 14 (జనం సాక్షి) :** వైద్యం కోసం ఆసుపత్రికి వెళ్తే ఆరోగ్యం బాగుపడాలి కానీ, ఆ ఆసుపత్రి ప్రాంగణంలోకి అడుగుపెడితేనే కొత్త రోగాలు చుట్టుముట్టే పరిస్థితి దాపరించింది నల్గొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గం, మాడుగులపల్లి మండలం పాములపాడు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సి) ఆవరణ అధికారుల అలసత్వానికి, ప్రజాప్రతినిధుల ని నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారింది.

### నీటి లీకేజీ.. పాకురు పట్టిన ట్యాంక్!

పాములపాడు పీహెచ్‌సీ ఆవరణలోనే నిర్మించిన మిషన్ భగీరథ నీటి ట్యాంకు గత కొంతకాలంగా నిరంతరం లీకవుతోంది. రోజుకు వేలాది లీటర్ల శుద్ధ జలం వృధాగా కిందకు కారిపోతుండటంతో ట్యాంకు గోడలన్నీ నల్లగా మారి, విపరీతమైన పాకురు (శైవరం) పట్టింది. ట్యాంకు కింది భాగమంతా కారిన నీళ్లతో నిండిపోయి ఒక పెద్ద మడుగును తలపిస్తోంది.

### వైద్యం కోసం వస్తే... దోమల వేధింపులు!

ఈ ఆరోగ్య కేంద్రానికి నిత్యం పాములపాడుతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాది మంది రోగులు, గర్భిణులు, పసిపిల్లలు, వృద్ధులు వైద్య పరీక్షలు, టీకాల కోసం వస్తుంటారు. అయితే ట్యాంకు కింద పేరుకుపోయిన నీటి మడుగులో దోమలు విపరీతంగా పెరిగిపోయి ఆసుపత్రి ప్రాంగణాన్ని ఏలుతున్నాయి ఆసుపత్రికి వచ్చి గంటల తరబడి వేచి ఉండే రోగులు, గర్భిణులు ఈ దోమల కాటుకు బలై డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు



### ఇప్పటికైనా నిద్రమత్తు వీడరా?

ఈ తీవ్రమైన సమస్యపై గ్రామస్తులు పలుమార్లు సంబంధిత మిషన్ భగీరథ అధికారులు, పంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం శూన్యమని మండిపడుతున్నారు ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన ఆసుపత్రి ఆవరణలోనే రోగాలకు నిలయంగా మారిన నీటి మడుగు ఉంటే అధికారులు ఏం చేస్తున్నారు? స్థానిక ప్రజాప్రతినిధులు నిద్రపోతున్నారా? అని గ్రామస్తులు ఘాటుగా ప్రశ్నిస్తున్నారు ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం, మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులు తక్షణమే స్పందించి ట్యాంకు లీకేజీకి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని, ఆవరణలో నిలిచిన మురుగు నీటిని తొలగించి బ్లీచింగ్, యాంటీ-లార్వల్ స్ప్రేలు చల్లాలని ప్రజలు బలంగా డిమాండ్ చేస్తున్నారు.

# రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి

**కోట్‌పల్లి, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తూ, వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సూచించారు. కోట్‌పల్లి మండల కేంద్రంలోని డీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా అనిత రమేష్ నాయక్, వైస్ చైర్‌పర్సన్‌గా మధులత శ్రీనివాస్ చారితో పాటు నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.... నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌తో పాటు పాలకవర్గ సభ్యులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. రైతుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సేవలు అందించాలని, వారి అభ్యున్నతికి ప్రాధాన్యతనిస్తూ మార్కెట్ కమిటీ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని కోరారు. రైతులకు నమ్మకమైన సేవలు అందించి మార్కెట్ కమిటీకి మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, 21 మంది లబ్ధిదారులకు రూ.21,02,436 విలువైన కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అలాగే అర్హులైన లబ్ధిదారులకు డిజిటల్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి



**పి.ఏ.పల్లి, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** ప్రభుత్వ భూముల పరిరక్షణ బాధ్యత అధికారులదే అయినప్పటికీ,ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోందనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.నల్లగొండ జిల్లా పి.ఏ.పల్లి మండలం వద్దిపట్ల గ్రామంలో సర్వే నెంబర్ -421యందు సుమారు 30 గుంటల ప్రభుత్వ భూమిని ఆక్రమించి ప్లాట్లుగా విభజించి విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఈ వ్యవహారంపై సంబంధిత రెవెన్యూ అధికారులు స్పందించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులు ఆక్రమణలపై దృష్టి సారించకపోతే విలువైన ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతమయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.భూమి ఆక్రమణకు గురైందనే ఆరోపణలు వస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.

### అధికారులు స్పందించాలి.. విచారణ జరపాలి

సంబంధిత భూమి ప్రభుత్వ రికార్డుల్లో ఏ విధంగా నమోదై ఉంది? భూమిని ప్లాట్లుగా విభజించి విక్రయించేందుకు ఎలాంటి అనుమతులు ఉన్నాయి? ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందనే ఆరోపణల్లో వాస్తవమెంత? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు.ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇప్పటికైనా రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి భూమి రికార్డులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో ఎక్సైజ్ అధికారుల మెరుపు దాడులు

- 3,200 లీటర్ల నాటుసారా, ముడిసరుకు ధ్వంసం..
- రెండు కేసులు నమోదు
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ అధికారుల సంయుక్త చర్యలు

**భద్రాచలం, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** తెలంగాణ – ఆంధ్రప్రదేశ్ అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో అక్రమ నాటుసారా తయారీపై ఎక్సైజ్ అధికారులు ఉక్కుపాదం మోపారు. నాటుసారా తయారీ కేంద్రాలపై రెండు రాష్ట్రాల అధికారులు సంయుక్తంగా మెరుపు దాడులు నిర్వహించి, సుమారు 3,200 లీటర్ల బెల్లం పులుసు (వాష్)ను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో రెండు కేసులు నమోదు చేశారు. ఖమ్మం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్, ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్, కొత్తగూడెం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు బుధవారం ఈ సంయుక్త దాడులు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్‌లోని యటపాక మండలం, చింతూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న గుండువారిగూడెం, పిచుకలపాడు గ్రామాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించి అక్రమ నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన బెల్లం పులుసును ధ్వంసం చేశారు.

### రెండు రాష్ట్రాల అధికారుల సమన్వయంతో దాడులు

ఈ దాడుల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ నరేందర్, కొత్తగూడెం డీటీఎఫ్ బృందం, మణుగూరు ఎస్‌హెచ్‌ఓ నాగేశ్వర్‌రావు, పాల్వంచ ఎస్‌హెచ్‌ఓ అశోక్‌కుమార్, భద్రాచలం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బి. కిష్టయ్య పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అనకాపల్లి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ సురేష్, రంపచోడవరం ఏఈఎస్, డీటీఎఫ్ అధికారి సుబ్రహ్మణ్యం, చింతూరు ఎస్‌హెచ్‌ఓ విజయలక్ష్మి, యటపాక పోలీస్‌స్టేషన్ సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు. కరీం, సీతారామ్, శ్రావణ్, జమాల్, రాకేష్, కిరణ్, సుజాత తదితర సిబ్బంది తనిఖీల్లో భాగస్వాములయ్యారు.

– నాటుసారాతో అనారోగ్య ముప్పు.. ప్రజలకు అవగాహన.

దాడుల అనంతరం ఆయా గ్రామాల్లో అధికారులు ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాటుసారా సేవించడం వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, కుటుంబాలపై పడే ఆర్థిక, సామాజిక ప్రభావాలను వివరించారు. నాటుసారా తయారీ,



విక్రయం, నిల్వ, రవాణా వంటి అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఇలాంటి అక్రమాలపై సమాచారం తెలిస్తే సంబంధిత అధికారులకు తెలియజేసి సహకరించాలని గ్రామస్థులను కోరారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో అక్రమ నాటుసారా తయారీని అరికట్టడం, ప్రజారోగ్యాన్ని పరిరక్షించడం, మద్యం దుష్ప్రభావాలపై ప్రజల్లో చైతన్యం కల్పించడమే లక్ష్యంగా రెండు రాష్ట్రాల అధికారులు సమన్వయంతో ఈ దాడులు నిర్వహించినట్లు భద్రాచలం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బి. కిష్టయ్య తెలిపారు.

# మేళ్లచెరువులో దొంగల స్వైరవిహారం

- సీసీ కెమెరాలున్నా తగ్గని చోరీలు..
- పోలీసుల తీరుపై వ్యాపారుల ఆగ్రహం
- కిరాణా దుకాణాలే టార్గెట్..
- పెట్రోలింగ్ పెంచాలని డిమాండ్

**మేళ్లచెరువు, అక్టోబర్ 14 (జనం సాక్షి) :** మేళ్లచెరువులో వరుస చోరీలతో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా దొంగలు ఏమాత్రం భయపడకుండా చోరీలకు పాల్పడుతున్నారని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. గతంలో రెండు, మూడు చోరీలు జరిగినప్పటికీ నిందితులను పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారని, కేసులు నమోదు చేసి వదిలేయడంతో దొంగలకు మరింత ధైర్యం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా మండల కేంద్రంలోని కిరాణా దుకాణాలను లక్ష్యంగా చేసుకుంటూ, షాపుల్లో ఎవరూ లేని సమయాన్ని గమనించి కౌంటర్లలోని నగదును అపహరిస్తున్నట్లు చెబుతున్నారు. చోరీలకు సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయినప్పటికీ నిందితులను పట్టుకోవడంలో జాప్యం జరుగుతోందని వ్యాపార వర్గాలు విమర్శిస్తున్నాయి. కష్టపడి వ్యాపారం చేస్తూ సంపాదించిన డబ్బును దొంగలపాలు చేసుకోవాల్సి వస్తోందని, తమకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఎవరిదని వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి మేళ్లచెరువులో పోలీసు పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని, గత చోరీ కేసులను సమగ్రంగా దర్యాప్తు చేసి నిందితులను గుర్తించి అరెస్టు చేయాలని, వ్యాపారులకు భద్రతపై భరోసా కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.



# ఘనంగా బతుకమ్మ సంబరాలు జరుపుకోవాలి

- టీజీవోల ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ దివాకర



**ఖమ్మం, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు భక్తిశ్రద్ధలు, ఉత్సాహంతో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర పిలుపునిచ్చారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) రాష్ట్ర సంఘం పిలుపు మేరకు, ఖమ్మం జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న బతుకమ్మ సంబరాల గోడపత్రికను బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీవోసీ) ప్రాంగణంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీజీవో జిల్లా అధ్యక్షుడు కొంగర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రకృతిని ఆరాధించే విశిష్టమైన పండుగ బతుకమ్మ అని కొనియాడారు. జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి మాట్లాడుతూ.. మహిళా అధికారుల మధ్య ఐక్యత, సోదరభావం, సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందించేందుకు ఈ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు జి.ఉషాశ్రీ, కార్యదర్శి పి.సుధారాణి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి గుడికందుల జ్యోతి, టీజీవో రాష్ట్ర మహిళా విభాగం కార్యవర్గ సభ్యురాలు విజయకుమారి, జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, పురపాలక ఉద్యానవన శాఖాధికారి రాధిక, జిల్లా ఉపాధి కల్పనాధికారి మాధవి, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు కరుణశ్రీతో పాటు నాయకురాళ్లు నాగలక్ష్మి, కుసుమకుమారి, ఇందిర, నాగమణి, ఇతర మహిళా గెజిటెడ్ అధికారులు, ఉద్యోగినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపులు

- నేడు, రేపు ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపుల నిర్వహణ
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సూర్యాపేట జిల్లాలోని అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఈ నెల 15, 16వ తేదీల్లో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ప్రచార క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఇటీవల ప్రచురించిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో పేర్లు లేని వారు, అలాగే 18 సంవత్సరాలు నిండి నూతనంగా ఓటు హక్కు పొందబోయే యువత అందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అన్నారు.కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఫారం 6 నింపి అవసరమైన పత్రాలతో పాటు డిక్లరేషన్ ఫారం నింపి వయస్సు, నివాస ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ ప్రత్యేక క్యాంపు రోజుల్లో ఉదయం నుంచే సంబంధిత బూత్ లెవెల్ అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు అన్ని పోలింగ్ కేంద్రాల్లో స్థానికంగా అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.సూర్యాపేట జిల్లా పరిధిలోని ఎన్నికల నోడల్ అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు అందరూ తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఈ ప్రత్యేక క్యాంపులు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని, ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు.సూర్యాపేట జిల్లాలోని అర్హులైన యువత, పౌరులందరూ తమ సమీపంలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఓటరుగా నమోదు చేసుకోవాలని, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును పొంది భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# పెండింగ్ నోటీసుల పంపిణీ, విచారణలను పూర్తి చేయాలి

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలి
- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 14 (జనం సాక్షి) :** ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా పెండింగ్‌లో ఉన్న నోటీసుల పంపిణీ, విచారణలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ కార్యక్రమం, ఎమ్మెల్సీ ఓటరు జాబితా నమోదుపై జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి జిల్లాలో మొత్తం 1,75,841 నోటీసులకు గాను ఇప్పటివరకు 1,630 నోటీసుల పంపిణీ మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని 99.07 శాతం నోటీసుల పంపిణీ పూర్తయిందని తెలిపారు. 1,58,144 మందికి విచారణ పూర్తి చేశామని వెల్లడించారు. మిగిలిన విచారణలను నవంబర్ నాటికి పూర్తి చేయాలని, ఓటర్ల నుంచి స్వీకరించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులైన వారిని ఓటరు జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఫారం-6కు సంబంధించి మొత్తం



6,435 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. వీటి పరిష్కారంపై ఈఆర్‌ఓలు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సమీక్షించి వచ్చే వారంలోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. అర్హులైన దరఖాస్తుదారులకు ఇబ్బందులు కలగకుండా సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో ఇప్పటివరకు జిల్లాలో సుమారు 27 వేల మంది నమోదు చేసుకున్నారని కలెక్టర్ తెలిపారు. గతంలో 84 వేల మంది ఓటర్లుగా నమోదయ్యారని పేర్కొన్నారు. ఈసారి కనీసం 2 లక్షల మంది గ్రాడ్యుయేట్లను ఓటర్లుగా నమోదు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని తెలిపారు. నవంబర్ 6 ఓటరు నమోదు చివరి తేదీ కావడంతో అర్హులైన గ్రాడ్యుయేట్లందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. నమోదు ప్రక్రియపై విస్తృత ప్రచారం నిర్వహించి, నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించేలా కృషి చేయాలని అన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు సంబంధించిన అర్హతలు, దరఖాస్తు విధానం, నమోదు ప్రక్రియపై సామాజిక మాధ్యమాలు, పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, కేబుల్ ఛానళ్ల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా అర్హులైన గ్రాడ్యుయేట్లకు అవగాహన కల్పించి, ఓటరు నమోదు ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ఎం.ఏ. రాజు, డిటి అన్సారీ, భారత రాష్ట్ర సమితి ప్రతినిధులు బి. వేణుగోపాల్, ఎం. రమేష్, ఏ. సతీష్ బాబు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, భారతీయ జనతా పార్టీ ప్రతినిధి వి. రాజేష్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, బహుజన్ సమాజ్ పార్టీ ప్రతినిధి వేల్పుల రామయ్య, సీపీఎం పార్టీ ప్రతినిధి ఆర్. ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ

- డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్, సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సులు అందుబాటులోకి
- ఐటీడీఏ పీవో బి.రాహుల్



**భద్రాచలం, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచి, స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించేందుకు ఐటీడీఏ భద్రాచలం ఆధ్వర్యంలో రెండో విడత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు సంబంధించిన గోడపత్రికను బుధవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ట్రైకార్, గిరిజన సంక్షేమ శాఖ సహకారంతో నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా గిరిజన యువత కోసం పలు వృత్తి నైపుణ్య కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. వీటిలో డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ వంటి ఆధునిక సాంకేతిక కోర్సులు ఉన్నాయని పేర్కొన్నారు. శిక్షణ ద్వారా యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడంతో పాటు, వారి నైపుణ్యాలను పెంపొందించి ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలు పొందేందుకు దోహదపడనున్నట్లు వివరించారు. అర్హులైన గిరిజన యువతకు శిక్షణతో పాటు ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. నిరుద్యోగ గిరిజన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, తద్వారా తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని పీవో రాహుల్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్, జేడీఎం హరికృష్ణ, వైటీసీ మేనేజర్ నక్క శ్రీను, వైటీసీ సిబ్బంది పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
15.10.2026




## అంతిమయాత్రలో అపశృతి..

**టపాసులు పేలి నలుగురికి గాయాలు తీవ్ర గాయాలు**

**టేకులపల్లి, అక్టోబర్ 14(జనంసాక్షి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం బేతంపూడి గ్రామపంచాయతీ పరిధిలోని వెంకటయ్య తండాలో బుధవారం విషాద ఘటన చోటుచేసుకుంది. ఓ మహిళ అంతిమయాత్ర బుధవారం నిర్వహణ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన డీజే ట్రాలీ క్యాబిన్‌లో టపాసులు ప్రమాదవశాత్తు పేలడంతో నలుగురు గాయపడ్డారు. ఈ ఘటనతో జనాల ఆర్తనాధాలతో మారు మోగిపోయింది. జరిగిన ఈ ప్రమాదంలో భూక్య రానా, ఆంగోతు ధ్రువన్ తీవ్రంగా గాయపడ గా, ధరావత్ రవికుమార్‌తో పాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. పేలుడు ధాటికి డీజే ట్రాలీ క్యాబిన్‌లో ఉన్నవారు గాయపడటంతో స్థానికులు వెంటనే వారిని ఆసుపత్రికి తరలించారు. తొలుత టేకులపల్లి రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స అందించగా, తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తీవ్ర గాయాలు పాలైన భూక్య రానా ను హైదరాబాద్కు తరలించారు.ప్రమాద సమాచారం తెలుసుకున్న టేకులపల్లి ఎస్సై కోగిల తిరుపతి రిమ్స్ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరిశీలించారు. వారి ఆరోగ్య పరిస్థితి ని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని కూడా పరిశీలించారు. అంతిమయాత్రలో టపాసులు పేలడంతో ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోందని, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై తెలిపారు. ఈ ఘటనతో వెంకటయ్య తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# ‘పీఠం’ దక్కేదెవరికో..!

**నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం ఆశావహుల హడావుడి**

**తెరవెనుక తీవ్ర కసరత్తుతో వేడెక్కిన రాజకీయం**



**నిజామాబాదు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు అధికార పార్టీలో రాజకీయం తారాస్థాయికి చేరింది. ఎస్సీ జనరల్ కేటగిరీకి కేటాయించిన ఈ కీలకమైన పీఠాన్ని దక్కించుకోవడానికి ఆశావహులు తెరవెనుక తీవ్ర ప్రయత్నాలు, లాబీయింగ్‌లు సాగిస్తున్నారు.ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం శ్రమించిన సాధారణ కార్యకర్తలను విస్మరించి, పదవుల పంపకంలో వేరే కోణాలు తెరపైకి వస్తుండటం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ మొదలైనప్పటి నుంచి జిల్లా రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి.**

**నిజామాబాదు జిల్లా ప్రతినిధి(జనంసాక్షి):** పార్టీ కోసం క్షేత్రస్థాయిలో కష్టపడిన వారిని కాదని, ఎన్నికల సమయంలో పార్టీని వీడి వెళ్లిన వారికి లేదా పార్టీ సిద్ధాంతాలను పక్కనబెట్టి వ్యతిరేకంగా పనిచేసి తిరిగి వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచి, సైనికులా పని చేసిన సాధారణ కార్యకర్తలను పక్కనపెట్టి, ఆర్థికంగా బలమున్నవారికే పదవులు కట్టబెడుతున్నారనే ఆరోపణలు పార్టీ శ్రేణుల్లో తీవ్ర నిరాశకు గురిచేస్తున్నాయి. “పార్టీ కోసం ఏడేళ్లు పనిచేసిన కార్యకర్త కంటే రాజకీయ ఎత్తుగడలు, లాబీయింగ్, ఆర్థిక బలం ఉన్నవారికే ప్రాధాన్యత దక్కుతోందా? అనే ప్రశ్న ఇప్పుడు పార్టీ వర్గాల్లో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

**తెరవెనుక లాబీయింగ్ జోరు. ఆశీస్సుల కోసం ప్రయత్నాలు**

మార్కెట్ కమిటీ పీఠం రేసులో నిలవడానికి పలువురు నేతలు తమ ప్రభావాన్ని ప్రదర్శిస్తూ, అధిష్టానం పెద్దల వద్ద ఆశీస్సులు పొందేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ పదవిని దక్కించుకునేందుకు అవసరమైన సంఖ్య, ఇతర సమీకరణాలను తమకు అనుకూలంగా మార్చుకునే పనిలో ఆశావహులు నిమగ్నమయ్యారు. ఒకవైపు ఎన్నికల్లో పార్టీ గెలుపునకు పనిచేసిన సీనియర్ నేతలు పదవుల రూపంలో ప్రాధాన్యం దక్కాలని కోరుతుండగా, మరోవైపు పార్టీని నమ్ముకుని ఇన్నాళ్లు పనిచేసిన కార్యకర్తల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోందని పరిశీలకులు భావిస్తున్నారు.




**అధిష్టానం నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ**

అర్హత,నిబద్ధత మరియు ప్రజలతో సత్సంబంధాలు ఉన్నవారికే పదవి దక్కుతుందా, లేక రాజకీయ సమీకరణాల పేరుతో మరోసారి ప్రాధాన్యతలు మారుతాయా అనే దానిపై తీవ్రమైన చర్చ జరుగుతోంది.నామినేటెడ్ పదవుల కేటాయింపు విషయంలో పార్టీ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఇప్పుడు అత్యంత ఆసక్తికరంగా మారింది. కేవలం ఒక పదవిని భర్తీ చేయడం మాత్రమే కాకుండా,పార్టీ నిబద్ధతకు, కార్యకర్తల త్యాగాలకు తగిన గుర్తింపు లభిస్తుందా లేదా అనేది వేచి చూడాలి.

## బంతి పూల తోట.. ఉపాధికి బాట..



**ముస్తాబాద్ (జనంసాక్షి):**నీటి ఎద్దడితోటి అరుతాడి పంటల వైపు.. చికోడ్ గ్రామంలో బంతిపూల సాగు యువరైతు రమేష్ వాణిజ్య పంటలతో రైతులకు ఆర్థిక భరోసా బతుకమ్మ పండుగ వేళ బంతిపూల డిమాండ్ , ముస్తాబాద్ మండలం చికోడు గ్రామానికి చెందిన సోమరి పేట రమేష్ యువరైతు తనకు ఉన్నటువంటి 20 గుంటల భూమిలో బంతిపూల సాగు చేసి తక్కువ పెట్టుబడి ఎక్కువ లాభం పొందుతూ నీటి కొరత ఉన్నందువలన ఇబ్బంది లేకుండా బంతిపూల పూల తోటను సాగు చేస్తున్నట్లు రమేష్ తెలిపారు. గత ఆరు సంవత్సరాల నుండి బంతిపూల తోట వేస్తున్నాను. మూడు నెల వరకు పువ్వులు కోతకు వస్తాయి బతుకమ్మ పండుగ వరకు పూర్తవుతుంది మహిళలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తక్కువ రేటుకు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పంట వలన రైతులకు ఎలాంటి పెట్టుబడి లేకుండా నీటి సమస్య లేకుండా కరెంటు సమస్య లేకుండా మంచి లాభాలు వస్తాయని రైతు తన మాటల్లో వినిపించారు. యాసంగి సీజన్లో ప్రతి రైతు అరుతడి పంటలు ఎంపిక చేసుకొని లాభాలు పొందాలని మండల వ్యవసాయ అధికారి అనూష మండల రైతులకు సూచించారు.

## ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు

న్యూఢిల్లీ(జనంసాక్షి):సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా, సర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనలు చేస్తున్న సీజేపీ కార్యకర్తలకు రాహుల్ గాంధీ మద్దతుగా నిలవడాన్ని భాజపా తీవ్రంగా తప్పుపట్టింది. దేశాన్ని తప్పుదోవ పట్టించవద్దని ఆయనకు హితవు పలికింది. నిరసన తెలిపేందుకే రాజ్యాంగం హక్కు కల్పించిందని, చట్టాన్ని ఉల్లంఘించడానికి కాదని పేర్కొంది. “దేశాన్ని తప్పుదోవ పట్టించొద్దు. నిరసన తెలిపేందుకే రాజ్యాంగం హక్కు కల్పించింది. అంతేకానీ, చట్టాన్ని ఉల్లంఘించడానికి కాదు. నిబంధనల ప్రకారమే జంతర్ మంతర్‌పై నిర్ణయం తీసుకున్నారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదు. దశాబ్దాల పాటు మీ పార్టీ, కుటుంబం.. ఆర్టికల్ 370కు మద్దతు తెలుపుతూ వచ్చింది. కానీ, ప్రధాని మోదీ దానిని రద్దు చేస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. అధికారం కోసం బహిరంగ ప్రదేశాలను అల్లర్లకు కేంద్రాలుగా మార్చలేరు. దేశం ఎప్పుడూ చట్టం వైపే నిలుస్తుంది. రాజకీయ ప్రయోజనాల కోసం కాదు” అని భాజపా జాతీయ మీడియా కన్వీనర్ ఆశీష్ ఉషా అగర్వాల్ దుయ్యబట్టారు.

# మా నీళ్లు మాకే కావాలి..

**రైతులతో కలిసి ఎస్సారెస్పీ డీ-86 కెనాల్ వద్ద మాజీ మంత్రి గంగుల ఆందోళన**



**చొప్పదండి ,అక్టోబర్ 14 (జనంసాక్షి):** కరీంనగర్, చొప్పదండి నియోజకవర్గాల రైతుల సాగు నీటి హక్కుల కోసం మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ రైతులతో కలిసి చొప్పదండి పట్టణంలోని ఎస్సారెస్పీ డీ-86 కెనాల్ వద్ద ఆందోళనకు దిగారు. చొప్పదండి చౌరస్తా నుంచి రైతులను ట్రాక్టర్‌లో ఎక్కించుకొని స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ ఎస్సారెస్పీ డీ-86 కెనాల్ వద్దకు చేరుకున్నారు. అక్కడ రైతులతో కలిసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ‘మా నీళ్లు మాకే కావాలి’ అంటూ రైతులు ముక్తకంఠంతో నినదించారు. సాగునీరు అందక పంటలు దెబ్బ తింటున్నా అధికారులు స్పందించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు నీటిని విడుదల చేయకుంటే కెనాల్ బ్రిడ్జిపై నుంచి నీటిలో దూకుతానని అధికారులను హెచ్చరించారు. రైతుల సమస్యను పరిష్కరించేందుకు స్వయంగా రంగంలోకి దిగిన ఆయన.. రెగ్యులేటరీ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులతో చర్చలు జరిపి 300 క్యూసెక్కుల నీటి విడుదలకు కృషి చేశారు.ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. కరీంనగర్, చొప్పదండి నియోజకవర్గాల రైతులకు సాగునీటి పంపిణీలో వివక్ష చూపడం తగదన్నారు. పెద్దపల్లి ప్రాంత రైతులకు పంటలు ఉన్నట్లే తమ ప్రాంత రైతులకూ పంటలు ఉన్నాయని, వారే రైతులా.. తాము రైతులం కాదా అని ప్రశ్నించారు. రైతులందరికీ సమానంగా సాగునీరు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు అధికారులపై ఉందని పేర్కొన్నారు. కాళేశ్వరం జలాల రాకతో ఎస్సారెస్పీతో పాటు వివిధ రిజర్వాయర్లు, కాలువల్లో నీటి లభ్యత పెరిగిందని గుర్తుచేశారు. ఎస్సారెస్పీ నీటిని సాగునీటితో పాటు తాగునీటి అవసరాలకు, ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారని తెలిపారు. అలాంటప్పుడు కరీంనగర్, చొప్పదండి ప్రాంతాల రైతులకు సాగునీరు అందించడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని నిలదీశారు.డీ-83, డీ-86 కెనాళ్లకు సరిపడా నీరు అందక పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలను కాపాడుకోవడానికి నీటి కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి రావడం బాధాకరమన్నారు. సాగునీటిని సమర్థంగా పంపిణీ చేసి చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రస్తుతం విడుదల చేసిన నీటిని తిరిగి నిలిపివేస్తే మరోసారి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. రెండు జిల్లాల కలెక్టర్లు పరస్పరం సమన్వయం చేసుకొని కరీంనగర్, చొప్పదండి ప్రాంతాల రైతులకు సమానంగా సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతుల పంటలను కాపాడటమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఆందోళన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, కరీంనగర్ పీఏసీఎస్ చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, కరీంనగర్ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్ గౌడ్, చొప్ప దండి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చొక్కా రెడ్డి, ఇరుకుల్ల సర్పంచ్ బుర్ర రమేష్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ సుంకి శాల సంపత్ రావు, కరీంనగర్, చొప్పదండి నియోజకవర్గాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## రీ-సర్వేతోనే సమస్యకు చెక్

**భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం**
**రైతుల హక్కులకు భంగం కలగకుండా చర్యలు: అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి**

**చింతకాని, అక్టోబర్ 14 (జనంసాక్షి):** చింతకాని మండలం లచ్చగూడెం గ్రామంలో జరుగుతున్న భూ రీ-సర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి బుధవారం పరిశీలించి రీ-సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. భూ హక్కుదారులు, సరిహద్దు రైతుల సమక్షంలో సర్వే నిర్వహించి, రైతుల హక్కులకు ఎలాంటి నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సర్వే అనంతరం భూ వివరాలను గ్రామ పంచాయతీ, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రదర్శించి, అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించిన తర్వాత ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని తెలిపారు. రీ-సర్వే పూర్తయితే భూ వివాదాలు తగ్గి రైతులకు భద్రత కలుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కరుణ శ్రీ, సర్వే అధికారులు, రైతులు, భూ యజమానులు పాల్గొన్నారు.



## ‘కాక్రోచ్’పై కాదు.. సమస్యలపై దృష్టిపెట్టండి

– కేంద్రంపై అభిజీత్ దీప్కే విమర్శలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తమ పార్టీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలకు 5 రోజుల కస్టడీ విధించడాన్ని తప్పుబట్టారు. త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించినందుకు వారిని తిహాడ్ జైలుకు తరలించారని ఆరోపించారు. నిరసన తెలపడం రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కు అని, దానిని ఎవరూ అడ్డుకోలేరని అన్నారు. ప్రజాస్వామ్యం, ఓటు పరిరక్షణ కోసమే తాము ఉద్యమం చేస్తున్నట్లు స్పష్టం చేశారు.“మోదీజీ.. మీరు దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించాలనుకుంటే, దానిని అధికారికంగా ప్రకటించండి. అంతేగానీ అరెస్టులు, నిర్బంధాలతో అణచివేయాలని చూడకండి. నాటి ఎమర్జెన్సీ సమయంలో కూడా పరిస్థితులు ఇంత దారుణంగా లేవు. ఉద్యమాలు చేయడం తప్పా? కేంద్రం దృష్టి సారించాల్సిన సమస్యలు, అంశాలు దేశంలో ఎన్నో ఉన్నాయి. సర్ ప్రక్రియను అన్ని రాష్ట్రాల్లో చాలా పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. అవన్నీ వదిలేసి సీజేపీ ఆందోళనలపై మాత్రమే కేంద్రం దృష్టిపెట్టింది. సీజేపీ ఒక స్వతంత్ర ఉద్యమ సమూహం. అలాగని మేము ఇండియా కూటమికి వ్యతిరేకం కాదు. రెండూ ఒకే లక్ష్యం కోసం పని చేస్తున్నాయి” అని అభిజీత్ పేర్కొన్నారు.

**ఇండియా బ్లాక్ నేతలపై ఎఫ్ఐఆర్‌లు నమోదు..**

దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సోమవారం నిషేధాజ్ఞలను ఉల్లంఘించారనే ఆరోపణలతో ఇండియా కూటమి నేతలపై పోలీసులు నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. మరోవైపు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్న ఖాతాలపైనా కేసులు నమోదయ్యాయి. దిల్లీలో ఆందోళనలకు సంబంధించి అభ్యంతరకరమైన, తప్పుదోవ పట్టించే సుమారు 500 పోస్టులను తొలగించాలని అధికారులు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లకు విజ్ఞప్తి చేశారు.

## జ్ఞానేష్‌పై ప్రతిపక్షాల పిటిషన్..

న్యూఢిల్లీ(జనంసాక్షి):సీఈసీ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతోపాటు ఇండియా బ్లాక్‌కు చెందిన 11 పార్టీలు కలిసి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌కు సుప్రీంకోర్టు రిజిష్టర్ చేసి, విచారణకు స్వీకరించింది. దీని ప్రకారం అక్టోబర్ 26న కేసు విచారణకు వచ్చే అవకాశం ఉంది.సుప్రీంకోర్టు నిబంధనలకు అనుగుణంగా ఈ పిటిషన్‌కు ఒక రిట్ నెంబర్ రావడంతో, వరుస ప్రకారం విచారణ మొదలవుతుంది. ఈ పిటిషన్‌ను మొదట రాహుల్ గాంధీ, ఆ తర్వాత మరో 11 పార్టీలు కలిసి దాఖలు చేశాయి. ఆ తర్వాత టి.తిరుమవలవన్, సజ్జాద్ అహ్మద్ కిచ్లూ కలిసి పిటిషన్లో చేరారు. దీంతో ఈ పిటిషన్ దాఖలు చేసిన వారి సంఖ్య 13కు చేరింది. భారీ స్థాయిలో ఓట్ల తొలగింపు, సర్‌లో అవకతవకలు, సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా వంటి అంశాలతో ఈ పిటిషన్ దాఖలైంది.అయితే, ఈ పిటిషన్‌లో 14 తప్పులు ఉన్నట్లు సుప్రీంకోర్టు రిజిస్ట్రీ తెలిపింది. దీంతో పిటిషనర్లకు సంబంధించి తగిన ధృవపత్రాలు సమర్పించాలని సంబంధిత న్యాయవాదికి సూచించింది. తగిన కోర్టు ఫీజు (రూ.220) కూడా చెల్లించలేదని తెలిపింది. అనంతరం వీటిని సరిదిద్దడంతో సుప్రీంకోర్టు కేసు రిజిష్టర్ చేసినట్లు తెలుస్తోంది.



## పసుపు రైతులను ఆదుకోండి

**కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి**

నిజామాబాదు జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసి జాతీయ పసుపు బోర్డు కార్యకలాపాలను వివరించారు. ఈ సందర్భంగా పసుపు రైతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.పసుపు రైతులకు న్యాయం జరిగేలా, వారి సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపేలా కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని పల్లె గంగారెడ్డి కోరారు. పసుపు రైతుల సంక్షేమం, వారి ఆర్థిక అభివృద్ధి, పసుపు పంటకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. జాతీయ పసుపు బోర్డు ద్వారా రైతులకు మరింత ప్రయోజనం చేకూరేలా చేపడుతున్న కార్యక్రమాలను వివరించడంతో పాటు, క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రైతుల సమస్యల పరిష్కారానికి చేసిన విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో కిసాన్ సంఘ్ అధ్యక్షులు సాయిరెడ్డి తో పాటు పలువురు అధికార ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి..

**ఇద్దరు యువకుల మృతి**

కథలాపూర్(జనంసాక్షి):అమలాపురం మండలంలోని చింతగుంట గ్రామానికి వచ్చిన ఉపాధి నిమిత్తం కూలి పనుల కోసం వినుకొండ గ్రామం పల్నాడు జిల్లా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వినుకొండ ఆనంద్ బాబు బ/నీ ఏసోబు, వయస్సు:22 మరియు కొత్తజాన్ గమినేలు తండ్రి జాన్ ప్రకాష్ రావు వయసు:19 సంవత్సరాలు ఉన్న ఇద్దరు యువకులు గత వారం రోజుల క్రితం కథలాపూర్ మండలంలోని చింతకుంట గ్రామానికి వచ్చి దేవండ్ల విష్ణు అనే మేస్త్రి వద్ద, చింతకుంట గ్రామంలోని నివాసం ఉంటూ కూలి పనులు చేసుకుంటూ ఉన్నారు మంగళవారం చింతకుంట గ్రామంలోనే కూలీ పనులు ముగించుకున్న తర్వాత రాత్రి సమయంలో మద్యం తాగడం నిమిత్తమై ఇద్దరు యువకులు బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని వారి కోసం వెతుకుతున్న క్రమంలో బుధవారం చింతకుంట గ్రామ శివారులో ఉన్న బైర రాములు యొక్క వ్యవసాయ బావిలో మద్యం మత్తులో వ్యవసాయబావిలో పడి వారు చనిపోయి ఉన్నారని మేస్త్రి దేవాన్ల విష్ణు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కథలాపూర్ ఎస్.ఐ సిహెచ్.రవి కిరణ్ తెలియజేసారు.



## విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



- **అచ్చంపేట అభివృద్ధికి రూ.128 కోట్లతో విద్యుత్ పనులు**
- **విద్యుత్ సమస్యల పరిష్కారానికి 1912, పవర్ అంబులెన్స్ సేవలు**
- **అచ్చంపేటలో విద్యుత్ ఉద్యోగుల సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి**

**హైదరాబాద్(జనంసాక్షి):** విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. విద్యుత్ శాఖలో పనిచేసే ఉద్యోగి నుంచి సీఎండీ వరకు ప్రతి ఒక్కరినీ ఒక కుటుంబ సభ్యుడిగా భావిస్తూ ప్రభుత్వం వారి సంక్షేమం కోసం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు దేశంలోనే తొలిసారిగా విద్యుత్ శాఖ ఉద్యోగులందరికీ రూ.కోటి ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించినట్లు వెల్లడించారు. బుధవారం అచ్చంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విద్యుత్ ఉద్యోగుల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు.??ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ అచ్చంపేట నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందని తెలిపారు. ఇప్పటికే సుమారు రూ.78 కోట్ల విలువైన పనులు చేపట్టామని, తాజాగా మరో రూ.75 కోట్ల విలువైన పనులకు అనుమతులు మంజూరు చేశామని చెప్పారు. విద్యుత్ శాఖ పరిధిలోనే సుమారు రూ.128 కోట్ల విలువైన అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వివరించారు. విద్య, వైద్యం, రహదారులు, వసతి గృహాలు, వ్యవసాయం, సంక్షేమ రంగాల్లోనూ వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.??ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ప్రజల అవసరాలను గుర్తించి, ఆయా శాఖల మంత్రులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని ప్రశంసించారు. నియోజకవర్గంలో మరో పెద్ద సబ్‌స్టేషన్‌తోపాటు 132/33 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనపై సంబంధిత అధికారులను పరిశీలన చేయాలని ఆదేశించినట్లు వెల్లడించారు. అధికారుల నివేదిక ఆధారంగా అవసరాన్ని పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.??విద్యుత్ ఉద్యోగులకు కోటి రూపాయల ప్రమాద బీమా??విద్యుత్ ఉద్యోగుల సంక్షేమం విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని భట్టి విక్రమార్క తెలిపారు. విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న సమయంలో రోడ్డు ప్రమాదంలో మరణించిన ఓ లైన్‌మన్ కుటుంబానికి కోటి రూపాయల బీమా పరిహారం అందించిన విషయాన్ని గుర్తుచేశారు. గతంలో ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు కుటుంబాలకు పరిమిత స్థాయిలోనే ఆర్థిక సహాయం అందేదని, ఉద్యోగి మరణిస్తే ఆ కుటుంబం వీధిన పడకూడదనే ఉద్దేశంతో కోటి రూపాయల ప్రమాద బీమా సదుపాయాన్ని ప్రవేశపెట్టామని వివరించారు.

**ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి**

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందని కుటుంబం లేదని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గత మూడేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.1,64,431 కోట్లను నేరుగా ప్రజల ఖాతాల్లోకి జమ చేశామని వెల్లడించారు. ఈ లెక్కలపై ఎవరితోనైనా చర్చించేందుకు, ఎలాంటి సవాల్‌నైనా స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రతి రూపాయిని వారి అభివృద్ధి, సంక్షేమం కోసమే ప్రణాళికాబద్ధంగా ఖర్చు చేస్తున్నామని తెలిపారు.అచ్చంపేట నియోజకవర్గంలో 74.82 కోట్ల వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మన్ననూరులో 220/33 కెవి సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేసిన అనంతరం పక్కనే ఏర్పాటుచేసిన బహిరంగ సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా రహదారుల నిర్మాణానికి రూ.90 వేల కోట్లు కేటాయించామని, జిల్లాల్లో అందుబాటులో ఉన్న సహజ వనరులు, నదులు, ఖనిజ సంపద, మానవ వనరుల ఆధారంగా ప్రత్యేక అభివృద్ధి ప్రణాళికలు రూపొందించి ముందుకు సాగుతామని చెప్పారు. అచ్చంపేట ప్రాంతాన్ని ప్రధాన రవాణా కూడలిగా అభివృద్ధి చేయడంతోపాటు, పర్యాటక రంగం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని వెల్లడించారు.




# రూ.10 లక్షల అగ్రిమెంట్లు రద్దు!




## జనంసాక్షి ఎఫెక్ట్.. విజిలెన్స్ అధికారుల విచారణ

### వివాదాస్పద ఎలక్ట్రికల్ లైసెన్స్‌పై తదుపరి అగ్రిమెంట్ల నిలిపివేత

**నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 14 (జనం సాక్షి):**
మిర్యాలగూడ విద్యుత్ శాఖ పరిధిలో ఎలక్ట్రికల్ కాంట్రాక్టు పనుల అగ్రిమెంట్ల వ్యవహారం కీలక మలుపు తిరిగింది. ప్రభుత్వ ఉద్యోగంలో ఉంటూనే ఎలక్ట్రికల్ కాంట్రాక్టు పనులు పొందారంటూ జనం సాక్షిలో వచ్చిన కథనం నేపథ్యంలో, సంబంధిత లైసెన్స్‌పై రూ.10 లక్షల విలువైన అగ్రిమెంట్లు రద్దు చేసినట్లు సమాచారం. వివాదాస్పద లైసెన్స్‌కు సంబంధించి తదుపరి అగ్రిమెంట్ల ప్రక్రియను నిలిపివేసినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం. ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన తర్వాత కూడా ఎలక్ట్రికల్ లైసెన్స్ కొనసాగించడం, ఆ లైసెన్స్ ఆధారంగా టెండర్లలో పాల్గొనడం, అగ్రిమెంట్లు పొందడం వంటి అంశాలపై ఫిర్యాదులు రావడంతో సంబంధిత అధికారులు రికార్డుల పరిశీలనకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది.

**రూ.10 లక్షల అగ్రిమెంట్ల రద్దు.. లైసెన్స్‌పై చర్యలు**
ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, సంబంధిత వెండర్‌కు మిర్యాలగూడ రూరల్, టౌన్ సబ్‌డివిజన్ల పరిధిలో పనులకు సంబంధించిన అగ్రిమెంట్లు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీటిలో రూ.10 లక్షల విలువైన అగ్రిమెంట్లను రద్దు చేసినట్లు సమాచారం.

అయితే రద్దుకు సంబంధించిన అధికారి క ఉత్తర్వులు, వాటి వెనుక ఉన్న కారణాలను సంబంధిత శాఖ అధికారికం గా వెల్లడించాల్సి ఉంది. వివాదంలో ఉన్న లైసెన్స్‌పై కొత్త అగ్రిమెంట్లు ఇవ్వ కుండా నిలిపివేసినట్లు తెలిసింది. లైసెన్స్ జారీ, రెన్యువల్, వెండర్ నమోదు, టెండర్లలో పాల్గొనే అర్హత వంటి అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

**విజిలెన్స్ విచారణలో ఏం తేలనుంది?**
ఈ వ్యవహారంలో లైసెన్స్ వివరాలు, వెండర్ నంబర్లు, ఎస్ఏపీ రికార్డులు, వర్క్ ఆర్డర్లు, అగ్రిమెంట్లు, బిల్లుల చెల్లింపులు, ఫైల్ నోటింగ్స్‌ను పరిశీలించాల్సిన అవసరం ఉందని ఫిర్యాదుదారులు కోరుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్న వ్యక్తి కాంట్రాక్టు పనులు పొందేందుకు అర్హత ఉందా? సంబంధిత నిబంధనలు పాటించారా? అగ్రిమెంట్లను ఏ స్థాయి అధికారి ఆమోదించారు? అనే అంశాలు విచారణలో కీలకం కానున్నాయి.

**జనంసాక్షి ఎఫెక్ట్‌తో కదిలిన యంత్రాంగం**
ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ కాంట్రాక్టు పనులు పొందారన్న ఆరోపణలు, అగ్రిమెంట్ల మంజూరులో నిబంధనల ఉల్లంఘన జరిగిందన్న ఫిర్యాదుల నేపథ్యంలో రూ.10 లక్షల అగ్రిమెంట్ల రద్దు, సంబంధిత లైసెన్స్‌పై తదుపరి అగ్రిమెంట్ల నిలిపివేత, విజిలెన్స్ విచారణ అంశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ వ్యవహారంపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పూర్తి వివరాలను వెల్లడించాల్సి ఉంది. విచారణలో ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వినిపిస్తోంది.

**చర్యలు తీసుకుంటాం : శ్రీనివాస్, ఎస్ఈ నల్లగొండ**



జనం సాక్షిలో వచ్చిన కథనం మేము మరియు విజులెన్స్ వారు విచారణ చేస్తున్నాం.ప్రస్తుతం అగ్రిమెంట్లు రద్దు చేసినం అని లైసెన్సు కూడా రద్దు చేస్తామని రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటాం అని తెలిపారు.

**డీఈ పాత్రపైనా అనుమానాలు**
అగ్రిమెంట్ల మంజూరు వ్యవహారంలో స్థానిక మిర్యాలగూడ డీఈ పాత్రపైనా ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత వివరాలు తెలిసి కూడా అగ్రిమెంట్లు మంజూరు చేశారా? నిర్ణయాలు తీసుకునే క్రమంలో నిబంధనలు పాటించారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే డీఈ పాత్రపై వచ్చిన ఆరోపణలు ఇంకా అధికారికంగా నిర్ధారణ కాలేదు. విచారణలో భాగంగా సంబంధిత ఫైళ్లు, ఆమోద ప్రక్రియ, అధికారుల బాధ్యతలను పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఒకే కుటుంబానికి రెండు లైసెన్సుల వ్యవహారంపైనా విచారణ జరగాలి.

# విశాల్ షాపింగ్ మాల్ ఎదుట రోడ్డుపైనే ఆటోలు, కార్ల పార్కింగ్

- ట్రాఫిక్ ఇబ్బందులతో వాహనదారులు, ప్రజల అవస్థలు
- పండుగ ఆఫర్లపై ఉన్న శ్రద్ధ.. పార్కింగ్ సౌకర్యాలపై ఏదీ?



**కామారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 24 (జనంసాక్షి) :**
పండుగ సీజన్ వచ్చిందంటే చాలు.. ఆకర్షణీయమైన ఆఫర్లు, రంగురంగుల పాంప్లెట్లు, భారీ ప్రకటనలు, కళ్లుచెదిరే లైటింగ్‌లతో వినియోగదారులను ఆకట్టుకునే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి. అయితే కస్టమర్లను ఆకర్షించడంలో చూపుతున్న శ్రద్ధ.. వారికి కనీస సౌకర్యాలు కల్పించడంలో మాత్రం కనిపించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కామారెడ్డిలోని విశాల్ షాపింగ్ మాల్ ఎదుట రోడ్డుపై ఆటోలు, కార్లు ఇష్టానుసారంగా నిలపడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఆఫర్ల హడావుడి.. రోడ్డుపై పార్కింగ్ గందరగోళం!**
పండుగ వేళ వినియోగదారులను ఆకర్షించేందుకు భారీ స్థాయిలో ప్రచారాలు, ప్రకటనలు చేస్తున్న షాపింగ్ మాల్ యాజమాన్యం పార్కింగ్ విషయంలోనూ తగిన శ్రద్ధ చూపాలని ప్రజలు కోరుతున్నారు. మాల్‌కు వచ్చే వాహనా లను రోడ్డుపై నిలపడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోందని, ముఖ్యంగా రద్దీ సమయాల్లో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు.

**ప్రచారానికి పెట్టే ఖర్చులో కొంతైనా సౌకర్యాలపై పెట్టరా?**
కస్టమర్లను ఆకర్షించేందుకు రంగురంగుల పాంప్లెట్లు, భారీ ప్రకటనలు, ఆకర్షణీయమైన లైటింగ్‌లకు ప్రాధాన్యమిస్తున్న వ్యాపార సంస్థలు.. వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా పార్కింగ్ వంటి కనీస సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యతను కూడా గుర్తించాలని ప్రజలు సూచిస్తున్నారు. వ్యాపారాభివృద్ధి ముఖ్యమే అయినప్పటికీ, ప్రజలకు అసౌకర్యం కలిగిస్తూ వ్యాపార కార్యకలాపాలు సాగించడం సమంజసం కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**అధికారులు స్పందించేది ఎప్పుడు?**
రోడ్డుపై అస్తవ్యస్త పార్కింగ్‌తో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి పరిస్థితిని పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. వాహనాల పార్కింగ్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవడం తో పాటు, రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**ప్రశ్న ఒక్కటే.. ఆఫర్లు కస్టమర్ల కోసమేనా? లేక వ్యాపారం కోసమేనా?**
వినియోగదారులను ఆకర్షించడమే కాకుండా, వారికి సౌకర్యవంతమైన షాపింగ్ అనుభవాన్ని కల్పించడం కూడా వ్యాపార సంస్థల బాధ్యత. ఆఫర్లతో ప్రజలను ఆహ్వానించే సంస్థలు.. వారి రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధులను సక్రమంగా వినియోగించాలి

- అభివృద్ధి పనుల పురోగతిని వేగవంతం చేయాలి
- నిధుల ఖర్చుల్లో పారదర్శకత పాటించాలి
- శాఖల వారీగా బడ్జెట్, పనుల అమలుపై సమీక్ష
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 14 (జనంసాక్షి):** ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధులను నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా సక్రమంగా వినియోగించి, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధుల (రాజుాణఖీ) కేటాయింపులు, బడ్జెట్ విడుదల, ఇప్పటివరకు చేసిన ఖర్చులు, వివిధ శాఖల ద్వారా చేపట్టిన పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా కేటాయించిన బడ్జెట్, విడుదలైన నిధులు, వాటి వినియోగం, అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాల స్థితిగతులను పరిశీలించారు. నిధుల వినియోగానికి సంబంధించిన వివరాలను అధికారులు సమర్పించగా, కార్యక్రమాల అమలు తీరుపై సమగ్రంగా చర్చించారు. ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధులతో చేపట్టిన పనులపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, నిధుల ఖర్చుల్లో పారదర్శకత పాటించాలని సమీక్షలో దృష్టి సారించారు. నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో సాధించేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ నిధులు సద్వినియోగమై అర్హులైన వర్గాలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, శిక్షణ కలెక్టర్ రవితేజ, జిల్లా ప్రణాళిక అధికారి రఘునందన్, జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్, మత్స్యశాఖ అధికారి లాయక్ మోయినుద్దీన్, జిల్లా పంచాయతీ అధికారి మురళి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దామోదర్ రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి జ్యోతి, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి వెంకటేష్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పశువుల కొవ్వు, ఎముకలతో కల్తీ నూనె తయారీ

### ముగ్గురిని అరెస్ట్ చేసిన చీతా పోలీసులు



**బోధన్, అక్టోబర్ 14 ( జనంసాక్షి ) :** బోధన్ పట్టణం గాంధీనగర్ ప్రాంతంలో పశువుల కొవ్వు ఎముకలు తోలున ఉపయోగించి కల్తీ నూనెను తయారు చేస్తున్న ముగ్గురిని బుధవారం చీతా పోలీసులు అరెస్ట్ చేశారు. బోధన్ పట్టణంలోని గాంధీనగర్ ప్రాంతంలో ప్రజల ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగిస్తూ, అక్రమంగా పశువుల కొవ్వు, ఎముకలు మరియు తోళ్ళను ఉపయోగించి కల్తీ చేస్తున్నారన్న సమాచారం మేరకు నేడు గాంధీనగర్‌లోని సఫీఉద్దీన్ నివాసంపై చీత ఫోర్స్ మరియు లోకల్ పోలీసులు దాడి చేశారు. అక్కడ పశువుల కొవ్వు, ఎముకలు మరియు తోళ్ళను వేడి చేసి అక్రమంగా నూనె తయారు చేసి అమ్ముతున్నారు. ఈ కల్తీ నూనెను మహారాష్ట్రకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. నూనె తయారు చేస్తున్న నిందితులు: మహమ్మద్ సఫీఉద్దీన్, మహమ్మద్ సోఫిఉద్దీన్ మరియు అబ్దుల్ అన్వర్ లను అదుపులోకి తీసుకొని వారి వద్ద 900 లీటర్ల కల్తీ నూనె స్వాధీనం చేసుకొని వారిపై చట్ట ప్రకారం తగు చర్య తీసుకోనున్నట్లు పోలీసులు వివరించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతూ అక్రమ ఉత్పత్తులు తయారు చేసినా, విక్రయించినా కలిగి ఉన్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని చీతా టీం ఎస్సై శ్రీను రామ్ తదితరులు హెచ్చరించారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ధాన్యం కొనుగోళ్లు సజావుగా చేయాలి
- కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, అక్టోబర్ 14 (జనం సాక్షి);** రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు.ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్,అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, వివిధ శాఖల అధికారులు, పీఏసీఎస్ సెక్రటరీలు, ఐకేపీ, మెప్మా కేంద్రాల నిర్వాహకులు, వ్యవసాయ శాఖ అధికారులు, ట్యాబ్ ఎంట్రీ ఆపరేటర్లతో బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... గ్రేడ్ ఏ రకం ధాన్యం క్వింటాలుకు రూ.2,461, సాధారణ రకానికి రూ.2,441గా మద్దతు ధర ఉందని వెల్లడించారు. బీపీటీ 5204, ఆర్ ఎన్ ఆర్ 15408, హెచ్ ఎం టీ సోన, జై శ్రీరామ్, కే ఎన్ ఎం 1638, కే ఎన్ ఎం 7715, డబ్ల్యూ జీ ఎల్ 44 సన్నవడ్ల రకాలకు ప్రభుత్వం క్వింటాలుకు అదనంగా రూ. 500 ఇస్తుందని తెలిపారు.

జిల్లాలోని అన్ని మండలాల్లో రేపటి నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని సూచించారు. అన్ని కేంద్రాల్లో తప్పనిసరిగా టెంట్లు, తాగునీరు, విద్యుత్ వసతి కల్పించాలని, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తూకం వేసే యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు.రైతులు తమ ధాన్యాన్ని తాలు, తప్ప లేకుండా, తేమ శాతం 17 ఉండేలా చూసుకుని కేంద్రాలకు తరలించాలని సూచించారు. నిబంధనల మేరకు రైతులు తమ ధాన్యాన్ని శుభ్రంగా తీసుకువచ్చి, మద్దతు ధర పొందాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం తూకంలో పారదర్శకంగా ఉండాలని, నిర్దేశించిన విధంగా కొనుగోళ్లు చేయాలని సూచించారు.రైతులకు టోకెన్లు ఇవ్వాలని, దాని ప్రకారం కొనుగోళ్లు చేయాలని సూచించారు.ఈ సారి ధాన్యం తరలించే అన్ని వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్ ఉంటుందని తెలిపారు. దీంతో వాహనాలు ఎక్కడ ఉన్నా తెలుసుకోవచ్చని స్పష్టం చేశారు. యాసంగి సీజన్లో ధాన్యం కొనుగోలు సజావుగా పూర్తి చేసేందుకు సహకరించిన ఆయా శాఖల అధికారులు సిబ్బందికి అభినందనలు తెలియజేశారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఈ సీజన్లో రైతులకు ఉత్తమ సేవలు అందించి,కొనుగోళ్ల ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేయాలని పిలుపు నిచ్చారు.ఇట్టి సమావేశంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, పౌర సరఫరాల శాఖ మేనేజర్ గోపాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, సహకార అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అధ్వాన్నంగా మంథని ప్రభుత్వ పశు వైద్యశాల

- మధ్యాహ్నం ఒంటిగంట వరకే పశు వైద్య సేవలు
- రైతుల పాలిట శాపంగా మారిన వైనం




**మంథని, అక్టోబర్ 14, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని పశు వైద్యశాల పనితీరు అద్వాన్నంగా తయారయింది. మంథని పట్టణం చుట్టు పక్క గ్రామాలకు సేవలందించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ పశు వైద్యశాల అధికారులు, సిబ్బంది అందించే సేవల పట్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. పశు వైద్యశాల సిబ్బంది నిర్వహణ పట్ల ప్రజలు తీవ్ర అసహనం, అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రోగాల బారిన పడి వైద్యం కోసం తీసుకొచ్చిన పశువులకు సిబ్బంది సరైన మందులు లేవని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నట్టు పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువులకు చికిత్సను అందించే పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ప్రజలు కట్టే పన్నులతో వేల జీతాలు తీసుకుంటూ వృత్తి ధర్మాన్ని సరిగ్గా నిర్వర్తించడం లేదని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఆఫీస్ సమయ వేళలు ఉదయం10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుంది. కానీ పశు వైద్యశాల సిబ్బంది ఎలాంటి సమయపాలన పాటించడం లేదని స్పష్టం అవుతుంది. మధ్యాహ్నం 2 గంటల లోపే కార్యాలయానికి తాళాలు వేసుకొని వెళ్లిపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. కనీసం ఆఫీస్ సమయం ముగిసే వరకు సిబ్బంది విధుల్లో ఉండకపోవడం శోచనీయం. ఈ విధమైన పశు వైద్యశాల నిర్వహణ పట్ల పాడి పశువుల రైతులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. పశు వైద్యశాల ఇలాంటి నిర్లక్ష్యపు బాధ్యత రాహిత్య చర్యల పట్ల పశువైద్య శాఖ పై స్థాయి అధికారులు స్పందించి పాడి పశువులకు, జంతువులకు మెరుగైన వైద్య సేవలు అందించే కార్యాచరణ చేయాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.



**పంట వేస్తే నష్టాలు.. వేయకపోతే పస్తులుండాలా?**
సిరికొండ మండలంలోని చిన్న వాల్గోట్, కొండూర్ తదితర గ్రామాల్లో రైతులు ప్రస్తుత వరి కోతలు కొనసాగిస్తూనే రబీ సాగుకు సిద్ధమవుతున్నారు. పలువురు ఇప్పటికే నారు పోయడం ప్రారంభిం చారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు, ట్రాక్టర్ బాడుగల కోసం అప్పులు చేయాల్సి వస్తోంది. పంట చేతి కొచ్చిన తర్వాత గిట్టుబాటు ధర లేకపోవడం, కొనుగోళ్లలో జాప్యం, తరుగు పేరుతో కోతలు రైతులను మరింత కుంగదీస్తున్నాయి. పెట్టుబడులు, అప్పుల వడ్డీలు, కుటుంబ పోషణ, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు.. ఇలా ఎన్నో భారాలను మోస్తున్న రైతులు రెండో పంట సాగు చేయకపోతే ఎనిమిది నెలల పాటు కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నిస్తున్నారు. పొలాలను ఖాళీగా ఉంచితే అప్పులు ఎలా తీర్చాలి? వ్యవసాయంపై ఆధారపడిన కూలీలకు ఉపాధి ఎలా లభిస్తుంది? అని నిలదీస్తున్నారు.

## రెండో పంట వేయొద్దంటున్నారు..

# రైతులు బతికేదెలా?

### పంటలు వేయకపోతే పాలకులు, అధికారులు జీతభత్యాలు వదులుకుంటారా?

- మొక్కజొన్న వేయమన్నారు.. కొనుగోలు కేంద్రాలు పెట్టలేదు
- గిట్టుబాటు ధర లేదు.. కొనుగోలు భరోసా లేదు
- ప్రత్యామ్నాయ పంటలకు మార్కెట్ హామీ ఏదీ?

**సిరికొండ, అక్టోబర్ 14 (జనంసాక్షి):**
ఒకవైపు వరి కోతలు.. మరోవైపు రబీ సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు.. ఇంకోవైపు రెండో పంటగా వరి వేయొద్దంటున్న ప్రభుత్వ సూచనలు.. వెరసి రైతుల్లో ఆందోళన నెలకొంది. వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని వ్యవసాయ అధికారులు చెబుతున్నా, వాటికి గిట్టుబాటు ధర, కొనుగోలు భరోసా కల్పించేదెవరని రైతులు ప్రశ్నిస్తున్నారు. పంట వేస్తే గిట్టుబాటు ధర లేక నష్టాలు.. వేయకపోతే కుటుంబ పోషణ ఎలా? అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న తమకు ప్రత్యామ్నాయ ఆదాయం చూపకుండా రెండో పంట వద్దంటే ఎలా బతకాలని నిలదీస్తున్నారు.

**రైతులు క్రాప్ హాలిడే ప్రకటిస్తే.. జీతాలు వదులుకుంటారా?**
రెండో పంట వేయవద్దని సూచిస్తున్న పాలకులు, అధికారులు రైతుల జీవనోపాధికి భరోసా కల్పించాల్సిన బాధ్యత లేదా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. రైతులు క్రాప్ హాలిడే ప్రకటిస్తే ముఖ్యమంత్రి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు వరకు తమ జీతభత్యాలు వదులుకుని రైతు కుటుంబాల ఖర్చులకు ఆ మొత్తాన్ని అందిస్తారా? అని నిలదీస్తున్నారు.

రైతులు పంటలు పండిస్తేనే ప్రజలకు ఆహారం అందుతుందని, వ్యవసాయ కూలీలకు ఉపాధి లభిస్తుందని గుర్తుచేస్తున్నారు. వ్యవసాయాన్ని వదిలేయాలని చెప్పడం కంటే, రైతులు నష్టపోకుండా సాగు చేసుకునే పరిస్థితులు కల్పించాలని కోరుతున్నారు. ప్రత్యామ్నాయ పంటలతో ఆదాయం ఎలా వస్తుందో, వాటిని ఎవరు కొనుగోలు చేస్తారో ప్రభుత్వం ముందుగానే స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**మొక్కజొన్న వేయమన్నారు.. కొనుగోలు కేంద్రాలేవి?**
ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న సాగు చేయాలని అధికారులు సూచించడంతో పంట వేసిన రైతులు, దిగుబడి చేతికొచ్చాక విక్రయాల కోసం ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




సకాలంలో కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో కొందరు రైతులు దళారులకు తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోయారని చెబుతున్నారు. సాగుకు ముందు ప్రత్యామ్నాయ పంటలు వేయాలని సూచించే అధికారులు, పంట చేతికొచ్చిన తర్వాత కొనుగోలు సౌకర్యాలు కల్పించే బాధ్యతను కూడా తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. మొక్కజొన్న సాగుతో ఎదురైన అనుభవాలు కళ్లముందే ఉండగా, ఇప్పుడు వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని చెబితే ఎలా నమ్మాలని ప్రశ్నిస్తున్నారు.

వరి వేయొద్దంటారు.. మొక్కజొన్న వేయమంటారు.. తీరా పంట చేతికొస్తే కొనుగోలు కేంద్రాలు ఉండవు.. చివరకు దళారులకే తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుంది.. మరి ఏ పంట వేయాలి? ఎవరిని నమ్మాలి? అని రైతులు నిలదీస్తున్నారు. ప్రత్యామ్నాయ పంటలకు మార్కెట్ సిద్ధం చేయడంతోపాటు, గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తామనే స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరుతున్నారు.

**సూచనలు సరే.. ఆచరణలో భరోసా ఏది?**
ఆరుతడి పంటల సాగుపై అవగాహన కల్పించడం మాత్రమే సరిపోదని, వాటికి అవసరమైన విత్తనాలు, సాగు సలహాలు, మార్కెట్ సౌకర్యం, గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు అంటున్నారు. పంట మార్పిడి రైతులకు లాభదాయకంగా మారేలా కార్యాచరణ రూపొందించాలని కోరుతున్నారు. రైతుల సమస్యలపై ప్రశ్నిస్తే ఉన్నతాధికారులకు నివేదికలు పంపించామని చెబుతున్నారని, నివేదికలు పంపడంతోనే బాధ్యత పూర్తవుతుందా అని నిలదీస్తున్నారు. క్షేత్రస్థాయిలో రైతుల ఇబ్బందులను గుర్తించి, పరిష్కార మార్గాలను చూపించాల్సిన అవసరం లేదా అని ప్రశ్నిస్తున్నారు. రైతుల సమస్యలను కాగితాలకే పరిమితం చేయకుండా ఆచరణలో పరిష్కరించాలని కోరుతున్నారు.

**నష్టపోతే ఆదుకునే భరోసా ఏది?**
రెండో పంట సాగు చేయవద్దని సూచిస్తున్న ప్రభుత్వం, పంటలు వేయకపోతే రైతులకు కలిగే ఆర్థిక నష్టాన్ని ఎలా భర్తీ చేస్తుందో స్పష్టం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించడంలో ఎదురైన సమస్యలను పరిష్కరించకుండా, ఇప్పుడు సాగు వద్దని ఏ ప్రాతిపదికన చెబుతున్నారని ప్రశ్నిస్తున్నారు.

ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల సాగుపై సూచనలు చేయడం అవసరమే అయినప్పటికీ, రైతుల జీవనోపాధికి భరోసా కల్పించడం కూడా అంతే ముఖ్యమని అభిప్రాయపడుతున్నారు. సాగు చేయని సమయంలో రైతు కుటుంబాలకు ఆదాయం ఎలా సమకూరుతుంది? ప్రత్యామ్నాయ పంటలు నష్టాలపాలైతే ఎవరు ఆదుకుంటారు? అనే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరుతున్నారు.

వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతులకు ప్రతి సీజన్ సవాలుగా మారుతోందని, పెట్టుబడులు పెట్టి పంట పండించినా సరైన ధర లభించక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండో పంట వద్దని చెప్పే ముందు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు చూపించాలని, ఆరుతడి పంటలకు మార్కెట్, కొనుగోలు భరోసా కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

పంట వేస్తే గిట్టుబాటు ధర లేదు.. అమ్ముకోవాలంటే కొనుగోలు భరోసా లేదు.. పంట వేయవద్దంటే జీవనాధారం లేదు.. మరి రైతు బతికేదెలా? అన్నదే ఇప్పుడు రైతుల ప్రధాన ప్రశ్న. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి, రైతులు నష్టాల బారిన పడకుండా చూడటమే ప్రభుత్వ బాధ్యతని వారు స్పష్టం చేస్తున్నారు.

# డీఎంహెచ్ఓ ఆ ఉద్యోగాలను అమ్మేశారా..?



## నోటిఫికేషన్ లేకుండానే ఉద్యోగాల భర్తీ చేసిన వైనం

- ఒక్కో పోస్టుకు రూ.2-4 లక్షల వసూళ్ల ఆరోపణలు
- ఆరు పోస్టులు.. అనేక అనుమానాలు

**నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 14 (జనంసాక్షి):** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ (డీఎంహెచ్ఓ) కార్యాలయంలో ఉద్యోగ నియామకాల వ్యవహారం తీవ్ర చర్చకు దారితీస్తోంది. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) పరిధిలోని జాతీయ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమం (ఎన్‌టీఈపీ)లో నాలుగు ల్యాబ్ టెక్నీషియన్ (ఎల్‌టీ), రెండు సీనియర్ ట్రీట్‌మెంట్ ల్యాబొరేటరీ సూపర్‌వైజర్ (ఎస్‌టీఎల్ఎస్) పోస్టుల భర్తీపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిరుద్యోగులకు బహిరంగంగా అవకాశం కల్పించారా? నోటిఫికేషన్ విడుదల చేశారా? మెరిట్, రోస్టర్, రిజర్వేషన్ల ప్రకారం ఎంపిక జరిగిందా? లేక తెరవెనుక వ్యవహారాలు నడిచాయా? అనే ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

### ఒక్కో పోస్టుకు రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు..

ఉద్యోగ నియామకాల పేరుతో ఒక్కో పోస్టుకు రూ. 2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు వసూలు చేశారంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పనిచేసే ఓ ఉద్యోగి, స్థానికంగా 'షాడో డీఎంహెచ్ఓ'గా పేరుపొందిన వ్యక్తి పాత్రపై కూడా ఆరోపణలు ప్రచారంలో ఉన్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించిన ఆధారాలు, సంబంధిత వ్యక్తుల వివరణ, అధికారిక విచారణ ఫలితాలు ఇంకా నిర్ధారించాల్సి ఉంది. నిరుద్యోగుల భవిష్యత్తుతో ముడిపడిన ప్రభుత్వ ఆరోగ్యశాఖ నియామకాల విషయంలో ఇలాంటి ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోంది. ఉద్యోగం కోసం ఏళ్ల తరబడి చదివి, అర్హతలు సంపాదించి ఎదురుచూస్తున్న అభ్యర్థులకు న్యాయంగా అవకాశం కల్పించారా? ఎంపిక ప్రక్రియలో పారదర్శకత పాటించారా? అన్నది అధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.

### ఆగస్టు 7న ఫిర్యాదు.. డీఎంహెచ్ఓకు సంజాయిషీ

ఈ నియామకాల వ్యవహారంపై ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగ అభ్యర్థులు 07-08-2026న హైదరాబాద్‌లోని కుటుంబ సంక్షేమ శాఖ ఉన్నతాధికారికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఫిర్యాదులో




నియామకాలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ, సంబంధిత ఉద్యోగుల వ్యవహారంపై విచారణ జరపాల ని కోరినట్లు తెలుస్తోంది. ఈ ఫిర్యాదు నేపథ్యంలో నల్లగొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని సంజాయిషీ కోరుతూ కుటుంబ సంక్షేమ శాఖ కార్యాలయం నుంచి లేఖ పంపినట్లు సమాచారం. అయితే ఆ లేఖలోని పూర్తి వివరాలు, అందులో ప్రస్తావించిన అంశాలు, అధికారుల సమాధానం వంటి విషయాలు అధికారికంగా ధృవీకరి ంచాల్సి ఉంది. ఒకవేళ ఉన్నతాధికారులు సంజాయిషీ కోరినట్ల యితే, ఈ వ్యవహారంపై శాఖాపరమైన పరిశీలన జరుగుతోందా? ఫిర్యాదులోని అంశాలపై ఏ చర్యలు తీసుకున్నారు? విచారణ ఎక్కడి వరకు వచ్చింది? అనే వివరాలను వెల్లడించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది.



### నోటిఫికేషన్ ఎక్కడ, మెరిట్ జాబితా ఏది?

ఆరు పోస్టుల భర్తీకి సంబంధించి నిరుద్యోగులు పలు కీలక ప్రశ్నలు సంధిస్తున్నారు. - నాలుగు ల్యాబ్ టెక్నీషియన్, రెండు ఎస్‌టీఎల్ఎస్ పోస్టులకు బహిరంగ నోటిఫికేషన్ విడుదల చేశారా? - దరఖాస్తులు ఎప్పుడు, ఎక్కడ స్వీకరించారు, - అభ్యర్థుల విద్యార్హతలు, అనుభవాన్ని ఏ ప్రాతిపదికన పరిశీలించారు, ఎంపిక కమిటీని ఏర్పాటు చేశారా, మెరిట్ జాబితా, ఎంపికైన అభ్యర్థుల వివరాలను బహిరంగపరిచారా, నియామకాలకు సంబంధించిన అనుమతులు, నియామక ఉత్తర్వులు ఉన్నాయా, రోస్టర్, రిజర్వేషన్ల నిబంధనలను ఎలా అమలు చేశారు. ఈ ప్రశ్నలకు రికార్డుల ఆధారంగా సమాధానాలు వస్తేనే నియామక ప్రక్రియపై నెలకొన్న అనుమానాలకు తెరపడే అవకాశం ఉంది.

### డిప్యుటేషన్లు, విధుల కేటాయింపుపైనా పరిశీలన అవసరమేనా?

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సిబ్బంది డిప్యుటేషన్లు, విధుల కేటాయింపులపైనా విమర్శలు వినిపిస్తున్నాయి. ఎవరు ఏ ఉత్తర్వుల ఆధారంగా విధులు నిర్వహిస్తున్నారు? సిబ్బందికి బాధ్యతలు ఎలా కేటాయించారు? సంబంధిత నిబంధనలు పాటించారా? అనే అంశాలను కూడా ఉన్నతాధికారులు పరిశీలించాలనే డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. అయితే డిప్యుటేషన్లలో నిబంధనల ఉల్లంఘన జరిగిందా లేదా అన్నది సంబంధిత ఉత్తర్వులు, అధికారిక రికార్డుల పరిశీలనతోనే తేలాల్సి ఉంది.

### ఉన్నతస్థాయి విచారణతోనే వాస్తవాలు వెలుగులోకి..

ఆరు పోస్టుల భర్తీపై వస్తున్న ఆరోపణలను అధికారులు తేలిగ్గా తీసుకోకుండా సమగ్రంగా పరిశీలించాలనే డిమాండ్ వినిపిస్తోంది. నియామక ప్రకటనల నుంచి ఎంపిక జాబితా వరకు ప్రతి దశకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేయాలని, ఆరోపణల్లో వాస్తవం ఉన్నట్లయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని నిరుద్యోగులు కోరుతున్నారు. నల్లగొండ డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఆరు పోస్టుల భర్తీపై నెలకొన్న ఈ వివాదానికి అధికారిక విచారణ ఎప్పుడు తెరదించనుంది నిరుద్యోగుల ఫిర్యాదుపై శాఖ ఎలాంటి చర్యలు తీసుకోనుంది అన్నది వేచి చూడాలి.

# ఆపదలో పేదలకు భరోసా సీఎంఆర్ఎఫ్

## లబ్ధిదారులకు రూ.31.08 లక్షల ఆర్థిక సాయం

**గంగాధర అక్టోబర్ 14 (జనంసాక్షి) :** అనారోగ్యంతో బాధపడుతూ, ప్రమాదాల్లో గాయపడి ఆసుపత్రు



ల్లో చికిత్స పొందుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆపదలో భరోసా కల్పిస్తోందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రజాకార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 111 మంది లబ్ధిదారులకు రూ.31,08,700 సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగపడుతోందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో పంపిణీ చేసిన సీఎంఆర్ఎఫ్ చెక్కుల కంటే రెట్టింపు చెక్కులను కేవలం మూడేళ్లలోనే పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందించి తమను ఆదుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్‌తో పాటు వేముల భాస్కర్, రేండ్ల శ్రీనివాస్, చిందం ఆంజనేయులు, బిర్ల ఆనందం, రాచమల్ల రవి, బాసవేణి శ్రీనివాస్, దాసరి శంకరయ్య, ఈటవేణి శ్రీనివాస్, పడాల భాగ్యలక్ష్మి రాజన్న, దానే అనసూయ ఓదెలు, కడారి రేణుక కనకయ్య, సంధ్య చంద్రారెడ్డి, కవిత మల్లేశం, బాబా లక్ష్మి మధు, పురుమల్ల మనోహర్, సాగి అజయ్ రావు, చిరుతమంగ, తోట సంధ్య తదితరులు పాల్గొన్నారు.ం

# జగిత్యాల అదనపు కలెక్టర్‌గా ఎన్. ప్రసూనాంబ బాధ్యతల స్వీకరణ



**జగిత్యాల జిల్లా క్రైమ్, అక్టోబర్ 14 (జనంసాక్షి):** జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా ఎన్. ప్రసూనాంబ బుధవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆమెను ఈ పదవిలో నియమించారు. గతంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) కార్యాలయంలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహించిన ఆమె, అక్కడి నుంచి బదిలీపై జగిత్యాల అదనపు కలెక్టర్‌గా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి కే.వై. ప్రసాద్, కలెక్టరేట్ ఏవో కిషన్, సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఓటర్ల నమోదుకు ప్రత్యేక శిబిరాలు

## అక్టోబర్ 15, 16 తేదీల్లో నిర్వహణ : జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, అక్టోబర్ 14 (జనం సాక్షి);** రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో అక్టోబర్ నెల 15.10.2026 (గురువారం), 16.10.2026 (శుక్రవారం) ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వెల్లడించారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు లేని వారు (అంటే జాబితాలో చేరని వారు) మొదటిసారి ఓటర్లుగా నమోదు చేసుకోవాలనుకునే యువకులు ఈ నిర్దేశిత కేంద్రాలను సందర్శించి, ఓటర్ల జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవడానికి 'ఫారం-6' ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పైన పేర్కొన్న రోజుల్లో సంబంధిత బీఎల్ఓలు, బీఎల్ఏలు ఆయా నిర్దేశిత కేంద్రాలలో అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఈ నెల 15.10.2026 (గురువారం), 16.10.2026 (శుక్రవారం) ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు.

# ఆడబిడ్డల ఆత్మగౌరవం, సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

- కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు
- మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన కలెక్టర్ సత్యప్రసాద్



**జగిత్యాల జిల్లా క్రైమ్, అక్టోబర్ 14 (జనంసాక్షి):** బతుకమ్మ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. బతుకమ్మ సంబరాల్లో భాగంగా బుధవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రకృతి ప్రసాదించిన తంగేడు, గునుగు, బంతి తదితర రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి మహిళలు ఆటపాటలతో సంబరాలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. మహిళలు సమిష్టిగా బతుకమ్మ ఆడటం సామాజిక ఐక్యతను బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. తొమ్మిది రోజుల పాటు వివిధ పేర్లతో బతుకమ్మ పండుగను నిర్వహిస్తారని, ఐదో రోజు అట్ల బతుకమ్మ సందర్భంగా మహిళలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారని తెలిపారు. జిల్లా ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. బతుకమ్మ నిమజ్జనం సందర్భంగా చెరువులు, కుంటలు, వాగుల వద్ద మహిళలు జాగ్రత్తలు పాటించా లని కలెక్టర్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా నిమజ్జన ఏర్పాట్లు చేపట్టామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం మహిళా అధికారులు, సిబ్బందితో కలిసి కలెక్టర్ బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవె న్యూ) ఎన్. ప్రసూనాంబ, డీడబ్ల్యూఓ భాస్కర్, మహిళా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# రక్షణ శాఖ భూములకు సంయుక్త సర్వే



**హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 14 (జనం సాక్షి) :** హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని 185 ఎకరాల రక్షణ శాఖ భూము లకు ఈ నెల 22 నుంచి మూడు రోజులపాటు రెవెన్యూ, రక్షణ శాఖ అధికారులు సంయుక్త సర్వే నిర్వహిం చాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా సూచించారు. బుధవారం అదనపు కలెక్టర్ కదిరవన్ పలని, బ్రిగేడియర్ చట్టియార్‌లతో కలిసి భూములపై సమీక్ష నిర్వహించారు. భూముల హద్దులు, రికార్డుల్లో వ్యత్యాసాలు, వివాదాలను పరిశీలించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ప్యారడైజ్ జంక్షన్-డెయిరీ ఫార్మ్ ఎక్స్ రోడ్ ఎలి వేటెడ్ కారిడార్, ప్యారడైజ్-శామీర్‌పేట్ ఓఆర్ఆర్ జంక్షన్ రాజీవ్ రహదారి అభివృద్ధి పనులకు అవసరమైన భూసేకరణపైనా చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ కె. నారాయణ, ఆర్డీఓలు రామకృష్ణ, సాయిరాం, ప్రత్యేక ఉప కలెక్టర్లు అపర్ణ(భూసేకరణ), రవి(భూ పరిరక్షణ), జిల్లా సర్వే అధికారి వెంకట రెడ్డి, కల్నల్ విజు, లెఫ్టినెంట్ కల్నల్స్ త్రిపాఠి, అహ్మద్, ఎస్‌డీఓ వెంకన్న, తహసీల్దార్లు పాల్గొన్నారు.

# బంట్వారం మండలంలో.. ఫోక్సో కేసు నమోదు

## వెల్లడించిన వికారాబాద్ డీఎస్పీ అంజయ్య

**బంట్వారం, అక్టోబర్ 14(జనం సాక్షి) :** బంట్వారం మండలం నాగవరం గ్రామ పంచాయితీ పరిధిలో మైనర్ బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు బంటారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఫోక్సో కేసు నమోదు చేసినట్లు వికారాబాద్ డిఎస్ పి అంజయ్య తెలిపారు. మంగళవారం ఆయన బంటారం పోలీస్ స్టేషన్ లో మీడియాతో మాట్లాడుతు పక్క గ్రామానికి చెందిన యువకుడు మాయ మాటలు చెప్పి మైనర్ బాలిక పట్ల అత్యాచార యత్నానికి పాల్పడినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలపగా విచారణ జరిపి సంబందిత యువకుడిని అదుపు లోకి తీసుకుని ఫోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సంబందిత యువకుడిని రిమాండ్కు తరలించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ పుండీక్ పాల్గొన్నారు.

# పోక్సో కేసు నేపథ్యంలో యువకుడి ఆత్మహత్య

**రంగారెడ్డి, అక్టోబర్ 14 (జనంసాక్షి):** మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసు నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అక్క ఇంటికి వచ్చిన అతడు బుధవారం తెల్లవారు జామున ఉరివేసుకుని మృతి చెందాడు. ఆదిభట్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కయాంజల్ రాఘవేంద్ర నగర్ కాలనీకి చెందిన రామిడి హర్షవర్ధన్ రెడ్డి (31)పై మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన హర్షవర్ధన్ రెడ్డి అక్టోబర్ 13న రాత్రి సుమారు 10 గంటలకు తన అక్క దీపిక ఇంటికి వెళ్లాడు. అక్టోబర్ 14న తెల్లవారుజామున 5 గంటల సమయంలో బావ మాధవరెడ్డి నిద్రలేచి చూడగా హర్షవర్ధన్ పక్కన కనిపించలేదు. ఇంట్లో వెతకగా మరో గదిలో ఉరివేసుకుని కనిపించాడు. కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా, సిబ్బంది పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తన సోదరుడిపై నమోదైన కేసు కారణంగా అతడు మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని, మృతిపై తమకు ఎలాంటి అనుమానాలు లేవని దీపిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అబ్కారీ కాదది... అక్రమాల 'మామూళ్ల' శాఖ

- బెల్టు షాపు ముట్టుకుంటే తాటతీస్తా అన్నట్లుగా సీఐ వార్నింగ్
- ప్రతినెల వైన్ షాపుల నజరానాలు.. గురకపెట్టి నిద్రపోతున్న ఉన్నతాధికారులు
- ఎక్సైజ్ సూపరింటెండెంట్ ముందే దండకం





**మహబూబ్ నగర్ బ్యూరో, అక్టోబర్ 14(జనంసాక్షి) :** ప్రజల ఆరోగ్యాన్ని, శాంతిభద్రతలను కాపాడేందుకు మద్యం విక్రయాలను నియంత్రించాల్సిన ఎక్సైజ్ శాఖ (మద్య నియంత్రణ శాఖ), మహబూబ్ నగర్ లో మాత్రం రూటు మార్చింది. 'మద్య నియంత్రణ'ను పక్కనబెట్టి, కాసులు కురిపించే 'మద్య ప్రోత్సాహక' శాఖగా రూపాంతరం చెందిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్సైజ్ సీఐ వెంకటేష్ అవినీతి భాగోతం, నిర్లక్ష్య వైఖరి కారణంగా మొత్తం అబ్కారీ శాఖ తీవ్ర ప్రశ్నార్థకంలో పడింది.

ఇటీవల మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని బండమీదపల్లి సమీపంలో, పాలమూరు యూనివర్సిటీ వద్ద నిత్యం బెల్ట్ షాపుల కారణంగా తాగుబోతుల వేధింపులు ఎక్కువయ్యాయి. విద్యార్థులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో బండమీదపల్లి గ్రామస్తులు, బాధితులు ఏకమై జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చి బెల్టు షాపులను తొలగించాలని ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో బాధితులు, మీడియా ప్రతినిధులు మరియు ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధాకర్ గారి సమక్షంలోనే సీఐ వెంకటేష్ తన అసలు స్వరూపాన్ని బయటపెట్టారు. "గ్రామాల్లో బెల్టు షాపులను తొలగించడం కుదరదు... బెల్టు షాపుల జోలికి వస్తే మీ అంతు చూస్తా, తాటతీస్తా" అన్నట్లుగా నేరుగా బాధితులకే హెచ్చరికలు జారీ చేయడం తీవ్ర దుమారాన్ని రేపుతోంది. ఒక ఉన్నతాధికారి ముందే సీఐ ఈ స్థాయిలో వ్యాఖ్యలు చేస్తుంటే, కింది స్థాయిలో వీరి దందా ఏ స్థాయిలో సాగుతుందో అర్థం చేసుకోవచ్చని ప్రజలు మండిపడుతున్నారు.

### ప్రభుత్వ జీతం కంటే అక్రమ సంపాదనే మిన్న

ప్రభుత్వం ఇచ్చే వేతనాలు చాలవన్నట్లు, వైన్ షాప్ యాజమాన్యాల నుంచి ప్రతినెల ఎక్సైజ్ కార్యాలయానికి భారీ మొత్తంలో మామూళ్లు ముట్టుతున్నాయనే ప్రచారం జోరుగా సాగుతోంది. గ్రామగ్రామాన, వాడవాడలా అక్రమ బెల్టు షాపులను ప్రోత్సహిస్తూ వైన్ షాపుల యజమానులకు మేలు చేసేందుకే సీఐ వెంకటేష్ ఈ రకంగా వ్యవహరిస్తున్నారని స్పష్టమవుతోంది. "నాకు వైన్ షాప్ యజమానులు ఇచ్చే నజరానాలే ముఖ్యం... ఉన్నతాధికారులైనా, ప్రజలైనా సరే నేను భయపడేది లేదు" అనే ధోరణిలో ఆయన ప్రవర్తిస్తున్నట్లు జిల్లా వ్యాప్తంగా చర్చ నడుస్తోంది.

### మౌనం వహిస్తున్న ఉన్నతాధికారులు

సిఐ వెంకటేష్ ప్రత్యక్షంగా మీడియా, బాధితుల ముందే అంతటి వివాదాస్పద వ్యాఖ్యలు చేసినప్పటికీ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ గానీ, సంబంధిత మంత్రి జూపల్లి గానీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఈ నెలవారీ మామూళ్ల వ్యవహారంలో పైస్థాయి నుంచి కిందిస్థాయి వరకు అందరికీ వాటాలు అందుతున్నాయా? అందుకేనా సీఐ వెంకటేష్ ఇంతలా తెగించి మాట్లాడుతున్నారా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మద్యం యాజమాన్యాలు చెప్పినట్లే ఎక్సైజ్ యంత్రాంగం నడుచుకోవడం చూస్తుంటే మహబూబ్ నగర్ జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా అబ్కారీ శాఖ పరువు గంగలో కలసిపోయిందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సీఐ వెంకటేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమ బెల్టు షాపులను వెంటనే రద్దు చేయాలని పాలమూరు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# వార్తలు రాస్తే.. లాకప్‌లో చిత్రహింసలా?

- జర్నలిస్టులపై 'థర్డ్ డిగ్రీ' ఉపయోగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం
- ఎస్ఐ శ్రీకాంత్‌తోపాటు బాధ్యులను వెంటనే సస్పెండ్ చేయాలి
- స్వతంత్ర విచారణ జరిపి క్రిమినల్, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి
- టీయూడబ్ల్యూజే (ఐజేయూ), కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గాండ్ల శ్రీనివాస్



**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 14 (జనంసాక్షి):** గంభీరావుపేట ఎస్ఐ శ్రీకాంత్ వ్యవహారశైలిపై వరుస కథనాలు ప్రచురించిన 'ఏక్ దమ్ న్యూస్' జర్నలిస్టులు సంపత్, ఎడిటర్ పొత్తూరి శేఖర్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్న ఆరోపణలను టీయూడబ్ల్యూజే (ఐజేయూ) కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గాండ్ల శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చే జర్నలిస్టులపై ప్రతీకార చర్యలకు దిగడం హేయమైన చర్యని పేర్కొన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఎస్ఐపై వరుస కథనాలు ప్రచురించిన నేపథ్యంలో జర్నలిస్టులపై కేసు నమోదైంది. అనంతరం పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారని, పోలీసు వాహనంలోనూ, గంభీరావుపేట, కోనరావుపేట పోలీస్ స్టేషన్లలోనూ బూట్లు, బెల్టులు, లాఠీలతో కొట్టి చిత్రహింసలకు గురిచేశారని ఆరోపించారు. ఫోన్లు తీసుకోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందడంలో ఆలస్యమైందని తెలిపారు. న్యాయమూర్తి ఎదుట హాజరైనప్పుడు తమపై జరిగిన దాడులను జర్నలిస్టులు వివరించారని, వైద్య పరీక్షల అనంతరం విడుదలయ్యారని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ప్రస్తుతం వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. గాండ్ల శ్రీనివాస్ ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. అరెస్టు విధానాలు, కస్టడీలో జరిగిన ఘటనలపై స్వతంత్ర విచారణ జరిపించాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పోలీస్ స్టేషన్ల సీసీ కెమెరాల దృశ్యాలు, వాహనాల ప్రయాణ వివరాలు, స్టేషన్ డైరీలు, వైద్య నివేదికలు సహా అన్ని ఆధారాలను భద్రపరచాలన్నారు. ఎస్ఐ శ్రీకాంత్‌తోపాటు బాధ్యులను సస్పెండ్ చేసి, విచారణ ఆధారంగా క్రిమినల్, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టులపై నమోదైన కేసు ప్రతీకార చర్యలో భాగమా అన్నది పరిశీలించాలని, బాధితులకు రక్షణ కల్పించి వైద్య ఖర్చులను ప్రభుత్వం భరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయకుంటే టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని ఐజేయూ కార్యవర్గ సభ్యులు నగునూరి శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యడ చంద్రశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎలగందుల రవీందర్ హెచ్చరించారు.

# నగర పారిశుధ్యం, మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

రూ.కోటితో కొనుగోలు చేసిన జేసీబీ, లాడర్ యంత్రాలు ప్రారంభం

- డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం
- బయోమైనింగ్ ప్రక్రియతో చెత్త కుప్పల తొలగింపు
- కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 14 (జనంసాక్షి):** నగర పారిశుధ్యాన్ని మెరుగుపరచి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. నగరపాలక సంస్థ నిధులు రూ.కోటితో కొనుగోలు చేసిన జేసీబీ, లాడర్ యంత్రాలను బుధవారం డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్, డిప్యూటీ మేయర్ యంత్రాలను స్వయంగా నడిపి పరిశీలించారు. నగర విస్తీర్ణం, జనాభా పెరిగిన నేపథ్యంలో 66 డివిజన్లలో పారిశుధ్య పనులను వేగవంతం చేసేందుకు యంత్రాలను సమకూరుస్తున్నట్లు మేయర్ తెలిపారు. ఇప్పటికే రెండు ఫాగింగ్ యంత్రాలు, 66 ట్రైసైకిళ్లు అందుబాటులోకి తెచ్చామని, త్వరలో మరో రెండు వైకుంఠ రథాలు కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. అవసరమైన స్వీపింగ్ యంత్రాలు, డోజర్ల కొనుగోలుకు కూడా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

### డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం

నగరానికి ప్రధాన సమస్యగా మారిన డంపింగ్ యార్డును ప్రక్షాళన చేసేందుకు స్వచ్ఛ భారత్ మిషన్ కింద రూ.17 కోట్లతో బయోమైనింగ్ ప్రక్రియ ప్రారంభించనున్నట్లు మేయర్ తెలిపారు. యార్డులో సుమారు ఐదు లక్షల మెట్రిక్ టన్నుల చెత్త ఉండగా, ఇప్పటికే రెండు లక్షల మెట్రిక్ టన్నుల మేర తొలగించినట్లు పేర్కొన్నారు. రోజుకు సుమారు 150 మెట్రిక్ టన్నుల చెత్త వస్తోందని, పొగ, మంటలు వ్యాపించకుండా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ సహకారంతో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ పథకంలో కరీంనగర్‌కు రూ.840 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి టెండర్ ప్రక్రియ పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఇందులో డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి రూ.80 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. బయోమైనింగ్, వ్యర్థాల ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని పేర్కొన్నారు. కరీంనగర్‌ను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు పాలకవర్గం, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని మేయర్ తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org | గురువారం 15 అక్టోబర్ 2026



# సిరిసిల్ల బిడ్డగా..

## న్యాయసేవలో నాలుగు దశాబ్దాలు..

- చేనేత కార్మికుల సంక్షేమమే ధ్యేయం
- సిరిసిల్ల బిడ్డగా ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలని జ్యోతి కిరణ్ ఆకాంక్ష

# ప్రజాసేవకు సిద్ధం!



**సిరిసిల్ల (జనంసాక్షి) :** సిరిసిల్ల నియోజకవర్గం నుండి గతంలో ఎమ్మెల్యేగా పోటీ చేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,స్వతంత్ర సమరయోధులు గుడ్ల లక్ష్మి నరసయ్య కూతురు జ్యోతి కిరణ్.ఆమె కుటుంబానికి కాంగ్రెస్ పార్టీతో విడదీయలేని అనుబంధం ఉంది. ఆమె తండ్రి కీర్తిశేషులు గుడ్ల లక్ష్మి నరసయ్య స్వతంత్ర సమరంలో పాల్గొన్నారు. 1947-48 సంవత్సరంలో నిజాం నిరంకుశ పాలనకు, రజాకారులకు వ్యతిరేకంగా పోరాడారు. ఆనాడు సిరిసిల్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు.తన సొంత భూమిలో సిరిసిల్ల తాలూకా కాంగ్రెస్ కార్యాలయాన్ని సొంత డబ్బులతో ఏర్పాటు చేసి పార్టీ అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేశారు. గత నెల 30 న రాజన్న సిరిసిల్ల జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటనలో భాగంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక ఎమ్మెల్సీ స్థానం నేతన్నలకు కేటాయించాలని, దీనికి పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అదిస్థానం అనుమతి తీసుకోవాలని తెలిపారు. పద్మశాలికే ఎమ్మెల్సీ సీటు అని ప్రకటించడంతో ఒక్కసారిగా నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కింది. ముఖ్యమంత్రి ప్రకటనతో నేతన్న బిడ్డ జ్యోతి కిరణ్ కూడా ఎమ్మెల్సీ టికెట్ కోసం తన వంతు ప్రయత్నాలు చేస్తుంది.

హైకోర్టు న్యాయవాదిగా తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న గుడ్ల జ్యోతి కిరణ్ పేరును సిరిసిల్ల కు చెందిన కొందరు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కూడా ఆమె పేరును ప్రస్తావించడం కూడ రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. ఆమెకు ఎమ్మెల్సీ పదవికి కావలసిన అన్ని అర్హతలు



ఉన్నాయంటూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులే పార్టీ పెద్దల దృష్టికి తీసుకు వెళ్లినట్లు సమాచారం.రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన స్థానిక పద్మశాలి మహిళకు ఎమ్మెల్సీగా టికెట్ కల్పించాలని కోరుతున్నారు. తన నాన్నగారి వారసత్వంతో ప్రజాసేవ చేయాలనే ఉద్దేశంతో తాను ముందుకు వచ్చినట్లు ఇటీవల కాలంలో విలేకరుల సమావేశంలో ఆమె తెలిపారు.

పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన మహిళ బీఎస్సీ ఎల్.ఎల్.బి విద్యను జ్యోతి కిరణ్ అభ్యసించారు. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి వద్ద జూనియర్ గా పనిచేసిన ఆమె గత 30 సంవత్సరాలుగా అడ్వకేట్ గా కొనసాగారు.ఉస్మానియా యూనివర్సిటీలో (ఎంసిహెచ్) ప్రభుత్వ సంస్థలతో కౌన్సిల్గా,8 ఏళ్ల పాటు ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేసి పేదలకు ఉచిత న్యాయ సేవలు అందించారు.తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని తెలంగాణ ఉద్యమ నేత కొండ లక్ష్మణ్ బాపూజీ ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ ఉద్యమంలో అడ్వకేట్ జేఏసీ కోకొన్వీనర్ గా పనిచేసి జేఏసీలను సమన్వయం చేసుకుంటూ కోఆర్డినేట్ కమిటీ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ న్యాయవాదులకు రావలసిన వాటాల కోసం ఎన్నో పోరాటాలు నిరాహార దీక్షలు చేపట్టి తెలంగాణ వాటా సాధన కోసం పోరాడారు. స్వరాష్ట్ర ఉద్యమ సమయంలో అరెస్టై ఉస్మానియా విద్యార్థులు ఉద్యోగులకు ఉచిత న్యాయ సలహాలు అందిస్తూ వారికి కావలసిన సదుపాయాలను సమకూర్చారు. పోలీసుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన అమరుల కుటుంబాలను పరామర్శించడంతోపాటు నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలలో మానవ హక్కుల ఉల్లంఘనలపై పెండింగ్ కమిటీ సభ్యురాలుగా పనిచేసిన అనుభవం ఉంది.ఆమె కుటుంబానికి కాంగ్రెస్ పార్టీతో విడదీయలేని అనుబంధం ఉండడంతో ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా నేతన్న బిడ్డకు ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వాలని పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

### అధిష్టాన నిర్ణయమే తుది నిర్ణయం



సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభలో చేసిన ప్రకటనలో రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో నేతలకు ఒక టికెట్ కేటాయించాలని పిసిసి అధ్యక్షుని కోరారు.ఎమ్మెల్సీ టికెట్ నేతన్నలకు కేటాయిస్తే అధిష్టానం తీసుకుంటున్న నిర్ణయానికి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కట్టుబడి ఉంటారన్నారు.

**-కేకే మహేందర్ రెడ్డి, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి**

### ఆమెకు కాంగ్రెస్ పార్టీతో ఎంతో అనుబంధం



జ్యోతి కిరణ్ కుటుంబం కాంగ్రెస్ పార్టీకి ఎంతో అనుబంధం ఉంద న్నారు. స్వాతంత్ర పోరాటం నుండి నేటి వరకు ఆ కుటుంబం కాంగ్రెస్ పార్టీ కోసమే పాటుపడిందని, ఆమె తండ్రి గుడ్ల లక్ష్మీనరసయ్య స్వాతంత్ర సమరయోధుడన్నారు. 1962లో సిరిసిల్ల అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి స్వంత ఖర్చులతో సిరిసిల్ల తాలూకలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఏర్పాటు చేశారు. ప్రజా సమస్యలు తెలిసిన జ్యోతి కిరణ్ ఎమ్మెల్సీ పదవికి అర్హురాలన్నారు.

**- వైద్య శివప్రసాద్**

### ఎమ్మెల్సీకి జ్యోతి కిరణ్ అర్హురాలే.. :



ఎమ్మెల్సీ పదవికి జ్యోతి కిరణ్ పూర్తిగా అర్హురాలన్నారు. తన తండ్రి ఆశయాలకు తగ్గట్టుగా ఆమె 38 సంవత్సరాల న్యాయవాద వృత్తి అనుభవం ఉందన్నారు.తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న ఆమె ఎమ్మెల్సీ పదవి వస్తే బడుగు,బలహీన వర్గ ప్రజల సమస్యలు తెలిసిన వ్యక్తిగా ఆమె సమన్యాయం చేస్తుందన్నారు.

**- టోనీ (జలగం ప్రవీణ్ కుమార్)**

## జగిత్యాల మహిళా రైతుకు జాతీయ స్థాయి గుర్తింపు

**జగిత్యాల (జనంసాక్షి) :** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పెంబట్లకు చెందిన మహిళా రైతు విజయ సేంద్రీయ వ్యవసాయంతో సత్తా చాటుతున్నారు. కేవలం ఎకరం భూమిలోనే 14 రకాల కూరగాయలను సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తూ పలువురు రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.



ప్రకృతి అనుకూల సాగు పద్ధతులతో విజయ సాధిస్తున్న విజయకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందించే మహిళా కిసాన్ దివస్ అవార్డుకు ఆమె ఎంపికయ్యారు. ఈ నెల 15న నిర్వహించనున్న కార్యక్రమంలో విజయకు అవార్డును అందజేయనున్నారు. పరిమిత భూమిలో విభిన్న రకాల కూరగాయలను సేంద్రీయ పద్ధతుల్లో సాగు చేస్తూ విజయ సాధించిన తీరు ప్రశంసలు అందుకుంటోంది. విజయను ఆదర్శంగా తీసుకొని జిల్లాలోని ఇతర కూరగాయల సాగు రైతులు కూడా సేంద్రీయ పద్ధతులను అవలంబించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఆధునిక, ప్రకృతి అనుకూల సాగు విధానాలతో నాణ్యమైన దిగుబడులు సాధించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని పిలుపునిస్తున్నారు.

## వాటర్ బాటిల్ మూత గొంతులో ఇరుక్కుని చిన్నారి మృతి

**ఉట్కూరు (జనంసాక్షి) :** వాటర్ బాటిల్ మూత గొంతులో ఇరుక్కుని తొమ్మిది నెలల చిన్నారి మృతి చెందిన విషాద ఘటన నారాయణపేట జిల్లా ఉట్కూరు మండల కేంద్రంలోని దేవినగర్‌లో చోటుచేసుకుంది. స్థానికంగా నివాసం ఉంటున్న లక్ష్మణ్, గాయత్రి దంపతుల కుమారుడు ఆర్యవర్ధన్ మంగళవారం ప్రమాదవశాత్తు వాటర్ బాటిల్ మూత గొంతులో ఇరుక్కోవడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు.



గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా దవాఖానకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం చిన్నారి మృతి చెందాడు. చిన్నారి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అప్పటివరకు ఆడుకుంటూ ఉన్న చిన్నారి విగతజీవిగా మారడంతో కుటుంబంలో విషాదం నెలకొంది.




## డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధి మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఎండిఎంఎ డ్రగ్ ను విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను మాదాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు మాదాపూర్ ఎస్హెచ్ఓ వెల్లడించిన వివరాలు ప్రకారం... బుధవారం మధ్యాహ్నం సుమారు 3 గంటలకు మాదాపూర్ పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు మాదాపూర్ పిఎస్ పరిధి సిద్ధి వినాయక నగర్‌లోని రాజ్ టవర్స్ సమీపంలో మనకు ద్రవ్యాలను విక్రయిస్తున్నారన్న సమాచారం అందింది. దీంతో పక్కా ప్రాణాలకు అను సిద్ధం చేసుకున్న పోలీసులు ఆకస్మికంగా దాడిని నిర్వహించి ఎండిఎంఎ డ్రగ్ ను విక్రయిస్తున్న మరియు కొనుగోలు చేస్తున్న వినియోగదారులపై సోదాలు నిర్వహించడంతోపాటు ఘటనకు సంబంధించి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని సర్కిల్ ఇన్స్పెక్టర్ వివరించారు. కాగా ఆయన తెలిపిన నిందితుల వివరాల ప్రకారం... బంజారాహిల్స్ ప్రాంతానికి చెందిన కట్ల మాధవ్ అలియాస్ టోనీ(25), మాదాపూర్ ప్రాంతానికి



చెందిన డ్రగ్ పెడలర్ నామాల సిద్ధార్థ్(25) మరియు బంజర హిల్స్ ప్రాంతానికే చెందిన డ్రగ్ వినియోగదారుడైన ఎరుగు లోకేష్(26) ను అదుపులోకి తీసుకొని సోదాలు నిర్వహించగా వారి వద్దనుండి 1 గ్రాము ఎండిఎంఎ డ్రగ్స్‌ను 6 వేల రూపాయలకు కొనుగోలుచేసి హైదరాబాద్‌కు తీసుకువచ్చి, ఏ2 సిద్ధార్థ్‌కు 10 వేల రూపాయలకు విక్రయించినట్లు ప్రాథమిక విచారణలో నిందితుడు అంగీకరించినట్లు సిఐ తెలియజేశారు. కాగా ఈ డ్రగ్స్ సరఫరా వ్యవహారం సిద్దార్థ్ ద్వారా లోకేష్‌తో పాటు ఇతరులకు డ్రగ్స్ సరఫరా జరుగుతున్నట్లు అనుమానిస్తున్నామన్నారు. డ్రగ్ తోపాటు వారి వద్ద నుండి మూడు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు మీడియాకు తెలిపారు. దీంతో ముగ్గురు వ్యక్తులపై క్రైమ్ నెంబర్ 1605/2026 ను ఎన్డిపిఎస్ చట్టం ప్రకారం నమోదుచేసి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచామని, డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఇతర వ్యక్తులను గుర్తించేందుకు తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని సీఐ వెల్లడించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ విక్రయాలు మరియు సరఫరాకు సంబంధించిన సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని మాదాపూర్ పోలీసులు సందర్భంగా విజ్ఞప్తి చేస్తున్నారు.









Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370